PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 121 | విజయవాడ, శుక్రవారం 2 డిసెంబర్ 2022 | 6 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Friday 2 December 2022 | Rs

చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత

- మావోయిస్టులతో ప్రమాదముందంటూ అడ్డుకున్న పోలీసులు
- కోర్టు ఆర్డరు కావాలా అన్న టిడిపి అధినేత

• లోపలి పేజీలో.. •

4న విజయవాడకు రాష్ట్రపతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అధికారిక పర్యటనలో భాగంగా ఈ నెల 4వ తేదీన విజయవాడకు రానున్నారు. అదే రోజు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పౌర సన్మానానికి హాజరవుతారు. 4వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు ఢిల్లీలో బయలుదేరి 10.15 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడ నుండి తాడిగడపలోని మురళీ రిసార్ట్స్‌లో జరిగే ప్రభుత్వ పౌర సన్మానానికి హాజరవుతారు. అనంతరం రాజ్‌భవన్‌కు వస్తారు. అక్కడ గౌరవ విందులో పాల్గొన్న అనంతరం రెండుగంటలకు ప్రత్యేక విమానంలో విశాఖలోని నావల్ ఎయిర్‌స్టేషన్ ఐఎన్ఎస్ డేగాకు వెడతారు. అక్కడ జాతీయ రహదారుల విభాగం ప్రారంభోత్సవం, శంకుస్థాపనల్లో పాల్గొంటారు. రాత్రికి తిరుమల చేరుకుంటారు. 5వ తేదీ ఉదయం తిరుమలలో దర్శనం అనంతరం గోశాలను సందర్శించనున్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం విద్యార్థులతో ప్రత్యేకంగా భేటీ అవుతారు. అనంతరం నేరుగా ఢిల్లీ వెళ్లనున్నారు.

ధాన్యం సేకరణ దైన్యం

- ఏడాదేడాదీ తగ్గింపు
- విస్తీర్ణం, ఉత్పత్తి ఒకేలా ఉన్నా కొనుగోలులో కోతలు
- ప్రతి గింజకూ 'మద్దతు' ఉత్తిదే

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ప్రభుత్వ వరి ధాన్యం సేకరణ ఏడాదేడాది కోతలకు గురవుతోంది. గడచిన మూడు ఖరీఫ్ సీజన్లలో సేకరణ నేల చూపులే చూసింది. ఈ కాలంలో వరి సాగు విస్తీర్ణం ఇబ్బడిముబ్బడిగా తగ్గిందేమీ లేదు. ధాన్యం ఉత్పత్తిలో సైతం పెను మార్పులేమీ చోటు చేసుకోలేదు. అయినప్పటికీ ధాన్యం సేకరణ కత్తిరింపులను చవిచూసింది. సేకరణ అంతకంతకూ తగ్గడంతో రైతులకు ప్రభుత్వం కల్పిస్తామన్న మద్దతు ధర (ఎంఎస్‌పి) చాలా మట్టుకు దక్కట్లేదు. ఒక వైపు రైతు పండించిన ప్రతి గింజకూ ఎంఎస్‌పి ఇప్పించి తీరతామనగా, ఈ సమయంలోనే ప్రభుత్వ సేకరణ క్రమేపి దిగజారింది. వైసిపి అధికారంలోకొచ్చిన తొలేడాది ఖరీఫ్ కంటే మరుసటి సంవత్సరం ఖరీఫ్‌లో దాదాపు 50 వేల టన్నులు తగ్గగా, మూడవ ఏట నిరుడు ఏకంగా ఏడు లక్షల టన్నుల సేకరణ తగ్గింది. ఈ మారు ఖరీఫ్‌లో అదే ఒరవడి కనిపిస్తోంది. అందులో భాగంగా ధాన్యం సేకరణ లక్ష్యాన్ని సర్కారు పరిమితం చేసింది. సాగు విస్తీర్ణం, ఉత్పత్తి అంచనాల మేరకే టార్గెట్‌ను పరిమితం చేసినట్లు సమర్ధించుకుంటోంది.

కాకి లెక్కలు

2019-20 ఖరీఫ్‌లో 38.15 లక్షల ఎకరాల్లో వరి పంట వేశారు. వ్యవసాయశాఖ 80.13 లక్షల టన్నుల ధాన్యం లభిస్తుందని అంచనా వేసింది. అంతే ఉత్పత్తి వచ్చింది. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా 47.83 లక్షల టన్నులు సేకరించింది. 2020-21 ఖరీఫ్‌లో 40 లక్షల ఎకరాల్లో వరి సాగు కాగా తొలుత 85.16 లక్షల టన్నుల ధాన్యం వస్తుందని భావించారు. చివరాఖరికి 67.60 లక్షల టన్నులే లభించిందని సామాజిక సర్వే, అర్థ గణాంకశాఖ లెక్కలు వెల్లడించాయి. నవ్యాంధ్ర ఏర్పడ్డాక ఇదే తక్కువ ఉత్పత్తి. వర్షాలు, వరదల వలన దిగుబడి తగ్గింది. అయినప్పటికీ ఆ సంవత్సరం పౌర సరఫరాల శాఖ 47.32 లక్షల టన్నులు సేకరించింది. నిరుడు 2021-22 ఖరీఫ్‌లో 40.77 లక్షల ఎకరాల్లో వరి వేశారు. తొలుత 83.56 లక్షల టన్నులొస్తాయనుకున్నారు. ప్రణాళికాశాఖ నాల్గవ ముందస్తు అంచనాలకొచ్చేసరికి ధాన్యం ఉత్పత్తి 70.96 లక్షల టన్నులని నిర్ధారించారు. కాగా నిరుడు పౌరసరఫరాల శాఖ 40.31 లక్షల టన్నులనే సేకరించింది. అంతకుముందు ఏడాది కంటే ఏడు లక్షల టన్నులకు కోత పడింది. ప్రస్తుత ఖరీఫ్ 2022-23లో 35.25 లక్షల ఎకరల్లోనే వరి సాగవుతుందని, 67.89 లక్షల టన్నులొస్తాయని అంచనా వేసి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని 37 లక్షల టన్నులకు పరిమితం చేశారు. అసలే గతేడాది సేకరణ తగ్గగా, అంతకంటే ఈ తడవ టార్గెట్‌ను కుదించారు.

టార్గెటే తగ్గిన నేపథ్యంలో చివరాఖరికి సేకరణ ఇంకెంత తగ్గుతుందోనన్న ఆందోళన రైతుల్లో నెలకొంది. కాగా సాగును కావాలని తగ్గించారని, 37 లక్షల ఎకరాల వరకు ఉందని చెబుతున్నారు.

ఖరీఫ్ ధాన్యం సేకరణ

సంవత్సరం	సాగు విస్తీర్ణం లక్షల ఎకరాలు	ఉత్పత్తి లక్షల టన్నులు	సేకరణ లక్షల టన్నులు
2019-20	38.15	80.13	47.83
2020-21	40.02	67.60	47.32
2021-22	40.77	70.96	40.31
2022-23 (టార్గెట్)	35.25	67.89	37.00

కోవిడ్‌లో బానే ఉంది

మొదటి దశ కోవిడ్ సమయానికి 2019 ఖరీఫ్ ధాన్యం సేకరణ పూర్తయింది. ఆ ప్రభావం రబీపై పడింది. రెండవ దశ కోవిడ్ విజృంభణ వెనకపట్టు పట్టాక 2020 ఖరీఫ్ ధాన్యం సేకరణ జరిగింది. కోవిడ్ ప్రభావం ఉన్నా సేకరణ పర్లేదనిపించింది. 2021లో మూడవ దశ ఒమిక్రాన్ అన్నప్పటికీ పెద్దగా ఇబ్బందేమీ రాలేదు. అయినప్పటికీ నిరుడు సేకరణ బాగా పడిపోయింది. ఈ ఏడాది కోవిడ్ లేకపోయినా సేకరణ లక్ష్యం తగ్గించారు. కేంద్ర షరతులు, కేంద్రం నుంచి నిధులు రాకపోవడం, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ఇబ్బందుల వలన నిరుడు ధాన్యం సేకరణ తగ్గింది. మూడు వారాల్లో ధాన్యం ఇచ్చిన రైతులకు సొమ్ము చెల్లించాల్సి ఉండగా నెలల పర్యంతం చెల్లించలేదు. ఇ-క్రాప్, రైతు భరోసా కేంద్రాల్లో ముందస్తు రిజిస్ట్రేషన్, కూపన్లు, గోనె సంచుల కొరత, తేమశాతం వంటి కఠిన నిబంధనల వలన రైతులు వ్యాపారులకు, మధ్య దళారులకు పంటను తెగనమ్ముకుంటున్నారు. కౌలు రైతుల వెతలు మరీ దారుణం.

వైద్య ఆరోగ్యశాఖపై క్యాంపు కార్యాలయంలో సమీక్షిస్తున్న సిఎం వైఎస్ జగన్

ఆరోగ్య శ్రీ సేవల్లో
తప్పు జరిగితే కఠిన చర్యలు

వైద్య ఆరోగ్యశాఖ సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆరోగ్యశ్రీ సేవల్లో తప్పులు జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపుకార్యాలయంలో వైద్యఆరోగ్యశాఖపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్, నాడు నేడు తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌లో క్రమం తప్పకుండా మందులు ఇవ్వడంతోపాటు ఎలాంటి అహారం తీసుకోవాలో సూచనలు కూడా ఇవ్వాలన్నారు. ఈ విధానాన్ని రాష్ట్ర వ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమలు చేయడానికి సిద్ధం కావాలన్నారు. అవసరాలకు తగిన విధంగా 104 వాహనాలను సమకూర్చుకోవాలని ఆదేశించారు. ఎక్కడా ఖాళీలు లేకుండా సిబ్బందిని భర్తీ చేయాలని, ఆలోగా విలేజ్ క్లినిక్స్ నిర్మాణాలను పూర్తి చేయాలని చెప్పారు. బాలింతల్లో ఎనీమియాతో బాధపడుతున్న వారిని గుర్తించి ఆ డేటాను స్త్రీ, శిశుసంక్షేమశాఖకు బదిలీ చేయాలని పేర్కొన్నారు. . పిల్లలు, గర్భవతులు, అలాగే మందులనూ అందించే ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామ సందర్శనలో భాగంగా ఫ్యామిలీ డాక్టర్ ఆ గ్రామంలో మంచానికి పరిమితమైన రోగులను తప్పనిసరిగా కలవాలన్నారు. వైద్య ఆరోగ్య రంగంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత విస్తృతంగా వినియోగించాలని, ఆశావర్కర్స్ స్థాయి వరకూ ట్యాబులు లేదా సెల్‌ఫోన్లు అందించాలని చెప్పారు. అందులో వైద్య ఆరోగ్యరంగానికి సంబంధించిన యాప్‌లన్నీ ఉండాలన్నారు. ఏ వ్యాధికి ఏ ఆస్పత్రిలో చికిత్స లభిస్తుందో బాధితులకు తెలిసేలా చూడాలని, దీనికోసం నెట్‌వర్క్ ఆస్పత్రులతో కూడిన వివరాలతో యాప్‌ను రూపొందించాలన్నారు. ఆరోగ్యశ్రీ సాఫ్ట్‌వేర్‌నూ మెరుగుపరచాలని సూచించారు. ఫ్యామిలీ డాక్టర్ గ్రామాలకు వెళ్లిన సమయంలో రియల్‌టైం డేటాను రికార్డు చేయాలని సూచించారు. దీనివల్ల సిబ్బంది మధ్య సమన్వయం కుదురుతుందని తెలిపారు. దీనికోసం సమర్ధ యంత్రాంగం ఉండాలన్నారు. ఆరోగ్య రంగంపై ఎలాంటి ఫిర్యాదులునైనా 104 ద్వారా స్వీకరించాలని, అన్ని చోట్లా ఈ నెంబర్ కనిపించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నెగెటివ్ ఫీడ్‌బ్యాక్‌పై ఖచ్చితంగా చర్యలు తీసుకోవాలని, డయాలసిస్ పేషెంట్లకు సేవలు అందించేందుకు 108 వాహనాలు వినియోగించుకోవాలని చెప్పారు. ఈ సమీక్షలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజనీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.జవహర్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ ఎం.టి.కృష్ణబాబు కార్యదర్శి నవీన్‌కుమార్, డైరెక్టర్ నివాస్ తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్ తొలిదశలో
60 శాతం పైగా పోలింగ్

- ధరాఘాతంపై పలుచోట్ల ఓటర్ల నిరసనలు
- ఇవిఎంలపై కాంగ్రెస్ ఫిర్యాదు

అహ్మదాబాద్ : గుజరాత్ శాసనసభ ఎన్నికల్లో తొలి విడత పోలింగ్ చెదరుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది.సాయంత్రం 5 గంటల వరకు 57 శాతం పోలింగ్ నమోదయినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. 19 జిల్లాల్లో 89 స్థానాలకు జరిగిన ఈ ఎన్నికల్లో 788 మంది అభ్యర్థుల రాజకీయ భవితవ్యాన్ని ఇవిఎంల్లో నిక్షిప్తం చేశారు. ఉదయం 8 గంటలకు ఓటింగ్ ప్రక్రియ మొదలు కాగా సాయంత్రం 5 దాటిన తర్వాత కూడా పలువురు ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూల్లో నిలబడి కనిపించారు. తొలి విడత పోలింగ్‌లో ఆమాద్మీ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థిగా బరిలోకి దిగిన ఇసుదన్ గఢ్వీ (కంభాలియా స్థానం), ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు గోపాల్ ఇటాలియా (కటర్‌గామ్)తో పాటు బిజెపి నుంచి క్రికెటర్ రవీంద్ర జడేజా భార్య రివబవ జడేజా, సిట్టింగ్ ఎమ్మెల్యేలు హర్ష సంఘ్వి, పూర్ణేష్ మోడీ, లలిత్ కటథర, లలిత్ వోసోయా, రుత్విక్ మక్వానా పోటీ పడుతున్నారు.

కాగా దాదాపు 50కి పైగా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ యంత్రాలు (ఇవిఎంలు) పని చేయలేదని ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ ఫిర్యాదు చేసింది. సౌరాష్ట్ర ప్రాంతంలో అనేక చోట్ల ఇవిఎంలు మొరాయించాయని, జామ్‌నగర్‌లోనూ, రాజ్‌కోట్‌లోనూ ఇవిఎంలు సరిగా పని చేయలేదని ఆ పార్టీ అధికార ప్రతినిధి అలోక్ శర్మ తెలిపారు. దీనిపై ఇసికి రాతపూర్వక ఫిర్యాదు అందజేసినట్లు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వినూత్న రీతిలో నిరసనలు

పోలింగ్ కేంద్రాలను నిరసన కేంద్రాలుగా మలుచుకొని పలుచోట్ల ప్రజానీకం నిరసన గళాన్ని వినిపించాయి. వంట గ్యాస్‌తో సహా నిత్యావసరాల ధరలన్నీ నింగినంటుతున్నాయంటూ అమ్రేలీ, రాజ్‌కోట్‌లలో పలు చోట్ల వంట గ్యాసు సిలిండర్లను తీసుకొచ్చి నిరసనలు తెలిపారు. మల్ధారి సామాజిక తరగతికి చెందిన ఒక ఓటరు పశువుల పెంపకందార్లు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించేందుకు ఆవు, దూడ ను పోలింగ్ కేంద్రం వద్దకు తీసుకొచ్చారు.

ఒడిశాలో రోడ్డు ప్రమాదం

- నలుగురు విశాఖ వాసులు మృతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ, విశాఖ

ఒడిశా రాష్ట్రం ఖుర్దా రోడ్డు జాతీయ రహదారిపై ఆగి ఉన్న లారీని వెనుక నుంచి కారుతో ఢీకొట్టిన ఘటనలో విశాఖకు చెందిన నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో విశాఖ బీచ్ రోడ్డు ప్రాంతానికి చెందిన బ్యూటీషియన్ మారియా ఖాన్(24), విశాలాక్షినగర్ ప్రాంతానికి చెందిన రాఖి(45), ఫోటోగ్రాఫర్ కబీర్, మరో వ్యక్తి చనిపోయినట్లు ప్రాథమిక సమాచారం. ఈ నలుగురు భువ నేశ్వర్‌లోని ఓ వివాహానికి వెళుతుండగా ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం విషయం తెలిసిన వెంటనే మృతుల బంధువులు, స్నేహితులు ఖుర్దాకు బయలుదేరి వెళ్లారు.

నకిలీ సిబిఐ అధికారితో సంబంధాలపై
గంగుల, రవి చంద్ర విచారణ

• లోపలి పేజీలో.. •

త్రిపురలో బిజెపి హత్యాకాండ

- సిపిఎం కార్యకర్తలపై విరుచుకుపడిన కాషాయ మూకలు
- ఒకరు మృతి, పలువురికి తీవ్రగాయాలు

అగర్తలలో ఆందోళన చేస్తున్న సిపిఎం కార్యకర్తలు

ఇండియా న్యూస్ నెట్ వర్క్, యంత్రాంగం - అగర్తల

త్రిపురలో బిజెపి గూండాలు రెచ్చిపోయారు. నాలుగున్నరేళ్ల నిర్బంధాన్ని ప్రతిఘటిస్తూ స్థానిక కార్యాలయాన్ని సిపిఎం తిరిగి ప్రారంభిస్తోందన్న అక్కసుతో అధికార పార్టీ గూండాలు మారణా యుధాలతో దాడులకు పాల్పడ్డారు. కార్యాలయ ప్రారంభోత్సవానికి విచ్చేసిన ప్రజలపైనా విరుచుకు పడ్డారు. సిపిఎం సభ్యుడు షాహిద్ మియా (65)ను దారుణంగా హత్య చేశారు. కాషాయ మూకలు సాగించిన ఈ హింసాకాండ సెపాహిజలా జిల్లా ఛరిలాంలో బుధవారం చోటు చేసుకుంది. 2018లో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాష్ట్రంలో శాంతిభద్రతలు ఘోరంగా క్షీణిస్తూ వచ్చాయి. ప్రతిపక్షాలపై ప్రధానంగా సిపిఎంపైనా, వామ పక్షాలపైనా తీవ్ర అణిచివేత కొనసాగిస్తోంది. పట్టపగలే దాడులకు మిగతా 5లో

దుండగులపై కఠిన చర్యలకు సిపిఎం పొలిట్‌బ్యూరో డిమాండ్

త్రిపురలో బిజెపి సాగించిన దౌర్జన్యకాండను సిపిఎం పొలిట్‌బ్యూరో తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు గురువారం నాడు ఒక ప్రకటన విడుదల చేసింది. షాహిద్ మియాను హత్య చేయడంతో పాటు తీవ్రస్థాయిలో హింసాకాండకు పాల్పడిన దుండగులపై పోలీసులు తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. త్రిపుర శాసనసభ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరగాల్సివున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని, పోలీసులను దుర్వినియోగం చేస్తూ రాజకీయ ప్రత్యర్థులను భయభ్రాంతులకు గురి చేసేందుకే అధికార పార్టీ ఇలాంటి దురాగతాలకు, దౌర్జన్యాలకు పాల్పడుతోందని సిపిఎం విమర్శించింది. రాష్ట్రంలో స్వేచ్ఛ యుతంగా, సజావుగా ఎన్నికలు జరగాలంటే తక్షణమే ప్రజాస్వామ్యాన్ని, ప్రజాతంత్ర హక్కులను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని కోరింది.

సుప్రీంలో మహిళా ధర్మాసనం

- చరిత్రలో మూడోసారి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ సర్వోన్నత న్యాయస్థానంలో అరుదైన ఘట్టం చోటు చేసుకుంది. సుప్రీం కోర్టు చరిత్రలో మూడోసారి మహిళా న్యాయమూర్తులతో కూడిన ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు అయింది. జస్టిస్ హిమా కోహ్లీ, జస్టిస్ బేలా ఎం. త్రివేదితో కూడిన ధర్మాసనాన్ని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ ఏర్పాటు చేశారు. ఈ ధర్మాసనం గురువారం పలు కేసులను విచారించింది. పది వివాహ సంబంధిత వివాదాల పిటిషన్లు, మరో పది బెయిల్ పిటిషన్లను న్యాయమూర్తులు విచారించారు. 1950లో ఏర్పడ్డ సుప్రీం కోర్టులో మూడోసారి మహిళా న్యాయ మూర్తులతో కూడిన ధర్మాసనం ఏర్పాటు అయింది. అయితే తొలిసారి 2013లో జస్టిస్ జ్ఞాన సుధా మిశ్ర, జస్టిస్ రంజనా ప్రసాద్ దేశాయ్‌తో కూడిన ధర్మాసనం ఏర్పాటైంది. ఈ ధర్మాసనం ఏర్పాటు యాదృచ్ఛికంగానే జరిగింది. అప్పటి ప్రిసైడింగ్ న్యాయమూర్తి ఆఫ్తాబ్ ఆలమ్ గైర్హాజరుతో మిగతా 5లో

జి 20 అధ్యక్ష బాధ్యతల్లో భారత్

ఏకాభిప్రాయం సాధనకు కృషి :ఎస్.జైశంకర్

న్యూఢిల్లీ : జి 20 అధ్యక్ష బాధ్యతలను భారతదేశం గురువారం స్వీకరించింది. బాధ్యతలు చేపట్టిన తరువాత మొద వటిసారిగా యూనివర్శిటీ కనెక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 75వి శ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు, ప్రముఖ విద్యావేత్తలు, రీసెర్చర్లు, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ మాట్లాడుతూ విస్తృతమైన సంప్రదింపుల ద్వారా అంతర్జాతీయ అంశాలపై ఏకాభిప్రాయాన్ని సాధించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలతో కూడిన గ్లోబల్ సౌత్ (పారిశ్రామిక ప్రపంచం) దేశాల వాణిని వినిపించాలన్నది భారత్ లక్ష్యంగా వుంటుందని చెప్పారు. అంతర్జాతీయంగా చాలా కీలకమైన సమయంలో భారత్ ఈ బాధ్యతలు చేపట్టిందని చెప్పారు. ఇంధన భద్రత, ఆహార భద్రత, వైద్య సంరక్షణ, వాతావరణ మార్పులపై కార్యాచరణ, వాతావరణ న్యాయం వంటి అంశాలపై ఆందోళనలను భారత్ లేవనెత్తుతుందని అన్నారు. ఈ కార్యక్రమం కింద దేశవ్యాప్తంగా జి-20 అధ్యక్ష బాధ్యతల ప్రాముఖ్యతను గురించి అవగాహన కలిగించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) ఛైర్మన్ ఎం.జగదీష్ కుమార్ తెలిపారు.

నేటి నుంచి ఫార్మెటివ్-2 పరీక్షలు

- గంట ముందు వాట్సాప్‌కు ప్రశ్నాపత్రాలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నుంచి ఫార్మెటివ్-2 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. శుక్ర, శని, సోమవారాల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. ఒకటి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఉదయం ఒక పరీక్ష, మధ్యాహ్నం మరో పరీక్షను 45 నిమిషాల షెడ్యూల్ ప్రకారం జరపాలి. ఆరు నుంచి 8వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.15 గంటలకు ఒక పరీక్ష, 3.15 నుంచి నాలుగు గంటల వరకు మరో పరీక్ష నిర్వహించాలి. 9, 10వ తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి 10.15 గంటలకు ఒక పరీక్ష, 11.15 నుంచి 12 గంటలకు మరో పరీక్ష నిర్వహించాలి. గతేడాది నుంచి విద్యాశాఖ వాట్సాప్‌లో ప్రశ్నపత్రాన్ని పంపుతోంది. గతేడాది ఒకరోజు ముందుగా ప్రశ్నాపత్రాన్ని పంపగా ఈసారి కేవలం ఒక గంట ముందు మాత్రమే పంపనుంది. వాట్సాప్‌లో వచ్చిన ప్రశ్నాపత్రాన్ని ఉపాధ్యాయులు బోర్డుపై రాసి విద్యార్థుల చేత పరీక్షలు రాయించాలి.

విమాన ఇంధన ధరలు తగ్గింపు

- కేంద్ర ప్రభుత్వ నిర్ణయం
- సాధారణ పెట్రో ధరల్లో మార్పు లేదు

న్యూఢిల్లీ : విమానాలకు వాడే ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ -ఎటిఎఫ్) ధరలు తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కేంద్రం నుండి అందిన సూచనల మేరకు 2.3 శాతం ఎటిఎఫ్ ధరలను చమురు సంస్థలు తగ్గించాయి. ఈ మేరకు గురువారం ప్రకటన చేశాయి. కిలో లీటర్‌కు (వెయ్యి లీటర్లకు) 2,775 రూపాయలు తాజాగా తగ్గించారు. దాంతో డిసెంబర్ 1న ముంబాయిలో లీటర్ విమానయాన ఇంధనం ధర రూ. 116.50, ఢిల్లీలో రూ.117.58, కొల్‌కతాలో రూ. 122.22 గా ఉంది. ఎటిఎఫ్ ధరను గత నెలలోనూ కిలోలీటర్‌కు రూ.4,842.37 తగ్గించడం గమనార్హం. కాని సాధారణ పెట్రో ఉత్పత్తుల ధరల్లో నామమాత్రపు తగ్గింపు కూడా లేదు. చమురు సంస్థలు చేసిన ప్రకటనలో పేద, మధ్య తరగతి ప్రజానీకం పెద్ద ఎత్తున వినియోగించే పెట్రోల్, డీజల్ ఊసే లేదు. ఎల్‌పిజి సిలిండర్ ధరలు కూడా తగ్గలేదు. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 10 నెలల కనిష్టానికి పడిపోయినా దాని ప్రయోజనాలను దేశ ప్రజలకు నామమాత్రంగా కూడా మోడీ సర్కారు అందివ్వలేదు,. ఈ ఏడాది మార్చిలో ప్రపంచ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధర 112.87 డాలర్లుగా ఉండగా.. గత కొన్ని నెలలుగా క్రమంగా తగ్గుతూ.. ప్రస్తుతం ఈ ధర 88.66 డాలర్లకు పడిపోయిన విషయం తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై కాంగ్రెస్ పార్టీ గురువారం స్పందించింది. ప్రపంచ ముడి చమురు ధరలు పది నెలల కనిష్ఠానికి చేరినా.. బిజెపి దోపిడీ మాత్రం గరిష్ఠస్థాయిలో ఉందని ఆ పార్టీ అధ్యక్షుడు ఖర్గే ట్వీట్ చేశారు. దేశంలో అధిక ద్రవ్యోల్బణంతో ప్రజలు బాధలు పడుతుంటే.. ప్రధాని మోడీ మాత్రం పన్నుల వసూళ్లలో బిజీగా ఉన్నారని రాహుల్ విమర్శించారు.

చంద్రబాబువి ఓటు బ్యాంకు రాజకీయాలు

మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో బిసిల ఆత్మగౌరవం పెంచేలా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ బిసి డిక్లరేషన్‌కు మించిన కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు తెలిపారు. బిసిల పార్టీ అని చెప్పుకునే తెలుగుదేశం ఏనాడూ బిసిలకు ప్రాధాన్యతను ఇవ్వలేదని, చంద్రబాబునాయుడు కేవలం ఓటుబ్యాంకు రాజకీయాలకే బిసిలను వాడుకున్నారని విమర్శించారు. గురువారం తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 139 కులాలను గుర్తించి వారిని సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా ముందుకు తెచ్చేందుకు 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేశారని అన్నారు.

ఇంటర్ సెకండియర్ ఫీజు పెంపు

- చెల్లించేందుకు ఈ నెల 19 తుది గడువు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫీజులు స్వల్పంగా పెరిగాయి. పరీక్షల ఫీజు షెడ్యూల్‌ను ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఎంవి శేషగిరి బాబు గురువారం విడుదల చేశారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థుల ఫీజును ఈ నెల 19వ తేదీలోపు చెల్లించాలని పేర్కొన్నారు. గతేడాది రెగ్యులర్ విద్యార్థులు జనరల్ కోర్సులకు ఫీజు రూ.700 ఉండగా దీనిని రూ.720కి పెంచారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు రాసే విద్యార్థులకు రూ.1200 ఫీజును రూ.1230కి పెంచారు. వొకేషనల్ విద్యార్థులకు రూ.700 నుంచి రూ.720కి, ప్రాక్టికల్స్ ఫీజు రూ.200 నుంచి రూ.210 చేశారు. ఇంప్రూవ్‌మెంట్ పరీక్షకు అర్హ విద్యార్థులు గతేడాది రూ.1200 చెల్లించగా ఇప్పుడు రూ.1230 చెల్లించాలి. సైన్స్ విద్యార్థులకు రూ.1430 చెల్లించాల్సి ఉంటుంది. ఈ నెల 19వ తేదీతో ఎలాంటి అపరాధం రుసుమూ లేకుండా ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉంది. రూ.120 అపరాధ రుసుముతో ఈ నెల 26వ తేదీ వరకు, రూ.500తో జనవరి ఒకటోతేదీ వరకూ రూ.1000తో జనవరి తొమ్మిదివరకు, రూ.2 వేలతో 17వ తేదీ వరకు, రూ.3 వేలతో 23వ తేదీ, రూ.5వేలతో జనవరి 30వ తేదీ వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు.

క్లాస్-3 కేటగిరీలోకి ఆరోగ్య మిత్రలు

- కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్ర వ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖలో ఆరోగ్యశ్రీ పథకంలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న ఆరోగ్యమిత్రలను ప్రభుత్వం క్లాస్-3 ఉద్యోగులుగా గుర్తించి వేతనాలు చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్, వర్కర్స్ జెఎసి ఛైర్మన్ ఎవి నాగేశ్వరరావు, ఇ విజయ్‌కుమార్‌రాజు వైద్య విధాన పరిషత్, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌కు, ఆరోగ్యశ్రీ సిఇఒకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీని విజయవంతంగా అమలు చేయడంలో ఆరోగ్యమిత్రలదే కీలకపాత్ర అని తెలిపారు. అలాంటి ఆరోగ్యమిత్రలకు కనీసవేతనాలు అమలుకాక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వివరించారు. కనీస వేతనంగా రూ 21 వేలను చెల్లించాలని కోరారు. టిఎ, డిఎలు, పదోన్నతులు కల్పించాలని, కారుణ్య నియమకాలకు అవకాశం కల్పించాలని కోరారు. పిఎఫ్, ఈఎస్ఐ లాంటి పథకాలను అమలు చేయడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలనూ వర్తింప జేయాలని కోరారు.

సమావేశాలకు ఆహ్వానించండి

- అజయ్‌జైన్‌కు గ్రామ,వార్డు సచివాలయ సంక్షేమ సంస్థ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలపై జరిగే సమావేశాలకు ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంస్థను కూడా ఆహ్వానించాలని నాయకులు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్‌ను కోరారు. ఇటీవల నూతనంగా సంస్థ ఏర్పడిన నేపథ్యంలో రాష్ట్ర, జిల్లా కమిటీల వివరాలను ఎపిజెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తదితరులు జైన్‌కు సమర్పించారు. ఈ సందర్భంగా బొప్పరాజు, నాయకులు అర్లయ్య మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు వెంటనే చేపట్టాలని కోరారు. రెండో నోటిఫికేషన్ ద్వారా రిక్రూట్ అయిన వారికి ప్రొబేషన్ డిక్లరేషన్ ప్రక్రియను వెంటనే మొదలు పెట్టాలని కోరారు. శానిటేషన్ సెక్రటరీలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. వార్డు ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలకు లైన్ డిపార్టుమెంటుకు సంబంధించి హెచ్‌ఒడి లేకపోవడంతో సమస్యలు పరిష్కారం అవడం లేదని తెలిపారు. జైన్‌ను కలిసిన వారిలో ఎపిజెఎసి సెక్రటరీ జనరల్ వై.వి.రావు, కోశాధికారి మురళీకృష్ణనాయుడు, కో ఛైర్మన్ మల్లీశ్వరరావు, సంగీతరావు, కోనా ఆంజనేయకుమార్ తదితరులు ఉన్నారు.

చంద్రబాబు పర్యటనలో ఉద్రిక్తత

- మావోయిస్టులతో ప్రమాదముందంటూ అడ్డుకున్న పోలీసులు
- కోర్టు ఆర్డరు కావాలా అన్న టిడిపి అధినేత

పోలవరం రోడ్డుపై బైఠాయించిన చంద్రబాబు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి
చంద్రబాబు పోలవరం పర్యటనలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గురువారం సాయంత్రం ఆ ప్రాంతానికి చేరుకున్న ఆయన పోలవరం ప్రాజెక్టు వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీనిని పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికే పోలవరం ప్రాజెక్టు వెళ్లే దారిని బారికేడ్లతో మూసివేయడంతోపాటు, వాహనాలను అడ్డుగా పెట్టారు. దీంతో టిడిపి నాయకులతోకలిసి చంద్రబాబు రోడ్డుపైనే బైఠాయించారు. తనను ఏ కారణంతో అడ్డుకుంటున్నారో చెప్పాలని బాబు నిలదీశారు. దీనికి వారు 'మీకు మావోయిస్టుల ప్రమాదం ఉంది. ప్రస్తుతం మావోయిస్టుల వారోత్సవాలు జరుగుతున్నాయి. పైగా రాత్రిపూట వెళ్లడం కుదరదు' అని చెప్పారు. దీంతో అదే విషయాన్ని రాతపూర్వకంగా ఇవ్వాలని పోలీసులను కోరారు. దీనికి వారు నిరాకరించడంతో రేపు, ఎల్లుండి, వారం, నెల తర్వాత ఎప్పుడు రమ్మంటారో చెబితే అప్పుడే వస్తానని బాబు అన్నారు. దీనికి కూడా పోలీసులు సమాధానం ఇవ్వకపోవడంతో టిడిపి నాయకులు బారికేడ్లను దాటుకుని వెళ్లడానికి ప్రయత్నించారు. దీంతో పోలీసులు, టిడిపి నాయకులకు మధ్య తోపులాట సైతం చోటుచేసుకుంది. చంద్రబాబు మాట్లాడుతూ ప్రతిపక్షనేతగా తనకు ఎక్కడికైనా వెళ్లే హక్కు ఉందన్నారు. ప్రాజెక్టు చూడాలంటే కోర్టులకు వెళ్లి ఆర్డర్లు తెచ్చుకోవాలా అని ప్రశ్నించారు.' ప్రజాచైతన్యం రావాలి.. ప్రభుత్వంపై ప్రజలు తిరగబడాలి. ఇలాంటి ఘటన నా జీవితంలో ఎన్నడూ చూడలేదు' అని చంద్రబాబు అన్నారు. ఆ తర్వాత కాన్వాయ్‌లోని ఓపెన్‌టాప్ జీపుపైకి వెళ్లి చంద్రబాబు ప్రసంగిచారు. టిడిపి అధికారంలోకి వస్తే పోలవరం మండలాలు అన్నింటినీ కలిపి ప్రత్యేక జిల్లాగా చేస్తానని తెలిపారు. కర్నూలో హైకోర్టు అంటూ అందరినీ మోసం చేశారన్నారు. గిరిజనుల హక్కుల కాపాడేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని తెలిపారు. సభ ముగిసిన అనంతరం కొవ్వూరు నియోజకవర్గ పర్యటనకు వెళ్లారు. అంతకుముందు నరసన్నపాలెం సమీపంలోని దండమూడి రామలక్ష్మి కల్యాణ మండపంలో బిసిల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. అధికారంలోకొచ్చాక కల్లు గీత కార్మికులకు 20 శాతం మద్యం దుకాణాలు కేటాయిస్తామన్నారు. బిసిలకు సంబంధించి 54 సాధికారిక కమిటీలు ఏర్పాటు చేశామని, వీరంతా బిసిల సమస్యలను తెలుసుకుంటారని తెలిపారు. టిడిపి అధికారంలోకొస్తే ఇళ్ల స్థలాలు రద్దు చేస్తానని చెబుతున్నారని, అలాంటిదేమీ జరగదని భరోసా ఇచ్చారు. ఇప్పుడున్న సెంటు, సెంటున్నరకు అదనంగా ఇచ్చి ఆస్తి ఏర్పాటు చేస్తామన్నారు. పింఛన్ రూ.మూడు వేలు ఇస్తానని చెప్పి జగన్ మోసం చేశారన్నారు. జాబ్ రావాలంటే బాబు రావాలన్నారు. రాష్ట్రం నుంచి పారిశ్రామికవేత్తలు పారిపోతున్నారన్నారు. ఆరు వేల స్కూళ్లు మూతపడ్డాయని, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశారని తెలిపారు. పథకాల పేరుతో గోరంత ఇచ్చి.. కొండంత దోపిడీ చేస్తున్నారని విమర్శించారు. అందరిలోనూ మార్పు రావాలని, వైసిపిని బంగాళాఖాతంలో కలిపేయాలంటూ పిలుపునిచ్చారు. క్విట్ జగన్ అంటూ నినాదాలు చేయించారు.

బిజెపిని గద్దె దించితేనే మనుగడ

- సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకృష్ణ

సభలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గన్నవరం
లౌకిక, ప్రజాతంత్రవాదులు ఐక్యంగా పోరాడితేనే దేశం మనుగడ సాగిస్తుందని సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, కె.రామకష్ణ అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోన్న బిజెపిని గద్దె దించకపోతే దేశం ప్రమాదంలో పడుతుందని తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరం మండలం బుద్ధవరం గ్రామంలో కమ్యూనిస్టు ఉద్యమ నాయకులు చింతపల్లి లక్ష్మారాయుడు, కాశి అన్నపూర్ణమ్మ పేర్లతో నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం ప్రారంభోత్సవం గురువారం జరిగింది. కల్యాణ మండపాన్ని లక్ష్మారాయుడు కుమారులు నాగభూషణరావు, పాపారావు ప్రారంభించారు. అనంతరం సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో వి.శ్రీనివాసరావు, కె.రామకష్ణ మాట్లాడుతూ.. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత అరాచకం, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, కూల్చివేతలు వంటి దురాగతాలు పెరిగిపోయాయన్నారు. తొమ్మిది రాష్ట్రాల్లో ప్రభుత్వాలను అడ్డగోలుగా కూల్చివేసి అధికారాన్ని లాక్కోవడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. అధికారం కోసం అనేక అడ్డదారుల్లో తొక్కుతూ రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతోందని విమర్శించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిపై ఆదాయపన్ను, ఇడిలతో దాడులు చేయించి తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి నేతలు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మాని దేశ, రాష్ట్ర ప్రయోజనాల కోసం పోరాడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, సిహెచ్.బాబూరావు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, మాజీ ఎమ్మెల్యే ముసునూరు రత్నబోస్, కాంగ్రెస్ నాయకులు వింత సంజీవరెడ్డి, ప్రముఖులు డాక్టర్ మద్దుకూరి విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

పిసిబి సభ్య కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఆంధ్రప్రదేశ్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ మెంబర్ సెక్రటరీగా ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరక్టర్‌గా వున్న ప్రవీణ్‌కుమార్‌ను పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ఫుల్ అడిషనల్ చార్జ్ మెంబర్ సెక్రటరీగా నియమిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది.
పంచాయితీరాజ్ ఇంజనీరింగ్ విభాగం ఫుల్ అడిషనల్ చార్జ్ ఇఎన్‌సిగా బాలూనాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ గోపాలకృష్ణ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు.

7న జయహో బిసి మహాసభ

- 84 వేలమంది వైసిపి బిసి ప్రజాప్రతినిధులకు ఆహ్వానం
- హాజరుకానున్న సిఎం
- జయప్రదం చేయాలని పోస్టర్ ఆవిష్కరణ

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జయహో బిసి పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న బిసి నాయకులు, పార్లమెంట్ సభ్యులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రాష్ట్రంలో బిసిల్లో రాజకీయ చైతన్యం నింపేందుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఈనెల 7న విజయవాడలోని ఇందిరాగాంధీ స్టేడియంలో జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శి, పార్లమెంటరీపార్టీ నేత విజయసాయిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో వార్డుసభ్యుడి స్థాయి నుండి పార్లమెంటు సభ్యులు, కార్పొరేషన్ ఛైర్మన్లు, డైరెక్టర్లు 84 వేలమంది బిసి ప్రతినిధులను సమావేశానికి ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. గురువారం జయహో బిసి మహాసభ నిర్వహణ కోసం విజయసాయిరెడ్డి, మంత్రులు బొత్స సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, కారుమూరి నాగేశ్వరరావు, జోగి రమేష్, ఎంపిలు మోపిదేవి వెంకట రమణ, మార్గాని భరత్, సత్యవతి, ఎమ్మెల్యే కె పార్థసారథి, ఎంఎల్‌సిలు లేళ్ల అప్పిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, తలశిల రఘురామ్‌తో కలసి ఇందిరాగాంధీ స్టేడియాన్ని, భోజన వసతి కోసం ఎదురుగా వున్న ఎఆర్ గ్రౌండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా మహాసభను జయప్రదం చేయాలని రూపొందించిన పోస్టర్‌ను ఇందిరాగాంధీ స్టేడియంలో ఆవిష్కరించారు. అనంతరం మంత్రులతో కలిసి విజయసాయిరెడ్డి మాట్లాడారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి వెనుకబడిన కులాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని, పదవుల్లో బిసిలకు పెద్దపీట వేశారని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో బిసిలకు ఆత్మగౌరవం పెరిగిందని తెలిపారు. అన్ని విధాలుగా బిసిలకు పదవులిస్తే అధికారాలు వున్నాయా అని విపక్ష పార్టీలు మాట్లాడటం తగదని అన్నారు. ఆ పార్టీలు ఎప్పుడూ బిసిలకు ప్రాధాన్యత ఇవ్వలేదని అన్నారు. ఈ మహాసభకు సిఎం ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. ఇప్పటి దాకా బిసి సంక్షేమం అభివృద్ధి కోసం వైసిపి ప్రభుత్వం ఏమి చేసింది, భవిష్యత్‌లో ఏమి చేయబోతున్నామనే విషయాలను చెబుతామని తెలిపారు. బిసి జయహో మహాసభ తర్వాత ఎస్‌సి, ఎస్‌టి మహాసభ కూడా జరుపుతామని చెప్పారు. 7వ తేదీన జరిగే మహాసభకు రాష్ట్రంలో బిసి ప్రతినిధులంతా తరలిరావాలని కోరారు.

మంత్రి జయరాం కుటుంబీకులకు ఐటీ ఝలక్ !

- 180 ఎకరాల భూమి కొనుగోలుపై ఫోకస్

ప్రజాశక్తి- ఆలూరు (కర్నూలు)
180 ఎకరాల భూమిని రాష్ట్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం కుటుంబీకులు ఒకేసారి కొన్నారనే అంశంపై ఐటి శాఖ దృష్టి సారించినట్లు తెలిసింది. వందలాది ఎకరాల భూమికి నగదు ఎలా సమకూర్చారనే అంశంపై మంత్రి భార్య రేణుకమ్మకు ఐటీశాఖ నోటీసులు అందించినట్లు సమాచారం. తెలంగాణలో మంత్రుల కుటుంబీకులపై ఇటీవల ఐటీ దాడులు నిర్వహిస్తున్న నేపథ్యంలో రేణుకమ్మకు ఐటీ నోటీసులు ఇచ్చారన్న వార్త రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉద్యోగాలు ఇస్తామని 2004-2005 సంవత్సరంలో ఆస్పరి, చిన్న హోతూరు గ్రామానికి పారిశ్రామికవేత్త ఇట్టినా మంజునాథ్, అతని సోదరుడు కలిసి రైతులను మోసం చేసి భూములు కొనుగోలు చేశారు. దశాబ్దాలు గడిచినా పరిశ్రమలు ఏర్పాటు చేయకపోవడంతో ఇటీవల రైతుల నుంచి వ్యతిరేకత రావడంతో ఇట్టినా సంస్థ మంత్రి కుటుంబీకులకు భూములను అమ్మినట్లు తెలిసింది. మంత్రికి భూములు అమ్మిన వ్యవహారంలో ఇట్టినా సంస్థ మంజునాథ్‌పై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ఎలాంటి నోటీసులూ అందలేదు : మంత్రి గుమ్మనూరు

తన సతీమణికి ఐటీ నోటీసులు అందినట్లు వచ్చిన వార్తలో వాస్తవం లేదని మంత్రి గుమ్మనూరు జయరాం తెలిపారు. గురువారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లా డారు. ఎమ్మెల్యే కాకముందే తమ కుటుంబానికి 100 ఎకరాల భూమి ఉందని తెలిపారు. పండించిన పంటలతో వచ్చిన మొత్తం, అప్పు చేసి భూములు కొన్నామని చెప్పారు. బినామీ పేర్ల మీద కొనుగోలు చేయలేదని, తమ కుటుంబీకుల పేర్లపై కొన్నామని తెలిపారు. అనవసరంగా 'ఎల్లో మీడియా' బురద చల్లుతోందన్నారు. ఐటీ నోటీసులు వచ్చినా సమాధానం చెప్పగలమని వివరించారు.

విద్యార్థినిపై హెచ్‌ఎం అఘాయిత్యం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి
గుంటూరు స్తంభాలగరువులోని ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో ఎనిమిదేళ్ల బాలికపై హెడ్ మాస్టర్ లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటన గురువారం వెలుగులోకి వచ్చింది. పట్టాభిపురం సిఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక ఉర్దూ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న చిన్నారిపై స్కూల్ హెచ్‌ఎం షాజహాన్ కొద్దిరోజుల క్రితం అసభ్యకరంగా ప్రవర్తించాడు. చిన్నారి భయపడిపోయి ఇంట్లో విచిత్రంగా ప్రవర్తించింది. జ్వరం రావడంతో మందులు వాడారు. తరువాత స్కూలుకు వెళ్లమని తల్లిదండ్రులు కోరినా ఆమె నిరాకరించింది. దీంతో అనుమానం వచ్చిన తల్లిదండ్రులు బాలికను ప్రశ్నించగా హెడ్‌మాస్టర్ షాజహాన్ తనపై అఘాయిత్యానికి పాల్పడ్డాడని తెలిపింది. దీంతో బాలిక తల్లిదండ్రులు, బంధువులు పాఠశాలకు వచ్చి హెడ్ మాస్టర్‌కు దేహశుద్ధి చేశారు. అనంతరం పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఇచ్చేలోగా హెడ్‌మాస్టర్ షాజహాన్ పాఠశాల నుంచి పరారయ్యాడు. సిఐ రాజశేఖర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

డిగ్రీలో కోర్సులు కొనసాగించాలి

ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సీట్లు భర్తీ కాలేదనే కారణంతో 254 కోర్సులను మూసివేయడం తగదని, కొనసాగించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్రకమిటీ డిమాండు చేసింది. ఈ మేరకు గురువారం సంఘం అధ్యక్ష కార్యదర్శులు కె ప్రసన్నకుమార్, ఏ అశోక్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఉన్న కోర్సుల్లో తక్కువ అడ్మిషన్లు జరిగాయనే నెపంతో కోర్సులను మూసివేయడం దుర్మార్గమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం భవిష్యత్‌లో ఉన్నత చదువుల నుంచి పేద విద్యార్థులను దూరం చేయడమే తప్ప మరొకటి కాదని తెలిపారు. కరోనా వల్ల ఇంటర్మీడియట్ ఉత్తీర్ణతాశాతం తగ్గిందని పేర్కొన్నారు. ఇంటర్ ఫలితాలు విడుదలై మూడు నెలల తర్వాత డిగ్రీ అడ్మిషన్లను ప్రభుత్వం ప్రారంభించిందని వివరించారు. అడ్మిషన్లు ఆలస్యం అవ్వడం వల్లే విద్యార్థులు పక్క రాష్ట్రాలకు వెళ్లారని, మరికొంతమంది ఉద్యోగాలు, ఉపాధి చూసుకున్నారని తెలిపారు. వీటిని గమనంలో పెట్టుకొని కోర్సులను కొనసాగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సూచించారు. కోర్సులను కొనసాగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నాం

- ఎంపి జివిఎల్ నరసింహారావు

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ
విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌పై ప్రత్యామ్నాయం ఆలోచిస్తున్నామంటూ బిజెపి రాజ్యసభ సభ్యులు జివిఎల్.నరసింహారావు చెప్పారు. విశాఖ ఉక్కు హౌస్‌లో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్వాసితులకు, ఉద్యోగులకు ఆమోదయోగ్యంగా ఉండే నిర్ణయం కోసం కీలకంగా చర్చలు జరుపుతున్నట్లు వెల్లడించారు. స్టీల్‌ప్లాంట్‌ను తక్కువ ధరకు అమ్మేస్తున్నామంటూ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని, వీటిని నమ్మవద్దు అని అన్నారు. స్టీల్‌ప్లాంట్ భూములు విలువ అధికంగా ఉందని, వీటిని చౌకగా ఎలా కట్టబెడతామన్నారు. ప్లాంట్‌లో 49 శాతం ఇస్తామన్నా కొనేవారు లేరన్నారు. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను 17 టన్నుల సామర్థ్యానికి పెంచేందుకు ఆలోచిస్తున్నామని తెలిపారు.

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి నవీన్ కుమార్

నివారణే మందు

- ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీలో వక్తలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
అవగాహనతో ఎయిడ్స్‌ను నివారించవచ్చని, 2030 సంవత్సరం కంటే ముందుగానే ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా మారడానికి అందరూ సహకరించాలని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు మల్లాది విష్ణువర్ధన్ అన్నారు. ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. హాజరైన వారితో ప్రమాణం చేయించారు. అసమానతలు అంతం చేయడానికి ఏకమవుదాం అనే ప్రచార కార్యక్రమాన్ని ఆయన తొలిసంతకం చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఎయిడ్స్ రహితంగా తీర్చిదిద్దాలని అన్నారు. ఎయిడ్స్ నియంత్రణలో దేశంలో ఎపి అగ్రగామిగా నిలిచిందని ఎపి శాక్స్ ప్రాజెక్టు డైరెక్టర్ జి.ఎస్.నవీన్‌కుమార్ తెలిపారు. హెచ్‌ఐవిపై వివక్షను తొలగించేందుకు సేవ్ లైఫ్ పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించామని వివరించారు. నిరంతరం జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీర్ఘకాలిక ప్రమాదకర వ్యాధుల నుండి జాగ్రత్తలు తీసుకోవచ్చని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి జూనియర్ వారెంట్ అధికారి అజిత్‌సింగ్‌తోపాటు వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రజెండా కోసం పరితపించిన విజయలక్ష్మి

అశ్రునయనాల మధ్య ముగిసిన అంత్యక్రియలు

ప్రజాశక్తి - తాడేపల్లి (గుంటూరు జిల్లా)
సిపిఎం కష్టకాలంలో ఉన్న ప్రతి సందర్భంలోనూ ఎర్రజెండా కోసం పరితపించిన ధన్యజీవి జానపద వృత్తి కళాకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జగన్ సతీమణి విజయలక్ష్మి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. విజయవాడలోని స్వర్గపురిలో విజయలక్ష్మి అంత్యక్రియలు గురువారం ముగిశాయి. అంతకుముందు గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం సుందరయ్యనగర్‌లోని లీలాసుందరయ్య కళావేదిక నుంచి స్వర్గపురి వరకూ అంతిమయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంతాప సభలో శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రజలను చైతన్యవంతం చేయడానికి కళారూపాల ద్వారా జగన్ పనిచేస్తుంటే మహిళాసంఘం కార్యకర్తగా ప్రజలతో మమేకమై విజయలక్ష్మి పనిచేశారని కొనియాడారు. కుటుంబ సభ్యులందరూ ఉద్యమ జీవితంలో నిలబడి పనిచేసేందుకు ఆమె ఎంతగానో కృషి చేశారని చెప్పారు. మతోన్మాద, ఫాసిస్టు, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తోన్న పాలకవర్గాలకు ధీటుగా ఎదుర్కొనే సమయంలో ఆమె మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు. సిపిఎం పూర్వ రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ.. నక్సలిజం, అతివాద, మితవాద ధోరణులు పార్టీలో ఏర్పడినపుడు వాటిని ఎదుర్కొని జగన్ కుటుంబం గట్టిగా నిలబడిందని చెప్పారు. పార్టీ చీలిక అనంతరం ప్రజానాట్యమండలి పునరుద్ధరణ కోసం జగన్‌తోపాటు విజయలక్ష్మి కూడా తోడ్పాటు నందించారన్నారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, డి.రమాదేవి, తులసీదాస్, కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. విజయలక్ష్మి నివాసం కళాకారులకు నిలయంగా ఉండేదని, అర్ధరాత్రి వచ్చినా కార్యకర్తల మంచిచెడులను అడిగి తెలుసుకొని వారికి ఆతిథ్యం ఇచ్చేవారని చెప్పారు. విజయలక్ష్మి మృతి కళారంగానికి తీరని లోటని ఎపిపిఎన్ఎం రాష్ట్ర కార్యదర్శి ఎస్. అనిల్ కుమార్ పేర్కొన్నారు.
సంతాప సభకు సిపిఎం నాయకులు ఎస్.వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎపి ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షులు మంగరాజు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మట్టా నరసింహ, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కృష్ణయ్య, దడాల సుబ్బారావు, జయరాం, వై.అచ్యుతరావు, సిపిఎం సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, జెవి.రాఘవులు, ప్రజనాట్యమండలి రాష్ట్ర నాయకులు గాదె సుబ్బారెడ్డి, చేనేత కార్మికసంఘం రాష్ట్ర కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ, తిరుపతి పిఎన్ఎం జిల్లా కార్యదర్శి సెల్వరాజు, తదితరులు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే, ప్రజాశక్తి మాజీ ఎడిటర్ పాటూరి రామయ్య సంతాపం తెలిపారు.

మోడీ ప్రభుత్వానికి బుద్ధిచెప్పాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ
బలిదానాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని ఆలోచన వచ్చిన మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 658వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్ ఇన్‌స్ట్రుమెంటేషన్, క్యుఎటిడి, టెలికం, డీస్ యయు విభాగాలకు చెందిన కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి ఆదినారాయణ, జి బోసుబాబు, సిహెచ్ సన్యాసిరావు మాట్లాడుతూ విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించాలని కేంద్రం ప్రభుత్వం చూడటం అత్యంత దుర్మార్గమన్నారు. ఈ ఆలోచనను మోడీ విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, పలు విభాగాల కార్మికులు యేల్లేటి శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాస్, కె శ్రీరామచంద్రరావు, కొండ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం రైతులకు గిట్టుబాటు ధర

అధికారులను ఆదేశించిన మంత్రి కారుమూరి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
రైతులకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాలశాఖ అధికారులను మంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆదేశించారు. రానున్న రోజుల్లో మార్కెటింగ్ డిమాండ్‌కు అనుగుణంగా ఎక్స్‌పోర్ట్ ధాన్యం రకాలపై రైతుల్లో అవగాహన కల్పించాలని చెప్పారు.
ధాన్యం కొనుగోలులో రైతుల ఇబ్బందులు నివారణకు, ధాన్యాన్ని ఎగుమతి చేయడంలో తీసుకోవాల్సిన చర్యలపై వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి సచివాలయంలో గురువారం సమీక్ష నిర్వహించారు. పంట సాగుకు ముందే మార్కెట్ డిమాండ్ ధాన్యం రకాలపై రైతుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని మంత్రి కారుమూరి అన్నారు. అందుకనునుణంగా వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సిఎం ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా వచ్చే సీజన్‌లో మార్కెట్ డిమాండ్ ధాన్యం రకాలపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. కేరళ రాష్ట్రంతో పాటు ఇతర దేశాలకు పెద్దఎత్తున ఎగుమతి అయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, కమిషనర్ అరుణ్ కుమార్, పౌరసరఫరాల శాఖ ఎండి వీరపాండ్యన్ పాల్గొన్నారు.

లోన్‌యాప్ వేధింపులకు విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-గుత్తి (అనంతపురం)

అఖిల్ (ఫైల్ ఫోటో)

లోన్‌యాప్ వేధింపుల తాళలేక ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంతకల్లు పట్టణం తిలక్‌నగర్‌కు చెందిన అఖిల్ (19) బెంగళూరులోని ఓ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ మూడవ సంవత్సరం చదువుతున్నాడు. లోన్‌యాప్ ద్వారా రూ.60 వేలు రుణం తీసుకున్నాడు. రుణం చెల్లించాలంటూ లోన్‌యాప్ సిబ్బంది ఒత్తిడి చేయడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యాడు. లోన్‌యాప్ సిబ్బంది వేధింపులు తాళలేక గుత్తి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యార్థి వద్ద ఉన్న గుర్తింపు కార్డుల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. లోన్‌యాప్ వేధింపుల కారణంగానే తమ కుమారుడు మృతి చెందాడని తల్లిదండ్రులు కన్నీటిపర్యంతమయ్యారు. ఈ ఘటనపై జిఆర్‌పి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

సంక్షేమ బోర్డును కొనసాగించాలి

- రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణ కార్మికుల ఆందోళనలు

ప్రజాశక్తి-యంత్రాంగం

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును యథావిధిగా కొనసాగించాలని, పెండింగ్ క్లెయిమ్‌లు పరిష్కరించాలని, బోర్డు నుంచి దారిమళ్లించిన నిధులను తిరిగి జమచేయాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భవన నిర్మాణ కార్మికులు గురువారం రాష్ట్ర వ్యాప్తంగా పలుచోట్ల తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద ఆందోళనలు, ధర్నాలు చేశారు. పలుచోట్ల సంతకాల సేకరణ, అర్ధనగ్న ప్రదర్శనలు చేశారు. భవన నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమాల్లో పెద్దఎత్తున కార్మికులు పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రభుత్వాధికారులకు వినతి పత్రాలు అందజేశారు. శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద భవన నిర్మాణ కార్మికులు మోకాళ్లపై నిలబడి అర్ధనగ్న ప్రదర్శన చేశారు. పెనుకొండలో నిరసన తెలిపారు. తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో తహశీల్దార్ కార్యాలయాలు, సచివాలయాల వద్ద ధర్నాలు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అధికారులకు వినతిపత్రాలు అందించారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల తహశీల్దార్ కార్యాలయం, ఆచంటలోని పంచాయతీ కార్యాలయాల వద్ద నిరసనలు, ఏలూరు జిల్లా పెదపాడు, కలిదిండి, నిడమర్రు మండలాల్లో ఆందోళనలు చేశారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని కళామందిర్ సెంటర్‌లో సంతకాల సేకరణ చేపట్టారు. నరసరావుపేట, సత్తెనపల్లి, క్రోసూరులో తహశీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి వినతి పత్రాలు అందజేశారు. కర్నూలు జిల్లా ఆత్మకూరులో లేబర్ కార్యాలయం అధికారి వినతిపత్రం సమర్పించారు.

శ్రీసత్యసాయి జిల్లా కలెక్టరేట్ వద్ద కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

సిఎం దళితులను అవమానించారు

- మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి) నియామకంలో దళితులను అవమానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు పెట్టాలని టిడిపి మాజీమంత్రి నక్కా ఆనంద్‌బాబు డిమాండ్ చేశారు. దళితులు, గిరిజనులను మభ్యపెట్టి వారి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన జగన్ వారిని నట్టేట ముంచారని విమర్శించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ (ఇఎన్‌సి)గా సుబ్బారెడ్డిని నియమించడం దళితులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీనియార్టీ ప్రకారం ఎస్‌సి, ఎస్‌టి అధికారులకు రావాల్సిన పదవులను జగన్ రెడ్లకే కట్టబెడుతున్నారని విమర్శించారు. ఇఎన్‌సి నియామకంపై పంచాయతీరాజ్‌శాఖ ఉద్యోగులు స్పందించాలని కోరారు. జాబితాలో తొలిస్థానంలో ఉన్న బాలూనాయక్‌ను కాదని ఎక్కడో ఐదోస్థానంలో ఉన్న సుబ్బారెడ్డిని నియమించడం దళితులను అవమానించడమేనని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి అధికారులను కాదని రెడ్లకు అగ్రతాంబూలం ఇవ్వడం అట్రాసిటీ కాదా అని ప్రశ్నించారు. ఈ నియామకం ముఖ్యమంత్రి స్థాయిలో జరిగిందని పేర్కొన్నారు.

బ్రేక్ దర్శన సమయం మార్పు : టిటిడి చైర్మన్

ప్రజాశక్తి - తిరుమల : రాత్రి నుంచి కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులకు త్వరగా శ్రీవారి దర్శనం కల్పించేందుకు బ్రేక్ దర్శన సమయాన్ని ఉదయం ఎనిమిది గంటలకు మార్పు చేసినట్లు టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి తెలిపారు. శ్రీవారి ఆలయం ఎదుట ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గురువారం నుంచి బ్రేక్ దర్శన సమయాన్ని మార్చినట్లు తెలిపారు.

ఇడెల్‌వీజ్ హౌజింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Edelweiss
Ideas create, values protect

నమోదిత కార్యాలయం: టవర్ 3, వింగ్ 'బి', కోహినూర్ సిటీ మాల్, కోహినూర్ సిటీ, కిరోల్ రోడ్డు, కుర్లా (వెస్ట్), ముంబై-400 070.
నమోదిత కార్యాలయం చిరునామా:- నం.7-1-24/ఆర్‌టి/101 నుండి 104, 04వ అంతస్తు, రోక్సాన టవర్స్- బ్లాక్-బి, గ్రీన్‌ల్యాండ్స్ సిగ్నల్, బేగంపేట్, హైదరాబాద్-500016

SARFAESI చట్టం, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా నోటీసు ఇవ్వడమేమనగా దిగువ రుణగ్రహీత/లు ఇహెచ్‌ఎఫ్‌ఎల్ నుండి వారి ద్వారా పొందిన రుణ సౌకర్యం యొక్క అసలు & వడ్డీ తిరిగిచెల్లించుటలో విఫలం చెందినారు మరియు రుణాలను నాన్-ఫర్‌ఫార్మింగ్ అస్సెట్స్ (ఎన్‌పిఏ) గా వర్గీకరించడమైనది. వారిచే కంపెనీకి తెలిపిన చివరి చిరునామాలకు సెక్షన్ 13(2) ఆఫ్ సెక్యురిటైజేషన్ అండ్ రీ-కన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యురిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI చట్టం) క్రింద వారికి డిమాండ్ నోటీసు జారీ చేయబడింది. ఆ డిమాండ్ నోటీసుకు అదనంగా, ఈ పబ్లిక్ నోటీసు ద్వారా సదరు తెలియజేయబడుతుంది.
సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీతలు, సెక్యురిటీలు, మిగిలిన బకాయిలు, పంపిన డిమాండ్ నోటీసు వివరాలు మరియు అక్కడ క్రింద దావావేసిన మొత్తం దిగువన ఇవ్వబడినాయి:

6. రుణగ్రహీత, సహా-రుణగ్రహీత, హామీదారుని పేరు, లోను అకౌంట్ నెం మరియు లోను మొత్తం:
బరగడ రాజ్యలక్ష్మి (రుణగ్రహీత) తోట వీర లక్ష్మి (సహ రుణగ్రహీత), డో.నం.20-353, టిఎఫ్-1, శ్రీ లక్ష్మినారాయణ నిలయం, 3వ లైన్, శివపార్వతి నగర్, యన్మలకుదురు, కృష్ణాజిల్లా, విజయవాడ-520007.
LAN.NO.: LVIJSTH0000089263 **లోను అగ్రిమెంట్ తేది:** 07-08-2021 **డిమాండ్ నోటీసు:** 16.11.2022
ఎన్‌పిఎ తేది: 4-నవంబర్-2022 **లోను మొత్తం:** రూ.27,30,000/- (ఇరవై ఏడు లక్షల ముప్పై వేల రూపాయలు మాత్రమే)
మొత్తం బకాయిలు: రూ 29,08,284.61 /- (ఇరవై తొమ్మిది లక్షల ఎనిమిది వేల రెండు వందల ఎనభై నాలుగు రూపాయల అరవై ఒక పైసలు మాత్రమే)

సెక్యూర్డ్ అస్సెట్ వివరాలు: ఆస్తి మొత్తం ఆ భాగం మరియు పార్సిల్ డో.నం.14-3 వద్ద, ఆర్.ఎస్.నం.4/1, ఫ్లాట్ నం. ఎస్‌ఎఫ్-1, 2వ అంతస్తు, శ్రీ లక్ష్మి నారాయణ అవెన్యూ, లింరా కాలనీ, తాడిగడప, కృష్ణాజిల్లా, విజయవాడ 521137 కట్టుదిట్టమైన: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: ఓపెన్ టు స్కై, తూర్పు: మెట్లు మరియు కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై.

మీరు పై రుణగ్రహీత/లు ఈ నోటీసు 60 రోజులలోపట పైన పూర్తిగా పేర్కొన్న మిగిలిన బకాయిలు తిరిగిచెల్లించుటకు పిలువడమైనది విఫలమైనయెడల పైన పేర్కొన్న సెక్యురిటీలు అమలుచేయుటకు SARFAESI చట్టం క్రింద దిగువసంతకందారుడు చర్యలు తీసుకొనబడును. సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం దయచేసి గమనించవలసింది ఏమనగా మమ్మల్ని సంప్రదించకుండా పైన సూచించిన సెక్యురిటీలు వేలం, లీజు లేదా వేరే ఇతరత్రములుగా బదిలీచేయుట నుండి నిర్భంధించడమైనది.

ప్రదేశం: ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ,
తేది: 02.12.2022
సం/- అధీకృత అధికారి
ఈడెల్‌వీజ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కొరకు

ADITYA BIRLA CAPITAL
ఆర్థిక పెట్టుబడుల రక్షిత సలహా
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

రిజిష్టర్డు ఆఫీసు: ఇండియన్ రాయన్ కాంపౌండ్, వేరవల్, గుజరాత్ 362266.
బ్రాంచి ఆఫీసు: ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, డోర్ నం.40-2-5ఎ, సి.వి.ఆర్ చాంబర్, 6వ అంతస్తు, కళానికేతన్ ప్రక్కన, ఎం.జి.రోడ్, విజయవాడ-520010.
1ఎబిహెచ్‌ఎఫ్‌ఎల్: అధీకృత అధికారి, శ్రీ ఎం. వసంత్, సంప్రదించాల్సిన నం.+91 8939943443, చిరాగ్ లోఖండె-9773758208.
2. వేలం సర్వీస్ ప్రొవైడర్ (ఏఎస్‌పి) మెసర్స్ ఇ-ప్రొక్యూర్మెంట్ టెక్నాలజీస్ లిమిటెడ్-వేలం టైగర్, శ్రీ రాం శర్మ; సంప్రదించాల్సిన నం.+91 8000023297.

స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు ప్రకటన

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమాలతో చదువబడే ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 క్రింద, స్థిరాస్తి అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి, రుణగ్రహీతలు మరియు హామీదారులకు ప్రకటన ఇవ్వడమేమనగా, ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క అధీకృత అదికారి, రుణగ్రహీతల పేరు **శ్రీ. రామకృష్ణ కుటాడ మరియు శ్రీమతి. సుజాత కుటాడ** పేరున ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్‌కు బకాయిగా, **రూ.41,01,377.14/- (నలభై ఒక లక్షా ఒక వెయ్యి మూడు వందల డెభై ఏడు రూపాయల పద్నాలుగు పైసలు మాత్రమే) 12.05.2021 నాటికి** మరియు తదుపరి చార్జీలు మరియు దానిపై వ్యయాలతో **రివకరీ కోసం 22.12.2022** న "ఏది ఎక్కడ ఎలా ఉన్నది అది అక్కడ అలాగే" ప్రాతిపదికన వేలం ద్వారా అమ్మకానికి పెట్టబడుతుంది. రిజర్వు ధర **రూ.29,11,428/- (ఇరవై తొమ్మిది లక్షల పదకొండు వేల నాలుగు వందల ఇరవై ఎనిమిది రూపాయలు మాత్రమే)** మరియు ధరావత్తు (ఇఎండి) **రూ.2,91,142.80/- (రెండు లక్షల తొంభై ఒక వేల ఒక వందా నలభై రెండు రూపాయల ఎనభై పైసలు మాత్రమే)** ధరావత్తు డిపాజిట్‌చేయుటకు చివరి తేది **21.12.2022.** సదరు ఆస్తిని పరిశీలించు తేది **20.12.2022న ఉ.11:00గం.ల నుండి సా.04:00గం.ల మధ్య** గా నిర్ణయించబడినది.

స్థిరాస్తి వివరణ
కృష్ణాజిల్లా, మైలవరం సబ్ రిజిస్ట్రీ, మైలవరం గ్రామం, గ్రామపంచాయతీ మరియు మండలం వద్ద ఉన్న ఆర్.ఎస్.నం.166/1, పరిధిలో 197 చ.గజాలు. సైట్‌తో ఆర్‌సిసి రూఫ్ నిర్మాణం అందులో డో.నం.8-97, పన్ను నం.1500, ఉన్న కట్టుదిట్టమైన: ఉత్తరం: వేముల నరసింహ సైట్, దక్షిణం: పోరంబోకు (కెనాల్), తూర్పు: వేముల నాగేశ్వరరావు యొక్క సైట్, పడమర: పంచాయతీ బజార్.
అమ్మకం యొక్క వివరణాత్మక నియమ& నిబంధనల కొరకు, దయచేసి ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్ అనగా., https://homefinance.adityabirlacapital.com – షార్ఫసీ యాక్ట్ క్రింద వేలం కొరకు ఆస్తులు లేదా https://sarfaesi.auctiontiger.net లో ఇవ్వబడిన లింకును పరిశీలించండి.

తేది: 02.12.2022
ప్రదేశం: విజయవాడ
అధీకృత అధికారి,
ఆదిత్య బిర్లా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్.

మృత్యువులోనూ వీడని స్నేహం

- ఈతకెళ్లి ఆర్మీ ఉద్యోగుల మృతి

ప్రజాశక్తి - బెస్తవారిపేట (ప్రకాశం)

ఈతకెళ్లి ఇద్దరు ఆర్మీ ఉద్యోగులు మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా బెస్తవారిపేట మండలంలో గురువారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పూసలపాడు గ్రామానికి చెందిన కర్నాటి రామచంద్రారెడ్డి(23), మార్తాల శివకోటేశ్వర రెడ్డి(23) ప్రాథమిక విద్యనుంచి బాల్యమిత్రులు. 10వ తరగతి పాసైన తర్వాత ఆర్మీలో చేరారు. సెలవుపై ఇటీవల ఇద్దరూ ఇంటికి వచ్చారు. ఈత ఆడేందుకు గ్రామానికి పడమర వైపునున్న కుంటలోకి దిగారు. పూడిక మట్టిలో కూరుకుపోయి ఇద్దరూ మరణించారు. పొద్దుపోయిన ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులకు అనుమానం వచ్చి కుంట వద్ద వెతకసాగారు. రామచంద్రారెడ్డి మృతదేహం నీటిపై తేలాడుతూ కనిపించడంతో శివకోటేశ్వరరెడ్డి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనాస్థలికి చేరుకున్నారు. గజ ఈతగాళ్ల సహాయంతో గాలించగా.. శివకోటేశ్వరరెడ్డి మృతదేహం లభించింది.

సభలో మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి అజశర్మ

ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉద్యమం

- హెటిరో పైప్ లైన్ వ్యతిరేక పోరాటానికి ఏడాది

ప్రజాశక్తి-నక్కపల్లి, అనకాపల్లి జిల్లా

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగివచ్చే వరకు మత్స్యకారులు ఐక్య పోరాటం చేయాలని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక కార్యదర్శి ఎ అజశర్మ పిలుపునిచ్చారు. హెటిరో పైపులైన్‌కు వ్యతిరేకంగా అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో మత్స్యకార జెఎసి ఆధ్వర్యాన చేపట్టిన శాంతియుత మహా ధర్నా గురువారం నాటికి 365 రోజులకు చేరుకుంది. ఏడాది పూర్తయిన సందర్భంగా శిబిరం వద్ద సింహగర్జన పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. మత్స్యకార జెఎసి రాష్ట్ర అధ్యక్షులు కంబాల అమ్మోరయ్య అధ్యక్షతన జరిగిన ఈ సభలో అజశర్మ మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో రసాయన తుల్య పరిశ్రమలు ఏర్పాటుచేసి, మత్స్యకారుల ఉపాధిని, ఉనికిని ప్రభుత్వాలు దెబ్బతీస్తున్నాయని విమర్శించారు. చేపల వేట ప్రధాన ఆధారంగా జీవిస్తున్న మత్స్యకారుల హక్కులను కాలరాస్తున్నాయన్నారు. పైపులైన్‌కు వ్యతిరేకంగా మత్స్యకారులు ఏడాదిగా అలుపెరగని పోరాటం చేయడం వల్లే కంపెనీ యాజమాన్యం దిగివచ్చి పైపులైన్ పనులను నిలుపుదల చేసిందన్నారు. ఇది మత్స్యకారుల విజయమన్నారు.

ప్రభుత్వం స్పందించి సమస్యపై శాశ్వత పరిష్కారం చూపే వరకూ పోరాటం కొనసాగించాలని పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా, సోంపేటలో పర్యావరణం పరిరక్షించడం కోసం, ఉపాధి కోసం విద్యుత్ కర్మాగారం ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఎనిమిదేళ్ల పాటు మత్స్యకారులు పోరాటం చేసి విజయం సాధించారని గుర్తుచేశారు. ఈ సభలో పలువురు అఖిలపక్ష పార్టీల నేతలు, మత్స్యకార నాయకులు పాల్గొన్నారు.

నేడు ఐఎన్‌ఎస్ అస్త్రధారిణి అప్పగింత

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ, విశాఖ

'ఐఎన్‌ఎస్ అస్త్రధారిణి'ని హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ (హెచ్‌ఎస్‌ఎల్) శుక్రవారం భారత నౌకాదళానికి అప్పగించనుంది. ప్రత్యేక ప్రాతిపదికన ఈ నౌకా నిర్మాణాన్ని హెచ్‌ఎస్‌ఎల్‌కు అప్పగించినట్లు హిందుస్థాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ సిఎమ్‌డి తెలిపారు.

ఐఎన్‌ఎస్ అస్త్రధారిణి, పటేల్ ఇంజనీరింగ్ వర్క్స్ (పిఈడబ్ల్యు) రీఫిట్‌ను విజయవంతంగా పూర్తి చేయడంలో ఎంఎస్‌ఎంఇలు కీలకపాత్ర పోషించాయని పేర్కొన్నారు. షెడ్యూల్ కంటే 21 రోజుల ముందుగానే హెచ్‌ఎస్‌ఎల్ పూర్తి చేసి భారత నౌకాదళానికి అప్పగిస్తున్నట్లు తెలిపారు. రెండు సంవత్సరాలుగా హెచ్‌ఎస్‌ఎల్ రీఫిట్‌లను ముందుగా పూర్తిచేస్తూ వస్తోంది. హెచ్‌ఎస్‌ఎల్ గత సంవత్సరంలో 17 షిప్‌ల రీఫిట్‌లను పూర్తిచేసింది. వాటిలో 15 షెడ్యూల్‌కంటే ముందుగా పూర్తి చేసింది.

అనుమానాస్పద స్థితిలో వార్డెన్ దంపతుల మృతి

ప్రజాశక్తి- అరకులోయ /అరకు రూరల్, అల్లూరి సీతారామరాజు జిల్లా

అనుమానాస్పదస్థితిలో వార్డెన్ దంపతులు మృతి చెందిన సంఘటన అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్త భల్లుగుడ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గుజ్జెలి రాధ (34) రెండు నెలలుగా డిప్యూటీ వార్డెన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తన భర్త నన్ని సుమన్ (32)తో కలిసి పాఠశాలలోని ఉపాధ్యాయుల క్వార్టర్స్‌లో నివాసము ఉంటున్నారు. రోజూ మాదిరిగానే విద్యార్థినులకు రాత్రి భోజనాలు పెట్టిన అనంతరం రెండో అంతస్తులో ఉన్న తమ క్వార్టర్‌కు వెళ్లారు. గురువారం తెల్లవారుజామున హాస్టల్ పిల్లలకు టిఫిన్ నిమిత్తం స్టోర్ రూమ్‌కి వచ్చి రేషన్ ఇవ్వాల్సిన వార్డెన్ ఏడు గంటలైనా బయటకు రాకపోవడంతో అక్కడ పనిచేస్తున్న ఓ వర్కర్ వార్డెన్ క్వార్టర్‌కి వెళ్లి తలుపు తట్టారు. ఎంతకీ తలుపు తీయకపోవడంతో కిటికీపైకి ఎక్కి చూశారు. భార్యాభర్తలిద్దరూ మృతిచెంది ఉండడాన్ని గమనించి ప్రధాన ఉపాధ్యాయులు టి.పద్మకు సమాచారం అందించారు. ప్రధానోపాధ్యాయురాలు ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తరలించారు. వీరికి ముగ్గురు సంతానం. ఇద్దరు చిన్నారులు విశాఖలోని ఓ హాస్టల్‌లో ఉండి చదువుతుండగా, మరో చిన్నారి తాతగారింటి వద్ద ఉన్నారు. అనుమానాస్పద మృతిగా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రంలో 14% పెరిగిన జిఎస్‌టి వసూళ్లు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఏడాది నవంబర్‌లో దేశ వ్యాప్తంగా వస్తు సేవల పన్ను (జిఎస్‌టి) వసూళ్లు 11 శాతం పెరిగి రూ.1.46 లక్షల కోట్లుగా నమోదయినట్లు ఆర్థిక శాఖ వెల్లడించింది. గతేడాది ఇదే నెలలో రూ.1.31 లక్షల కోట్ల పన్నులు వసూళ్లయ్యాయి. అయితే గత నెల రూ.1.51 లక్షల కోట్లతో పోలిస్తే పన్ను వసూళ్లలో కొంత తగ్గాయి. వరుసగా తొమ్మిదో నెలలోనూ రూ.1.40 లక్షల కోట్ల ఎగువన నమోదయ్యాయి. నవంబర్ మొత్తం వసూళ్లలో సిజిఎస్‌టి కింద రూ.25,681 కోట్లు, ఎస్‌జిఎస్‌టి కింద రూ.32,651 కోట్లు, ఐజిఎస్‌టి కింద రూ.77,103 కోట్లు, సెస్సుల రూపంలో రూ.10,433 కోట్లు సమకూరినట్లు ఆర్థిక శాఖ తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో పన్ను వసూళ్లు 14 శాతం వృద్ధితో రూ.3,931 కోట్లకు చేరగా.. తెలంగాణలో 8 శాతం పెరిగి రూ.4,228 కోట్లకు చేరాయి.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
Union Bank of India
రీజనల్ ఆఫీస్
1వ అంతస్తు, ఆంధ్రాబ్యాంక్ బిల్డింగ్స్, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ - 520 001

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింది ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపిననూ తిరిగి చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం **ది. 17-12-2022, శనివారం సా॥ 4.00 గంటలకు బ్రాంచి ఆవరణలో బహిరంగవేలం వేయబడును.** వేలం వేసినా బకాయి రద్దు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. ఈ దిగువ ఖాతాదార్లు ఎవరైనా మరణించిన యెడల వారి వారసులకు ఈ వేలం నోటీసు వర్తిస్తుంది. అప్పు నోటీసులు అందని వారికి మరియు నోటీసులను తిరస్కరించిన వారికి పత్రికా ముఖమున చివరిసారిగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

వ. సం.	ఖాతా నెం.	ఋణగ్రహీత పేరు	స్థూల బరువు (గ్రాములలో)
		ఆగిరిపల్లి బ్రాంచి	
1.	330100213966	బెక్కం శోభనాద్రి	64.9
2.	330100198445	బెక్కం శోభనాద్రి	62.0
		అజిత్‌సింగ్‌నగర్ బ్రాంచి	
3.	22316530001256	బలుగూరి వెంకటేశ్వరరావు	67.0
		బాలాజీనగర్ బ్రాంచి	
4.	135716530002205	షేక్ ఖాదర్‌వలి	54.0
5.	135730100136506	సనపతి భవాని	24.0
6.	135716530001071	షేక్ ఖాదర్‌వలి	16.0
		గాంధీనగర్ బ్రాంచి, నూజివీడు	
7.	304816530000089	ముట్టె శివగోపాల్	24.0
8.	304816530000450	కర్నాటి తిరుమలరావు	24.0
9.	304816530000030	కర్నాటి తిరుమలరావు	8.0
10.	304816530000160	మేకల సత్యనారాయణ	13.0
		గన్నవరం బ్రాంచి	
11.	15430100267170	దేవరపల్లి ప్రసన్న	12.0
		ఇబ్రహీంపట్నం బ్రాంచి	
12.	560951011290067	జూలూరు మాధవరావు	76.0
		కణకంచి బ్రాంచి	
13.	29730100157554	మార్కపూడి స్వామి	18.0
		మాచవరం బ్రాంచి	
14.	37116530000839	మానుకొండ సుధీర	183.0
15.	37116530000840	చెరుకూరి మల్లిఖార్జునరావు	173.0
		మధురానగర్ బ్రాంచి	
16.	144716530000256	మండే సుకుమార్	12.0
		నున్న బ్రాంచి	
17.	144416540000745	బేతపూడి ఝాన్సీ రాణి	41.0
18.	144430100183416	మాదు లక్ష్మయ్య	21.0
		నూజివీడు బ్రాంచి	
19.	635006540028789	కలకొండ వెంకట రామారావు	220.0
20.	635006540029742	యామర్తి నాగరాజు	30.8
21.	38816540000501	బాలుమూరి జోషిలక్ష్మణరావు	116.0
22.	38816540000407	కొయ్యన యుగంధర్	16.0
		పోలవరం బ్రాంచి	
23.	229916540000620	పర్వతనేని స్వరూపరాణి	23.0
24.	229916540000489	పర్వతనేని స్వరూపరాణి	25.0
		ప్రసాదంపాడు బ్రాంచి	
25.	145930100120949	చెరుకూరి మల్లిఖార్జునరావు	212.0
		రామవరప్పాడు బ్రాంచి	
26.	119216530000436	వి లక్ష్మి అంజనాదేవి	7.0
		రెడ్డిగూడెం బ్రాంచి	
27.	443706540044099	కలకొండ వెంకటరామారావు	125.0
		రైతుపేట బ్రాంచి	
28.	216716530000062	కంతేటి వెంకట కళ్యాణి కుమారి	26.0
29.	560951006784357	కొరమగిరి గోపమ్మ	14.0
		వెలగలేరు బ్రాంచి	
30.	330106540046841	యర్రగుంట నిర్మల	12.0
		విజయవాడ బ్రాంచి	
31.	60616530000014	బండోతు పుష్ప	16.0
32.	60616530000013	బండోతు పుష్ప	7.0

షరతులు : 1) వేలంలో పాల్గొనువారు **రూ. 5,000/- (అక్షరాల ఐదు వేల రూపాయలు మాత్రమే)** ధరావత్తు చెల్లించవలెను. **2)** వేలంలో ఆభరణములు పొందినవారు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో ఆభరణములు పొందని వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. **3)** ఏ స్థితిలోనైనా వేలం నిలుపుదల చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **4)** వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. **5)** వేలంలో పాల్గొను వారు ఆధార్ మరియు పాన్‌కార్డుల కాపీలను సమకూర్చవలెను.

ది. 01-12-2022 సం/- అధీకృత అధికారి

ORIX
ORIX లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్
(గతంలో OAIS ఆటో ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్‌గా పిలువబడింది) (ఓరిక్స్ ఆటో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సర్వీసెస్ లిమిటెడ్ యొక్క ఒక అనుబంధ సంస్థ)
నమోదిత కార్యాలయం: ప్లాట్ నం.94, మరోల్ కో-ఆపరేటివ్ ఇండస్ట్రియల్ ఎస్టేట్, అందేరి కుర్ల రోడ్, అందేరి (ఈ), ముంబాయి-400 059,
Tel.: + 91 22 2859 5093 / 6707 0100 | Fax: +91 22 2852 8549
Email: info@orixindia.com | www.orixindia.com | CIN: U74900MH2006PLC163937

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద నోటీసు)

ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ నుండి దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు మరియు సహా-రుణగ్రహీతలు సెక్యూర్డ్ లోన్‌లు పొందియున్నారు. దిగువ పేర్కొన్న రుణగ్రహీతలు వారికి సంబంధించిన ఆస్తులను సెక్యూర్డ్‌గా తాకట్టుపెట్టి రుణాలు పొందినారు. సంబంధిత లోను ఒప్పందం ప్రకారం నియమాలు మరియు షరతుల అనుసారం విఫలం చెందినారు మరియు ఇవి సక్రమంగా లేవు, వారి రుణాలను అర్‌బిఐ మార్గదర్శకాల ప్రకారం ఎన్‌పిఏగా వర్గీకరించడమైనది. ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారి బకాయిలు మొత్తం, జారీ చేసిన సంబంధిత నోటీసులలో పేర్కొనడమైనది దిగువ పట్టికలో చాలా వివరించబడింది మరియు సదరు మొత్తానికి తదుపరి వడ్డీ వర్తించును మరియు సంబంధిత తేదీల నుండి ఒప్పందం రేటు ప్రకారం చార్జ్ చేయబడును.

క్ర. సం	లోను ఖాతా నం.	లోను రకం	రుణగ్రహీతల పేరు	13(2) నోటీసు తేది ప్రకారం బకాయిలు	నోటీసు తేది	సెక్యూర్డ్ ఆస్తి వివరాలు
1	LN0000000016134	SME సెక్యూర్డ్ లోను	1. చిన్న బాబావలి తమ్మ, 2. తుమ్మ వెంకటేశ్వర్లు, 3. తమ్మ చిన్నబాబావలి ఫిష్ కంపెనీ, 4. తమ్మ జాలమ్మ, 5. అంక నాగరాజు తమ్మ	INR 53,29,370.26/-	28-11-2022	ఆంధ్రప్రదేశ్ 522201, గుంటూరు జిల్లా, తెనాలి, తెనాలి మున్సిపాలిటీ, శారద హాస్పిటల్ వద్ద ఉన్న ఆస్తి మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.15-9-40, కొలిచే ఏరియా పరిధిలో 89 చ.గజాలు. లేదా 74.41 చ.మీటర్లు. ఎన్.టి.ఎస్.నం.201, వార్డు నం.4, బ్లాక్ నం.3, పన్ను నం.6943, మరియు కట్టుదిట్టమైన: తూర్పు: షేక్ కరీం మరియు షేక్ సలీం యొక్క గోడ 26'6", పడమర: మున్సిపల్ రోడ్డు 26'6", దక్షిణం: డో.నం.15-9-41 యొక్క ఆస్తి 30'6", ఉత్తరం: షేక్ రహీమాన్ యొక్క గోడ 30'6".
2	LN0000000016131	SME సెక్యూర్డ్ లోను	1. అడపాల శివ నాగమణి, 2. గోగిశెట్టి లక్ష్మి సామ్రాజ్యం, 3. చౌలం శ్రీవల్లి, 4. బ్యూటీ లైఫ్ సెంటర్.	INR 50,35,632.25/-	26.11.2022	గుంటూరు జిల్లా 522001, 9వ లైన్, నెహ్రూ నగర్ వద్ద ఉన్న సైట్ మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ పరిధిలో 227.70 చ.గజాలు. బేరింగ్ డో.నం.420/బి, ప్లాట్ నం.11, డో.నం.8-13-111 మరియు సరిహద్దులు: ఉత్తరం: ఎస్. పున్నమ్మ యొక్క ఆస్తి 82'0", దక్షిణం: పి. మల్లయ్య యొక్క ఆస్తి 82'-0", తూర్పు: గుంటూరు మున్సిపల్ రోడ్డు 25'-0", పడమర: పి. వెంకటేశ్వర్లు యొక్క ఆస్తి 25'-0".
3	LN0000000014505	SME సెక్యూర్డ్ లోను	1. హరి కిరణ్ రెడ్డి, 2. మెసెర్స్ శ్రీసాయి సింహాద్రి టైర్స్, 2. కలకోట లలిత, 3. చిన్నవెంకట రెడ్డి ఇప్పాల	INR 1,25,00,526.8/-	28-11-2022	గుంటూరు 522034, ఆంధ్రప్రదేశ్, గుంటూరు జిల్లా, విష్ణు నగర్, టెలికాం నగర్, 1వ లైన్, గుంటూరు కొత్త మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కొరిటిపాడు ఉపజిల్లా రిజిస్ట్రార్ వద్ద ఉన్న గోరంట్ల గ్రామ పంచాయతీ , కొరిటిపాడు డో.నం.145/2 లో ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ డో.నం.11-317/1, పరిధిలో 203 చ.గజాలు. లేదా 169.73 చ.మీటర్లు. రెసిడెన్షియల్ సైట్ తో కలిసి ఆర్‌సిసి రూఫ్డ్ గ్రౌండ్, 1వ మరియు 2వ అంతస్తు, రెసిడెన్షియల్ భవనంతో అన్నీ సౌలభ్య హక్కులు ప్లాట్ నం.60 మరియు కట్టుదిట్టమైన: ఉత్తరం: 30 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: జె. శర్మ యొక్క ఆస్తి, తూర్పు: కోదండ రామయ్య యొక్క ఆస్తి, పడమర: మాకినేని వెంకటేశ్వరరావుకు చెందిన ప్లాట్ నం.59.
4	LN0000000017626	SME సెక్యూర్డ్ లోను	1. పట్టికుటి వి ఎల్ నరసమ్మ, 2. ఓం సాయి రామ్ కిరాణా మరియు ఫాన్సీ, 3. గల్లా సీతారామయ్య.	INR 54,51,715.05/-	28-11-2022	ఆంధ్రప్రదేశ్ 522006, గుంటూరు, స్టాంబాలగరువు, నల్లపాడు శివారు వద్ద ఉన్న మొత్తం ఆ ముక్క మరియు పార్శిల్ టి.ఎస్.నం.818, డో.నం.233/ఏ1, 223/ఏ1, పన్ను నం.1365/3, మున్సిపల్ వార్డు నం.1 (పాత), 2 (కొత్త), బ్లాక్ నం.9, డో.నం.2-2-34, కొలిచే 124 చ.గజాలు. ఐ.ఇ. 103.68 చ.మీటర్లు. మరియు కట్టుదిట్టమైన: ఉత్తరం: ఎం. సుబ్బారెడ్డి యొక్క ఆస్తి 30'-3", దక్షిణం: 12 అడుగుల వెడల్పు రోడ్డు 30'-0", తూర్పు: ఎస్‌కె. సఫియాబీ యొక్క ఆస్తి 37'-9", పడమర: ఎన్. అమల యొక్క ఆస్తి 36'-7".

ఈ ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా పై పట్టికలో వివరించిన వివరాల ప్రకారం సంబంధిత తేదీలు మరియు ఇతర ఖర్చులతో ఒప్పందం వడ్డీరేటుతో ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్‌కు బకాయిలు చెల్లించవలసిందిగా ఇక్కడ మిమ్మల్ని పిలువడమైనది, మీరు విఫలమైన కారణంగా, ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ వారు బకాయిలు రాబట్టుకొనుటకు పైన పేర్కొన్న తాకట్టుపెట్టిన ఆస్తులకు వ్యతిరకంగా దిగువ సంతకందారుడు SARFAESI చట్టం యొక్క సెక్షన్ 13(4) మరియు సెక్షన్ 14 నిర్భంధంగా నిబంధనలు అమలుపర్చారు. తదుపరిగా సదరు సెక్యూర్డ్ ఆస్తులను విక్రయం/లీజు లేదా ఏవిధంగానైనా బదిలీ చేయుటకు సదరు చట్టం యు/ఎస్ 13(13) ప్రకారం నిషేదించడమైనది.

తేది: 26 మరియు 28.11.2022,
స్థలం: గుంటూరు.
సం/-
అధీకృత అధికారి
ఓరిక్స్ లీజింగ్ & ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్

HDFC WITH YOU, RIGHT THROUGH
హౌసింగ్ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్
శాఖ:1వ అంతస్తు, శ్రీ హరి టవర్స్, 59ఎ-1-5/1, మేరీ స్టెల్లా కాలేజ్ ప్రక్కన, విజయవాడ-520008

డిమాండ్ నోటీసు

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 (చట్టం) యొక్క సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ 13 (2) క్రింద

ఏదైతే దిగువ సంతకందారుడు హౌజింగ్ డవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్) అధీకృత అధికారి సెక్యూరిటీజైషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటి ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13 (12) క్రింద, డిమాండ్ నోటీసు జారీ చేస్తూ సెక్షన్ 13(2) క్రింద రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(లు) దిగువన సూచిస్తూ, దిగువ ఇవ్వబడిన వివరాల ప్రకారం, సంబంధిత నోటీసు/ల తేది నుండి 60రోజులలోపు, సంబంధిత డిమాండ్ నోటీసులో పేర్కొన్న మొత్తాన్ని చెల్లించమని పేర్కొనడం జరిగింది. దిగువ సంతకందారుడు రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(లు) గల సంబంధిత చివరి చిరునామాకు నోటీసులు పంపించడం జరిగింది. దిగువ సంతకందారుడి వద్ద కాపీలు అందుబాటులో ఉన్నాయి, మరియు రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(లు) వారి అభీష్టానుసారం దిగువ సంతకందారుడి నుండి కార్యాలయం పనివేళలో కాపీలను పొందవచ్చు.
పైదానిని అనుసరించి, ఇందుమూలంగా ఇవ్వబడిన నోటీసు ప్రకారం, మరొకసారి, రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(లు)ను కోరడమేమనగా ఈ నోటీసు ప్రచురించిన తేది నుండి 60రోజులలోగా హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌కు మొత్తాన్ని చెల్లించమని కోరడమైనది, సంబంధిత పేర్లు దిగువ పేర్కొనబడినవి, చెల్లించాల్సిన మరియు /లేదా గుర్తించిన ఈ తేది వరకు కాలమ్స్ (సి)లో పేర్కొన్న సంబంధిత తేదీల నుండి డిమాండ్ నోటీసులో వివరించిన సంవత్సరానికి 18% తదుపరి వడ్డీతో కలుపుకొని, లోను ఒప్పందను మరియు ఇతర డాక్యుమెంట్‌లు/రాతపూర్వకాలు చదువుకోవలెను, ఏదైన సంబంధిత రుణగ్రహీత(ల)చేత అమలైతే, లోను తిరిగిచెల్లించే బాకీ కొరకు సంబంధిత రుణగ్రహీత(లు) హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌కు తాకట్టుపెట్టిన సెక్యూరిటీగా ఉన్న దిగువ సెక్యూరిటీ ఆస్తు(లు) దిగువన ఇవ్వడమైనది. రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(లు)ను గమనించవలసింది ఏమనగా చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) నిబంధనలు అహ్వానం మేరకు అందుబాటులో ఉన్న సమయం ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను విడిపించుకోవచ్చు.

క్ర. సం.	రుణగ్రహీ(లు)/ చట్టపరమైన వారసు(లు)/చట్టపరమైన ప్రతినిధు(లు) యొక్క పేర్లు	మొత్తం బకాయిలు	డిమాండ్ నోటీసు తేదీ	సెక్యూర్డ్ అసెట్స్/స్థిరాస్తి యొక్క వివరాలు
(a)	(b)	(c)	(d)	(e)
1	శ్రీ. మల్లీల మార్క్ కరుణాకర్ (రుణగ్రహీత) లోన్ ఎ/సి.: 628862344 & 628046249	30-సెప్టెంబర్-2022 నాటికి రూ.1,02,028/- మరియు రూ.34,91,011/- మొత్తం రూ.35,98,039/-	27-OCT-22	**షెడ్యూల్ ఎ:** గుంటూరు జిల్లా, కొరిటిపాడు రిజిస్ట్రేషన్ ఉపజిల్లా, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుంటూరు సిటీ, కొరిటిపాడు, బేరింగ్ డో.నం.305, ఎసి. 1-88. 1/2 సెంట్లు బయటకు ఎసి. 3-67 సెంట్లు మరియు ఎమ్ఆర్‌ఓ యొక్క సర్వే ప్రకారం, గుంటూరు డో.నం.305/1, ఎసి. 0-35. 1/2 సెంట్లు బయటకు ఎసి. 2.15 సెంట్లు మరియు 3983.6 చ.గజాలు తో డో.నం.1-35-232/6/21/ఎ వద్ద, "యాగంటి స్టెర్లింగ్" ఉన్న కట్టుదిట్టమైన: తూర్పు: 20 అడుగుల వెడల్పు రోడ్డు, దక్షిణం: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, పడమర: మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, ఉత్తరం: జి. చిన్న రామిరెడ్డి మరియు బి. విజయ నిర్మల మరియు ఇతరులకు చెందిన ఆస్తి. ఈ సరిహద్దుల పరిధిలో 3983.6 చ.గజాలు. లేదా 3330.80 చ.మీటర్లు. సైట్ అందులో మరియు సౌలభ్య మరియు దీనిలో ఉపకరణాలు మొదలైనవి. **షెడ్యూల్ బి:** అవిభక్త మరియు పేర్కొనబడని అనుపాతంలో వాటా కొలిచే 39.50 చ.గజాలు లేదా 33.02 చ.మీటర్లు. అందులో పైన పేర్కొన్న "ఎ" షెడ్యూల్ సైట్ మరియు ఒక ఫ్లాట్ నం.506 తో పాటు "యాగంటి స్టెర్లింగ్" లో 4వ అంతస్తు తో ప్లింత్ ఏరియా 1150 చ.అడుగులు (కామన్ ఏరియాలు మరియు కార్ పార్కింగ్ ఏరియాలతో సహా) మరియు పైన పేర్కొన్న సైట్ వాటా కోసం రూపొందించబడిన కట్టుదిట్టమైన: తూర్పు: గ్రౌండ్ అబెట్టింగ్ రోడ్డులో ఖాళీ ప్రదేశం, దక్షిణం: గ్రౌండ్ అబెట్టింగ్ రోడ్డులో ఖాళీ ప్రదేశం, పడమర: కామన్ కారిడార్, ఉత్తరం: ఈ ఫ్లాట్ మరియు ఫ్లాట్ నం.505 మధ్య ఓపెన్ టు స్కై. ఈ సరిహద్దులు సదరు "యాగంటి స్టెర్లింగ్"యొక్క 4వ అంతస్తు ఐ.ఇ. లో ఉన్న ఒక ఫ్లాట్ నం.506, పైన స్టిల్ట్, గ్రౌండ్, 1వ, 2వ మరియు 3వ అంతస్తులు మరియు అన్నీ సౌకర్యాలతో మరియు కామన్ మరియు ఉమ్మడి హక్కులుతో పాటు సౌలభ, ఉపకరణాలు మొదలైనవి., స్టిల్ట్ ఫ్లోర్‌లో ఒక కార్ పార్కింగ్ ప్రాంతం కేటాయింపుతో సహా.

సంవత్సరానికి 18% తదుపరి వడ్డీతో, అదనపు ఖర్చులు, చార్జీలు, వగైరాలాంటివి చెల్లింపబడే/లేదా గుర్తించిన తేది వరకు వర్తింపబడును. హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్‌కు రుణగ్రహీతలు తిరిగిచెల్లించలేక విఫలం చెందినట్లయితే, హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ వారు పై సెక్యూర్డ్ ఆస్తు(లు)/స్థిరాస్తు(లు) తదుపరి చర్యలు చేపట్టుతారు. సదరు చట్టం సెక్షన్ 13(4) క్రింద సంబంధిత రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(ల) ఖర్చులు మరియు పర్యవసనాలకు మొత్తం బాధ్యత వహించగలరు.
రుణగ్రహీత(లు)/చట్టబద్ద వారసు(లు)/చట్టబద్ద ప్రతినిధు(ల) హెచ్‌డిఎఫ్‌సి లిమిటెడ్ వారిని సంప్రదించకుండా పైన వివరించిన సెక్యూర్డ్ ఆస్తు(ల)/స్థిరాస్తు(లు)ను అమ్మకంగాని, లీజు లేదా ఇతరత్రములకు బదిలీచేయుట నిషేదించడమైనది. ఎవరైన వ్యక్తి చట్టం లేదా నియమాలను ఉల్లంఘించేనట్లయితే అదే అలాచేయుటకు ప్రేరేపించన్లయితే వారికి చట్టం క్రింద చట్టబద్దంగా జైలు శిక్ష/లేదా జరిమానా విధింపబడుతుంది.

తేది:02-12-2022
ప్రదేశం:విజయవాడ
హౌజింగ్ డవలప్‌మెంట్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కొరకు
సం/-(క్రె. రవిశంకర్) అధీకృత అధికారి
రిజిస్టర్డ్ ఆఫీస్: రమోన్ హౌస్, హెచ్.టి. పారెఖ్ మార్గ్, 169, బాక్‌బే రీక్లమేషన్, చర్చ్ గేట్, ముంబాయి-400020

సంపాదకీయం

గురువులపై దండన..!

ఉపాధ్యాయుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతికూల వైఖరి నష్టదాయకం. ఉద్యోగులు, ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలని ధర్నా చేపట్టిన టీచర్లను, వారికి మద్దతు తెలిపిన పిడిఎఫ్ ఎమ్మెల్సీలను బుధవారంనాడు అరెస్ట్ చేయడం దారుణం. అనుమతి ఉన్నప్పటికీ ఇటీవల ఎన్నడూ లేని విధంగా పోలీసులు ధర్నా శిబిరం టెంట్లను సైతం పీకించడం, కుర్చీలను పక్కనపడేయడంలో టీచర్లపట్ల ప్రభుత్వ కక్షపూరిత వైఖరి ప్రస్ఫుటమవుతోంది. ఈ కార్యక్రమాన్ని అడ్డుకునేందుకు పోలీసులు మంగళవారం నుంచే ఉపాధ్యాయులపై నిర్బంధం ప్రయోగించారు. వివిధ జిల్లాల్లో ముందస్తు అరెస్టులు చేశారు. ఉపాధ్యాయులు తమకు న్యాయంగా చట్ట ప్రకారం రావలసిన బకాయిలిమ్మన్నారే తప్ప గొంతెమ్మ కోర్కెలు కోరలేదు కదా! పిఆర్‌సి చర్చల సందర్భంగా ఉపాధ్యాయులకు ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు సుమారు రూ.650 కోట్లు మార్చి 2022 నాటికి క్లియర్ చేస్తామని మంత్రివర్గ ఉపసంఘం సమక్షంలో ఆర్థికశాఖ అధికారులు హామీ ఇచ్చినా ఇప్పటి వరకు పూర్తి బకాయిలు చెల్లించలేదు. పాత బకాయిలు, మంజూరైన పి.ఎఫ్, తదితర లోన్లు జమ చేయకపోవడం, సిపిఎస్ ఉద్యోగులకు రాష్ట్రప్రభుత్వ వాటా చెల్లించకపోవడం, రిటైరయిన వారి బెనిఫిట్స్ చెల్లించకపోవడం తదితర సమస్యలపై టీచర్లు శాంతియుతంగా ధర్నా చేశారుతప్ప ఎలాంటి హింస లేదా విధ్వంసానికి పూనుకోలేదు. అయినా సర్కారు ఉపాధ్యాయులపై మరోసారి ఉక్కుపాదం మోపడం తగదు. నిర్బంధానికి నిరసనగా తమ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు యుటిఎఫ్ 'నిరసన జాగరణ' కార్యక్రమం నిర్వహించి ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించింది.

ఉపాధ్యాయులకు బోధనేతర పనుల మినహాయింపు పేరిట ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు వారిని ఎన్నికల విధుల నుండి తప్పించడానికేనన్నది బహిరంగ రహస్యం. టీచర్లు ఎన్నికల విధుల్లోవుంటే అధికార పార్టీకి ప్రతికూలంగా ప్రభావితం చేస్తారన్న బెంగతోనే ఇలాంటి చర్యలకు పూనుకుంటోందన్నది జనవాక్యం. నిజంగా టీచర్లను బోధనేతర విధులనుండి తప్పించడమే సర్కారు ఉద్దేశమైతే ఉపాధ్యాయులను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేస్తున్న యాప్‌లను కొనసాగించరాదు. ప్రభుత్వం రుద్దిన యాప్‌ల వల్ల ప్రతిరోజూ ఒకవైపు పని ఒత్తిడి మరోవైపు టెన్షన్ పడుతున్నారని, వాటినలాగే ఉంచి పదేళ్లకోసారి వచ్చే జనగణన, ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న వస్తోంది. యాప్‌లకు మినహాయింపు ఇవ్వకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నిస్తున్నారు. నిజానికి పాఠశాల విద్యలో ఉన్న యాప్‌లు ఏ శాఖలోనూ లేవు. బడికెళ్లగానే టీచర్ ముఖ ఆధారిత హాజరు నుండి విద్యార్థుల హాజరు, మానిటరింగ్, మధ్యాహ్న భోజనం, నాడు-నేడు పనులు, కోడిగుడ్ల సైజులు చూసుకోవడం, బియ్యం లెక్కలు, మరుగుదొడ్ల ఫోటోలు తీయడం...ఇలా ఎన్నో పనులను అప్పగించింది. వీటికోసం 32 రకాల యాప్‌లు, వాటిలో 16 యాప్‌లలో ప్రతి రోజూ ఉపాధ్యాయుడు నమోదు చేయాలి. సర్వర్లు, నెట్‌వర్క్ సమస్య వల్ల యాప్‌లో సమాచారం నమోదు చేయని వారికి కూడా విద్యాశాఖ షోకాజ్ నోటీసు ఇస్తోంది. ఇటీవల ఒక ఉపాధ్యాయుడు తలనీలాలిచ్చినందున ముఖ ఆధారిత హాజరులో నమోదు కాకపోయినా ఆయనకు షోకాజ్ నోటీసులిచ్చారంటే సర్కారు వేధింపుల తీవ్రత ఎంతలా ఉందో విదితమవుతోంది. ఇలాంటి భయాలమధ్య టీచర్లు బోధన కంటే యాప్‌లతో కుస్తీ పట్టాల్సివస్తోంది. కనుక టీచర్లను ఈ యాప్‌ల నుంచి విముక్తులను చేయడం అవశ్యం. ప్రభుత్వ పెద్దలు ఆ దిశగా యోచించాలి.

ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం తానిచ్చిన హామీ ప్రకారం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలి. నిరసన తెలిపేవారిపై నిర్బంధ చర్యలను మానుకోవాలి. పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే గురువులను సర్కారు దండించడం తగదు.

మంచి మాట



మంచి ఉద్దేశాలు కలవారు ప్రమాణాలు చేస్తారు.
మంచి వ్యక్తిత్వం కలవారు మాత్రమే వాటిని నిలబెట్టుకుంటారు.
- ఎ.పి.జె అబ్దుల్ కలాం,
భారత పూర్వ రాష్ట్రపతి.

గుజరాత్‌లో బిజెపి విష ప్రచారం

కామెంట్

హిందుత్వ శక్తులకు ఒక ప్రయోగశాలగా గుజరాత్ ఎలా మారింది? గుజరాత్ నమూనాగా తదనంతర కాలంలో అందరికీ తెలిసిన కార్పొరేట్- మతోన్మాద శక్తుల సంబంధాలు ఎలా ఏర్పడ్డాయి? అన్న అంశాలపై అంతర్గత నిజాలను, అంతరార్థాలను తెలుసుకోగల వెసులుబాటును గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి జరుపుతున్న ప్రచారం ఇస్తోంది.

తన ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెబుతున్న కొన్ని విషయాలు చూస్తుంటే గుజరాత్ వెలుపల వున్న చాలామందికి ఆశ్చర్యం కలుగుతోంది. అయితే, వాస్తవాన్ని వక్రీకరించడంలో, తప్పుడు కథనాలను రూపొందించడంలో ఆర్‌ఎస్‌ఎస్-బిజెపి కూటమి ఎలా విజయవంతమైందో అవి తెలియచెప్తున్నాయి. అమిత్ షా 2002లో ముస్లింలపై జరిగిన హింసాకాండను ప్రస్తావిస్తూ...వారిని అల్లరి మూకలుగా అభివర్ణించడమేగాక, వారికి అప్పుడే బుద్ధి చెప్పామని వ్యాఖ్యానించారు. షా ప్రకారం ఆనాడు ముఖ్యమంత్రిగా వున్న నరేంద్ర మోడీ వారిని కఠినంగా అణచివేశారు. అప్పటి నుండి గుజరాత్‌లో 'శాశ్వత శాంతి' నెలకొంది. కానీ, ముస్లింలకు సంబంధించినంతవరకు అక్కడ శ్మశాన నిశ్శబ్దం నెలకొంది.

గత కాంగ్రెస్ ప్రభుత్వాలు (1995కి ముందున్న) మతోన్మాద ఘర్షణలకు పాల్పడేవారిపై మెతక ధోరణి అవలంబించాయని కూడా షా ఆరోపించారు. ఆ రకంగా, స్వాతంత్ర్యం లభించిన తర్వాత మైనారిటీవాదంపై జరిగిన అతి పెద్ద హింస, ఇప్పుడు ముస్లింలుగా భావించే అల్లరి మూకలను అణచివేయడంగా చిత్రీకరించబడింది.

ఈ రకంగా వక్రీకరించబడిన ఆలోచనా ధోరణే బిల్కిస్ బానో, ఆమె కుటుంబ సభ్యులపై దారుణాలకు పాల్పడిన రేపిస్టులు, హంతకులు జైలు నుండి విడుదల కావడానికి దారి తీసింది. వారి యావజ్జీవ శిక్షలను తగ్గించడం ద్వారా విడిచిపెట్టారు. గుజరాత్ ప్రభుత్వం, అమిత్ షా హోం మంత్రిత్వ శాఖలే శిక్ష తగ్గింపును ఆమోదించాయి.

జాతి వ్యతిరేక లేదా గుజరాత్ వ్యతిరేక శక్తులకు ప్రతిపక్ష పార్టీలు మద్దతిస్తున్నాయంటూ స్వయంగా మోడీనే చెప్పడం బిజెపి ప్రచారంలో మరో అంశం. తీవ్రవాదాన్ని ఓటు బ్యాంకులు, బుజ్జగింపు కోణం నుండి కాంగ్రెస్, ఇతర చిన్న పార్టీలు చూస్తున్నాయంటూ మోడీ ఘాటుగా విమర్శలు చేశారు. అంటే లౌకికవాదాన్ని పరిరక్షించడం, మైనారిటీల హక్కులను కాపాడడం వంటి వాటిని తీవ్రవాదంపై మెతక ధోరణిగా, జాతి వ్యతిరేక చర్యలుగా ముద్ర వేశారు.

> ఈ విషపూరితమైన మతోన్మాద ప్రచారాన్ని కట్టడి చేసే చర్యలే లేవు. 2019లో జరిగిన అసెంబ్లీ , లోక్‌సభ ఎన్నికల్లో....ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పదే పదే ఉల్లంఘించి నరేంద్ర మోడీ, అమిత్ షాలు దోషులుగా తేలినప్పటికీ...ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని, చర్యలు తీసుకోవడంలో విఫలమైన కారణంగా ఈ మతోన్మాద ప్రచారమనేది సాధారణ అంశంగా మారిపోయింది. గుజరాత్‌లో ఈ ఎన్నికల ప్రచారానికి సంబంధించి, రిటైర్డ్ సీనియర్ సివిల్ సర్వెంట్ ఇ.ఎ.ఎస్. శర్మ ఎన్నికల కమిషన్‌కు ఒక లేఖ రాశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ఇ.సి నుండి ఎలాంటి స్పందన లేదు.

మత హింస బాధితులకు న్యాయం జరగాలని కోరుతూ న్యాయ మార్గాన్ని ఆశ్రయించినందుకు తీస్తా సెతల్వాద్, మాజీ డిజిపి ఆర్.బి.శ్రీకుమార్ లను అరెస్టు చేసి, జైలు పాల్జేయడానికి ఈ రకమైన మతోన్మాద దృక్పథమే కారణమైంది. ముఖ్యమంత్రిగా మోడీ మొత్తం పదవీకాలంలో కొనసాగిన ఇదే ధోరణి ప్రస్తుత ఎన్నికల ప్రచారంలోనూ ప్రతిబింబిస్తోంది. పాకిస్తాన్‌ను, తీవ్రవాదాన్ని మైనారిటీలతో కలిపి చూసే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. అలాగే మైనారిటీలను బుజ్జగించే వారుగా సెక్యులర్ పార్టీలను ఆరోపిస్తూ, తద్వారా వారు తీవ్రవాదానికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు చేస్తున్నారు. ఈ కథనాలను ప్రశ్నించే వారిని జాతి వ్యతిరేకులుగా, గుజరాత్ వ్యతిరేకులుగా ముద్ర వేస్తున్నారు.

కార్పొరేట్-మతోన్మాద శక్తులతో కూడిన ప్రభుత్వం ఆవిర్భవించడానికి గుజరాత్‌లోని అభివృద్ధి కథనం చాలా విలక్షణంగా ఉపయోగపడింది. మొత్తంగా కార్పొరేట్ రంగం, పెట్టుబడిదారీ వర్గం అన్నీ మోడీ వెనుక, బిజెపి వెనుకే నిలబడ్డాయి. బడా వ్యాపారవేత్తల, వాణిజ్య సంస్థల చేతుల్లో పెద్ద ఎత్తున ఆస్తులు పోగుపడడం ద్వారా పారిశ్రామిక రంగం పురోగమించింది. మరోవైపు దేశంలోకెల్లా అత్యంత తక్కువ స్థాయిలో పట్టణ, గ్రామీణ కార్మికులకు వేతనాలు చెల్లించబడుతున్నాయి. ఒకవైపు అధిక స్థాయిలో వున్న రాష్ట్ర అభివృద్ధి, స్థూల దేశీయోత్పత్తి...మరోవైపు కింది స్థాయిలో వున్న సామాజిక సూచికల మధ్య వైరుధ్యమనేది చాలా తీవ్రంగా, ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

PEOPLE'S DEMOCRACY

ధరల పెరుగుల, నిరుద్యోగం, విద్యా, ఆరోగ్య సదుపాయాల లేమి, వీటన్నింటి కారణంగా నిరుపేద వర్గాల్లో, సామాజికంగా అణచివేతకు గురైన గ్రూపుల్లో తీవ్రంగా నెలకొన్న అసంతృప్తి ఎన్నికల ప్రచారంలో కనిపిస్తోంది. అయితే, గతంలో మాదిరిగానే, లోతుగా పాతుకుపోయిన ప్రస్తుత మతోన్మాద పోకడలను... ఇటువంటి కోపాలను, ఆగ్రహాలను చెదరగొట్టడానికి ఉపయోగించుకోవాలని చూస్తున్నారు.

మతోన్మాద ప్రచార లక్ష్యమైన ముస్లింలు చాలా దుర్భరమైన, దయనీయమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. నగరాల్లో, ఈ విభజన చాలా స్పష్టంగా కనిపిస్తుంది. ముస్లింలు వుండే ప్రాంతాలు సరైన మౌలిక వసతులు లేక దుర్భరమైన పరిస్థితుల్లో వున్నాయి. అయితే, విషపూరితమైన హిందుత్వ ప్రచారం, దానితో పాటు లబ్ధిదారులకు మరిన్ని ప్రయోజనాలు చేకూరుస్తామన్న హామీల వల్ల తమకు ఓట్లు వస్తాయన్న ధీమాతో బిజెపి వుంది.

ఈ విషపూరితమైన మతోన్మాద ప్రచారాన్ని కట్టడి చేసే చర్యలే లేవు. 2019లో జరిగిన అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో....ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పదే పదే ఉల్లంఘించి నరేంద్ర మోడీ, అమిత్ షాలు దోషులుగా తేలినప్పటికీ...ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకుని, చర్యలు తీసుకోవడంలో విఫలమైన కారణంగా ఈ మతోన్మాద ప్రచారమనేది సాధారణ అంశంగా మారిపోయింది. గుజరాత్‌లో ఈ ఎన్నికల ప్రచారానికి సంబంధించి, రిటైర్డ్ సీనియర్ సివిల్ సర్వెంట్ ఇ.ఎ.ఎస్.శర్మ ఎన్నికల కమిషన్‌కు ఒక లేఖ రాశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు అమిత్ షా పై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై ఇ.సి నుండి ఎలాంటి స్పందన లేదు. అదంతా పక్కనబెడితే, ఇప్పుడు ఇటువంటి విషయాల్లో చట్టాలను రూపొందించే స్థాయిలో షా హోం మంత్రిగా వున్నారు.

(పీపుల్స్ డెమోక్రసీ సంపాదకీయం)

భోపాల్ దుర్ఘటన నుండి నేర్చుకున్న పాఠం ఏమిటి ?

సందర్భం

అది 1984వ సంవత్సరం డిసెంబర్ 2వ తేదీ రాత్రి. మధ్యప్రదేశ్ రాష్ట్ర రాజధాని భోపాల్ నగరం. అమెరికాకు చెందిన అతి పెద్ద బహుళజాతి కంపెనీ యూనియన్ కార్బైడ్ కంపెనీ (యు.సి.సి.) నుండి మిథేల్ ఐసోసైనేట్ (ఎం.ఐ.సి.-మిక్) అనే 41 టన్నుల విషపూరిత రసాయన వాయువు ఒక స్టోరేజ్ ట్యాంకు నుండి నిద్రిస్తున్న నగరమంతటా వ్యాపించింది. 2,500 మంది అప్పటికప్పుడే మరణించగా క్రమంగా మృతుల సంఖ్య 22 వేల మందికి చేరింది. దాదాపు అయిదు లక్షల యాభైవేల మంది ప్రజలు తీవ్రమైన ప్రభావానికి గురయ్యారు. వందలాదిమంది శాశ్వతంగా వికలాంగులయ్యారు. గర్భిణీ స్త్రీలు మృత శిశువులను ప్రసవించారు. 15 వేల పశువులు, ఇంకా వేల సంఖ్యలో పక్షులు కూడా చనిపోయాయి. ఈ విషవాయువు వల్ల సంభవించే దీర్ఘకాలిక ప్రభావాల వల్ల నేటికీ ప్రజలు వైద్యం చేయించుకోవాల్సి వస్తున్నది.

ఈ దారుణమైన దుర్ఘటనకు కారకులెవరు? నిందితులను శిక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందా? బాధ్యులకు

భోపాల్ దుర్ఘటనకు 38 ఏళ్లు

శిక్షపడిందా? భోపాల్ ప్రజలకు తగిన విధంగా నష్టపరిహారం ఇచ్చారా? వారి వైద్య ఖర్చులు చెల్లించారా? ఇలాంటివి జరగకుండా అడ్డుకునేందుకు, జవాబుదారీతనం కల్పించేందుకు భారత ప్రభుత్వం గుణపాఠాలు తీసుకుందా? వీటన్నింటికీ ఒకే ఒక విషాదకరమైన సమాధానం ' లేదు ' అని మాత్రమే. అణుప్రమాదాల చరిత్రలోనే అతిపెద్దదైన ప్రమాదం జపాన్‌లోని ఫుకుషిమా ఘటన. దీని నుండి కూడా మన పాలకులు ఎటువంటి పాఠం నేర్చుకోలేదు. దీనికి మరో నిదర్శనం మన దేశంలో అణు ప్రమాదాలు సంభవించినప్పుడు అమెరికా కంపెనీలు బాధితులకు పరిహారం చెల్లింపు నుండి మినహాయింపు ఇవ్వటం.

భోపాల్ ప్లాంట్‌లో భద్రతాచర్యలు లేవనే సమస్యను ఆ ప్లాంట్‌లోని కార్మిక సంఘాలు పదే పదే లేవనెత్తాయి. వాటిని యాజమాన్యం, ప్రభుత్వం పట్టించుకోలేదు. కానీ చివరకు బాధపడిందెవరు? కార్మికులు, భోపాల్‌లోని పేదలు మాత్రమే. ప్లాంట్ చుట్టూ ఉన్న కార్మికుల కాలనీలు, పేదల బస్తీలు, మురికివాడల్లో నివసించేవారే ఎక్కువగా నష్టపోయారు. అందువల్ల న్యాయం కోసం జరిగిన ఈ పోరాటం కూడా దోపిడీ చేసేవారికి, బహుళజాతి కంపెనీల అత్యాశకు, ప్రభుత్వంలోని వారి మద్దతుదార్లకు వ్యతిరేకంగా దోపిడీకి గురౌతున్న పేదలు జరిపిన పోరాటమే. ఈ మొత్తం విషాదగాథ కొన్ని కఠోర సత్యాలను మన ముందుంచాయి. యుపిఎ, ఎన్‌డిఎ కేంద్ర ప్రభుత్వాలు అమెరికా, భారత బడా పెట్టుబడిదారులు, కార్పొరేట్ల ప్రయోజనాలను కాపాడుతూ వచ్చాయనేది మొదటిది. న్యాయ వ్యవస్థలో కూడా ఈ వర్గ పక్షపాతం ప్రతిబింబించింది. ఇక రెండవ సత్యం మరణించిన 22 వేల మంది, గాయపడిన లక్షలాది మంది ప్రజలు పేదవారే.

ప్రపంచంలో ఎక్కడా ఎవరూ ఉపయోగించ వీలులేని అధ్వాన్నమైన టెక్నాలజీని భోపాల్‌లో వాడినట్లు గ్యాస్ దుర్ఘటన సంభవించేవరకూ తెలియదు. ఇప్పటికీ భోపాల్ యు.సి.సి. ప్లాంట్‌లో వేలాది టన్నుల విషపూరిత పదార్థాలున్నాయి. ఆ విషపూరిత వ్యర్థాలు తీవ్ర పరిణామాలతో భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయి. వీటిని సక్రమంగా నిల్వ చేయకపోవడం వల్ల ప్రమాదం కొనసాగుతూనే ఉంది.

కార్పొరేట్, ఎం.ఎన్.సి శక్తివంత కంపెనీలు తమ చేష్టల వల్ల ప్రస్తుత తరంపైనా, రేపటితరాలపైనా చూపే ప్రభావాల గురించి పట్టించుకోవు. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు ఆర్జించే ఏకసూత్ర కార్యక్రమం వారిది. కాబట్టి మన దేశంలో పరిహారాలకు సంబంధించి కఠినమైన చట్టాలు తేవాలి. భోపాల్ దుర్ఘటనను ఎన్నడూ మరచిపోరాదు. దీనికి కారకులైనవారిని బోనులో నిలబెట్టాలి. యు.సి.సి ని చేపట్టిన నేటి డోవ్ కెమికల్ లేదా కేంద్ర, మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు భోపాల్ ప్లాంట్‌లోని వ్యర్థ పదార్థాలను తొలగించే బాధ్యత చేపట్టాలి. నష్ట పరిహారం పెంచాలి. బాధితుల కోసం సక్రమమైన వైద్య వ్యవస్థను ఏర్పాటుచేసి వారికి అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలి. ఒక స్వతంత్ర్య, స్వయంపాలక అణు భద్రతా నియంత్రణ సంస్థను ఏర్పాటు చేయాలి. భోపాల్ దుర్ఘటన నుండి గుణపాఠం నేర్చుకోకపోతే భవిష్యత్ తరాలు పాలక వర్గాలను క్షమించవు.

– ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

విజయనగరం టు గోవా!
మనవాళ్లు వట్టి వెధవాయిలోయ్!

సందర్భం

తె.ర

చాగంటి కోటేశ్వరరావుకు గురజాడ పురస్కారం అసంబద్ధమనీ, ఆ మహాకవి ఆశయాలకు విరుద్ధమనీ అభ్యుదయ వాదులు ఘోషించారు. ఆధ్యాత్మిక వాదులూ కొంతమంది అన్నారు. అభ్యుదయ ముద్ర గల కొందరు అటూ ఇటూ ఝుంఝూట పడ్డారు పాపం. అయినా చాగంటివారు నిరభ్యంతరంగా తీసేసుకున్నారు. ఇదే సమయంలో దేశంలో మరో చోట గోవాలో అంతర్జాతీయ చలన చిత్రోత్సవం జరిగింది. సంఘపరివార్ భావజాలాన్ని కూరి మరీ నిర్మించి, కాసులు పోసుకున్న కాశ్మీర్ ఫైల్స్ చిత్రాన్ని అక్కడ పోటీ విభాగంలో మరో పద్నాలుగు చిత్రాలతో పాటు ప్రదర్శించారు. సదరు పోటీకి న్యాయనిర్ణేతల బృందం అధ్యక్షుడుగా వ్యవహరించిన ఇజ్రాయిల్ దర్శకుడు నడవ్ లాపిడ్...ప్రదర్శించిన చిత్రాలలో కాశ్మీర్ ఫైల్స్ ఒక్కటే ప్రచార ప్రధానమైన చవకబారు చిత్రంగా వుందని ముగింపు ప్రసంగంలో కుండబద్దలు కొట్టారు. సృజనాత్మకతకు వేదిక కావాల్సిన ఈ గొప్ప ఉత్సవంలో ఇలాంటి రాజకీయ ప్రచార చిత్రాన్ని చూసి తామంతా దిగ్భ్రాంతి చెందామని ఆయన ఆవేదన వెలిబుచ్చారు. ఇలా అన్నందుకు ఆయనపై బిజెపి నేతలు విరుచుకుపడ్డారు. ఆఖరుకు నడవ్ లాపిడ్ వ్యాఖ్యలను భారత్ లోని ఇజ్రాయిలీ రాయబారి నవోర్ గిలోన్ తీవ్రంగా ఖండించారు. తమ దేశం తరపున క్షమాపణలు చెబుతున్నానన్నారు. ఈ రెండు ఉదంతాలలో ఉమ్మడి అంశంగా పురస్కారాలు తిరస్కారాలు. వాటి పట్ల ద్వంద్వ ప్రమాణాలు దేశంలో నడుస్తున్న తలకిందులు రాజకీయ తర్కాలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

గురజాడ పురస్కారం విషయానికి వస్తే చాగంటికి ఆ పురస్కార ప్రదానానికి కారణమైన గురజాడ నామకృత కమిటీ గాక సమర్థించిన ప్రముఖులు ఇద్దరే. ఒకరు సోము వీర్రాజు, మరొకరు జీవిఎల్ నరసింహారావు. తనకు గురజాడ పట్ల గొప్ప గౌరవం, భక్తి అని చెప్పిన చాగంటి వారు కూడా ఆయన భావాలపై, ఆశయాలపై అపారమైన నమ్మకం అనలేదు. తన ప్రవచనాలు చేయడం తప్ప ఇతర విషయాలు స్పృశించనని భావించేవారి కోసం వినదగు నెవ్వరు చెప్పిన శీర్షిక కింద అబ్రహం లింకన్, గురజాడ వంటి వారి గురించి చెప్పానని గుర్తు చేశారు. తన నిత్య ప్రవచన పరంపరలో గురజాడ ప్రసక్తి వుందనీ గాని తాను తరచూ ప్రస్తావిస్తుంటానని గాని చెప్పలేదు. పైగా ఆ కమిటీ వారు కూడా సాక్షాత్తూ జ్ఞాన సరస్వతి ఆలయంలో పురస్కారం అందించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారే గాని గురజాడ ఇంట్లోనో లేక మహారాజా వారి కోటలోనో ఈ పని పెట్టుకోలేదు. పైపెచ్చు గురజాడ వారు సంప్రదాయవాది అని కూడా సెలవిచ్చేశారు. చాగంటి వారికి గురజాడ పురస్కార ప్రదానం కన్నా దారుణమైన అపచారమిది. సంస్కార రహితమైన మానవతా విర్ధుమైన మూఢాచారాలన్నిటినీ నిష్కర్షగా తిరస్కరించిన గురజాడ స్మృతికి ఇంతటి కళంకం తెచ్చిన మాటలకు పాపము శమించుగాక అనుకోవడం తప్ప చేయగలిగింది లేదు. మంచి గతమున కొంచెమేనోయ్ అన్న గురజాడ భావాలకు పూర్తి విరుద్ధమైన చాగంటి ప్రతి మాట ప్రాచీన కాలాన్ని సనాతన ధర్మాలను కీర్తించేందుకు ఉద్దేశించినవే. ఆధునిక సదుపాయాలన్నీ అనుభవిస్తూనే కాలం చెల్లిన భావాలను కీర్తించడం, లౌక్యంగా సమర్థించడం, చాదస్తాలు రుద్దడం ఆయన నిత్యకృత్యం. అందులోనూ అధిక భాగం మహిళలపై కుమ్మరిస్తుంటారు. మచ్చుకు...స్త్రీ వారంలో రెండు సార్లు తల స్నానం చేస్తే నిత్య సౌభాగ్యవతిగా వుంటుంది, శివ పూజ చేసి ఈ మంత్రం జపిస్తే సంతానం తప్పక కలుగుతుంది, స్త్రీ రుతుస్నానం చేశాక మొట్టమొదట అది అస్సలు ముట్టకూడదు, స్త్రీ ఈ పొరబాటు చేస్తే భార్యాభర్తలు విడిపోవచ్చు, స్త్రీకి ఎంత కోపం వచ్చినా సరే ఈ మాటలు నోటి వెంట రాకూడదు, స్త్రీ ఈ చెట్టు పూలు తెంపితే సౌభాగ్యం తొందర్లోనే తొలగిపోతుంది, స్త్రీలు మైలతో ఈ పనులు అస్సలు చేయకూడదు....వినడానికి దుర్భరమైన ఈ స్త్రీ నీతులు ఇంతటిదో ఆపేద్దాం. అయినా ఈ మహావ్యక్తి గురజాడ పురస్కార గ్రహీత కాగలగడం ఈనాటి వికృత రాజకీయ సామాజిక పరిస్థితికి ప్రతిబింబం. పురస్కారం గురించి కాదు సమస్య, గురజాడ ఆశయాలకు కలిగే అపచారం గురించి బాధ. వ్యవహార భాషకు గురజాడ చేసిన మహోపకారం అంటూ 'దేశమనియెడు దొడ్డ వృక్షం ప్రేమలను పూలెత్తవలెనోయ్' అని చరణాలు చెప్పిన చాగంటి వారు దాన్ని వివరించడం కోసం వాల్మీకి శ్లోక స్మరణ చేసి సంస్కృతాంధ్ర వివరణ చేయడం కన్నా హాస్యం గిరీశం కూడా చేయలేడేమో. ఏం చేస్తాం! మనవాళ్లు వట్టి వెధవాయిలోయ్ అనుకోవడం తప్ప. అడుగుజాడ గురజాడది అది భావికి బాట అన్న శ్రీశ్రీ స్ఫూర్తి వీరికి ఎలా అర్థమవుతుంది? కొయ్యబొమ్మలు మెచ్చు కళ్లకు కోమలుల సౌరెక్కునా? తాంబూలాలిచ్చాం తన్నుకు చావండి అన్నట్టు అంతా అయిపోయింది గనక వదిలేద్దాం. స్వస్తి.



> తన నిత్య ప్రవచన పరంపరలో గురజాడ ప్రసక్తి వుందని గాని తాను తరచూ ప్రస్తావిస్తుంటానని గాని చెప్పలేదు. పైగా ఆ కమిటీ వారు కూడా సాక్షాత్తూ జ్ఞాన సరస్వతి ఆలయంలో పురస్కారం అందించి భక్తి ప్రపత్తులు చాటుకున్నారే గాని గురజాడ ఇంట్లోనో లేక మహారాజా వారి కోటలోనో ఈ పని పెట్టుకోలేదు. పైపెచ్చు గురజాడ వారు సంప్రదాయవాది అని కూడా సెలవిచ్చేశారు. చాగంటి వారికి గురజాడ పురస్కార ప్రదానం కన్నా దారుణమైన అపచారమిది. సంస్కార రహితమైన మానవతా విర్ధుమైన మూఢాచారాలన్నిటినీ నిష్కర్షగా తిరస్కరించిన గురజాడ స్మృతికి ఇంతటి కళంకం తెచ్చిన మాటలకు పాపము శమించుగాక అనుకోవడం తప్ప చేయగలిగింది లేదు.

ఇప్పుడు గోవా ఉత్సవం. ఎప్పుడైనా సరే గొప్పవారినే న్యాయ నిర్ణేతలుగా ఎంపిక చేస్తారు. వారి మాట అంతిమం. ఆ ప్రకారమే బహుమతులివ్వాలి. పోటీలకు వచ్చిన ఎంట్రీల నాణ్యత లోపాలోపాలు ఆ కమిటీ అధ్యక్షులు వివరించడం ఆనవాయితీ. ఆ ప్రకారమే లాపిడ్ తన నివేదిక నిచ్చారు. నిర్మోహమాటంగా అభిప్రాయాలు చెప్పారు. వివేక్ అగ్నిహోత్రి కాశ్మీర్ ఫైల్స్ బాక్సాఫీస్ విజయం ఎంతైనా దానివెనక వున్న సంఘ పరివార్ భావజాలాన్ని, కాశ్మీర్ 370 రద్దుకు సమర్థనగా వచ్చే ఎన్నికలలో బిజెపి కోసం ప్రచారం చేసిపెట్టే ప్రయత్నాన్ని భారతీయ మేధావి వర్గం చలనచిత్ర పరిశ్రమ ఇప్పటికే గుర్తించాయి (దానికి ముందు తాష్కెంట్ ఫైల్స్ తీసిన వివేక్ గురించీ, తెలుగులో కార్తికేయ2 తీసిన నిర్మాత అభిషేక్ అగర్వాల్ గురించి అందరికీ తెలుసు. ఇప్పుడు దర్శకుడు సుకుమార్ ఈ బృందంతో చేతులు కలపడం అనేక ప్రశ్నలకు అవకాశమిస్తోంది). బాధ్యతను బట్టి ఇజ్రాయిల్ దర్శకుడు ఆ మాటే చెప్పడం అపరాధమై పోయింది. అంటే అవార్డు ఎంపిక కమిటీ చైర్మన్ మర్యాదలు మంటకలిపి మరీ ఆయనను తిట్టి తిట్టిస్తున్నారు. జ్యూరీ సభ్యులు కూడా ఆయనపై ధ్వజమెత్తారు, వారంతా అంతర్గత చర్చలలో ఇదే మాట చెప్పి ఇప్పుడు ఒత్తిళ్లకు లోబడిపోయారని లాపిడ్ వెల్లడించారు. అంటే ఇక్కడ పురస్కార నిర్ణేతకు, నిపుణతకూ విలువే లేదన్నమాట. ఇంతా చేసి ఇజ్రాయిల్ జాత్యహంకారంతో బలమైన బంధం పెట్టుకున్నది బిజెపినే. ఆ దేశ దర్శకుడు కూడా భరించలేనంత మతతత్వం కాశ్మీర్‌ఫైల్స్‌లో తాండవ మాడిందన్న మాట. ఇదంతా చూసి రెచ్చిపోయిన వివేక్ అగ్నిహోత్రి కాశ్మీర్‌ఫైల్స్ అన్‌రిపోర్టెడ్ అంటూ మరో భాగం తీసేస్తానని బెదిరిస్తున్నాడు. అదో సాకు. అన్నీ వేదాల్లో వున్నాయష అనే అగ్నిహోత్రావధాన్లకు అగ్రపీఠం వేయడంలో గురజాడ సాంస్కృతీ సమాఖ్య అనౌచిత్యంగానీ, అతిథి దేవోభవ అంటూనే అత్యున్నతమైన చిత్రోత్సవ జ్యూరీ చైర్మన్ పైనే దారుణంగా దాడి చేసిన చిత్రోత్సవ ఆహ్వాన సంఘం అమర్యాదగానీ నాణానికి బొమ్మ, బొరుసు మాత్రమే తప్ప వేరే కాదు. ఒకప్పుడు సాహిత్యంలో నవ్య సంప్రదాయవాదులు అనేవారు వెలసినట్టు నేటి ప్రపంచంలో నియోకాన్స్ (నియో కన్జర్వేటివ్స్) అనే నూతన మితవాదులు పుట్టుకొచ్చారు. వీరు మతవాదాన్నీ ఆవాహన చేయడం సర్వసాధారణం. సవాలు దాన్ని ఎలా ఎదుర్కోవాలన్నదే. ఇదొక భావ సంఘర్షణ, ఆశయాల సమరం తప్ప అవార్డుల ముచ్చట కాదు.

★

ప్రజాశక్తి
www.prajasakti.com

బిజెపి హత్యాకాండపై నిరసనల వెల్లువ

- దేశవ్యాప్తంగా పలుచోట్ల ఆందోళనలు
- త్రిపురలో 'కాషాయ' మూకల క్రౌర్యం
- క్షతగాత్రులకు మాణిక్ సర్కార్ పరామర్శ

గాయపడిన సిపిఎం కార్యకర్తను పరామర్శిస్తున్న మాణిక్ సర్కార్

అగర్తల/న్యూఢిల్లీ : త్రిపురలోని ఛరిలాంలో బుధవారం నాడు అధికార బిజెపి గూండాలు సృష్టించిన హింసాకాండ, భయోత్పాత దాడులను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. పశ్చిమ బెంగాల్, కేరళ, ఢిల్లీ సహా అనేక ప్రాంతాల్లో వామపక్షాల శ్రేణులు, ప్రజా సంఘాలు, ప్రజాతంత్ర శక్తులు బిజెపి దాడులను తీవ్రంగా ఖండించాయి. త్రిపురలో సిపిఎం ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఛరిలాంలో బిజెపి మాఫియా శక్తులకు హద్దు అదుపు లేకుండా పోయిందని విమర్శించారు. అగర్తలలో భారీ ర్యాలీ నిర్వహించారు. హత్యాకాండకు పాల్పడిన దుండగులను తక్షణమే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని నినాదాలు హోరెత్తాయి. బిజెపి గూండాల చేతిలో హత్యకు గురైన షాహిద్ మియా అంత్యక్రియలకు ఏర్పాట్లలో పార్టీ సీనియర్ నాయకులంతా నిమగ్నమైనా స్థానిక ప్రజానీకమే ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొని బిజెపి ఆగడాలను నిరసించడం విశేషం. కొన్ని చోట్ల ప్రజలే స్వచ్ఛందంగా ర్యాలీలు చేపట్టారు. పోలీసుల పక్షపాత వైఖరిని కూడా నిరసనకారులు తీవ్రంగా ఖండించారు. అంత్యక్రియలకు అడ్డంకులు సృష్టించిన సిపాహిజలా ఎస్పి జగదీష్ రెడ్డి తీరును వారు ప్రత్యేకంగా తప్పుబట్టారు. ఆయన జగదీష్ రెడ్డిగా కాకుండా 'ఆర్ఎస్ఎస్' రెడ్డిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంతిమ సంస్కారాలకూ అడ్డంకులు

ప్రతిపక్షాలను భయభ్రాంతులకు గురి చేయడమే లక్ష్యంగా బిజెపి అధికార యంత్రాంగాన్ని పోలీసులను దుర్వినియోగం చేస్తోంది. కొందరు పోలీసులు ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు వ్యవహరిస్తున్నారు. బిజెపి గూండాల చేతిలో హత్యకు గురైన షాహిద్ మియా (65) మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంలోనూ పోలీసులు తీవ్ర అడ్డంకులు సృష్టించారు. కాషాయ మూకల దాడిలో తీవ్రంగా గాయపడటంలో బుధవారం ఆయనను జిబిపి ఆసుపత్రికి తరలించగా, అక్కడే తుది శ్వాస విడిచారు. గురువారం ఉదయం షాహిద్ మృతదేహానికి జిబిపి ఆసుపత్రిలోనే పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం వైద్యులు కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అప్పగిస్తుండగా అడ్డుకున్నారు. బిజెపి నేతల మెప్పు కోసం పోలీసులు ఆసుపత్రి వద్ద హైడ్రామా సృష్టించారు. జనసానికి ముందు నిర్వహించాలనుకున్న అంతిమ సంస్కారం (నజా ఇ జనజా) కార్యక్రమానికి అనుమతించలేదు. సాహిద్ మృతదేహాన్ని తమ వాహనంలో తీసుకెళ్లాలని ఆయన తమ్ముడు అబు మియా పోలీసులను ప్రాధేయపడ్డారు. స్థానిక ఎస్పి జగదీష్ రెడ్డి తిరస్కరించారు. ఆయన కనుసన్నల్లో స్థానిక ఎస్డిపిఒ (సదర్) అజయ్ దాస్ పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరింపజేసి ఘర్షణ వాతావరణాన్ని సృష్టించారు. దీంతో అబు మియా అక్కడే నిరసన చేపట్టారు. అజయ్ దాస్ ఆదేశాలతో అబుపైనా పోలీసులు విరుచుకుపడ్డారు. నిరసన చేపట్టిన చోటు నుంచి ఆయనను నడిరోడ్డు మీదకు ఈడ్చుకుని వెళ్లి దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జితేన్ చౌదరి, ఇతర సీనియర్ నాయకులతో కలిసి ఆసుపత్రి వద్దకు చేరుకున్నారు. పోలీసుల దౌర్జన్యాన్ని ఖండిస్తూ బైఠాయించారు. మరోవైపు పలువురు సీనియర్ నాయకులు రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద కూడా బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. షాహిద్ మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు తక్షణమే అప్పగించాలని, డిజిపి బయటకు రావాలని డిమాండ్ చేశారు. చివరకు డిజిపి ప్రతినిధి వచ్చి నాయకులతో సంప్రదింపులు జరిపారు. ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేయిస్తామని హామీ ఇవ్వడంతో సిపిఎం నాయకులు ఆందోళన విరమించారు. తర్వాత షాహిద్ మృతదేహాన్ని అబు మియా కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పోలీసు వర్గాలు తెలిపాయి.

15 మందికి తీవ్ర గాయాలు

ఛరిలాంలో బిజెపి గూండాల హింసాకాండలో షాహిద్ చనిపోగా, 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. మరికొందరు గాయపడ్డారు. స్థానిక జిబి పంత్ ఆసుపత్రిలో వీరు చికిత్స పొందుతున్నారు. వీరిని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్, రాష్ట్ర కార్యదర్శి జితేంద్ర చౌదరి, మాజీ మంత్రి మానిక్ దేవ్, సిఐటియు ప్రధాన కార్యదర్శి శంకర్ ప్రసాద్ దత్తా, రాష్ట్ర కమిటీ సభ్యులు పవిత్ర కౌర్ పరామర్శించారు. షాహిద్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

కాంగ్రెస్‌లో తిట్ల పోటీ : మోడీ

అహ్మదాబాద్ : కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో తనపై తిట్లను కురిపించే పోటీ నడుస్తోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. పంచమహల్ జిల్లా కలోల్ పట్టణంలో గురువారం జరిగిన ఎన్నికల ప్రచార సభలో ఆయన ప్రసంగించారు. తనపై ఎవ్వరు ఎంత తీవ్రంగా విమర్శలు గుప్పిస్తారో, ఎవరు ఎంతటి ఎక్కువ తీవ్ర పదజాలంతో దూషిస్తారో అనే పోటీ కాంగ్రెస్ నేతల మధ్య నెలకొందన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే చేసిన 'రావణ్' వ్యాఖ్యలను మోడీ ప్రస్తావించారు.

భారత్ జోడోయాత్రలో నటి స్వరభాస్కర్

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నుంచి గురువారం ప్రారంభమైన భారత్ జోడో యాత్రలో కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీతోపాటు ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రులు హరీష్ రావత్, దిగ్విజయ్‌సింగ్, ప్రముఖ సినీ నటి స్వరా భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ కార్యక్రమాల్లో మాంసాహారాన్ని నిషేధించాలి'

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రభుత్వ కార్యక్రమాల్లో మాంసాహారాన్ని నిషేధించాలని కోరుతూ బిజెపి ఎంపి పర్వేష్ సాహిబ్ సింగ్ ప్రైవేట్ మెంబర్ బిల్లును ప్రవేశపెట్టనున్నారు. పశ్చిమ ఢిల్లీకి చెందిన లోక్‌సభ సభ్యుడు పర్వేష్ సాహిబ్ సింగ్ పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును ప్రవేశపెట్టేందుకు లోక్‌సభ అనుమతి కోరారు. మరో బిజెపి ఎంపి రమా దేవి ప్రైవేట్ రంగంలో లంచం నిరోధించడానికి చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ బిల్లును ప్రవేశపెట్టడానికి అనుమతి కోరారు. శీతాకాల సమావేశాల్లో వివిధ పార్టీల ఎంపిలు మొత్తం 20 ప్రైవేట్ బిల్లులు ప్రవేశపెట్టేందుకు అనుమతి కోరారు.

రూ.3,232 కోట్లతో ఏపిలో రెండు రోడ్ల విస్తరణ

రాష్ట్రంలో రూ.3,232.77 కోట్లతో రెండు జాతీయ రహదార్ల విస్తరణకు కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు గురువారం కేంద్ర మంత్రి నితీన్ గడ్కరి తెలిపారు. రూ.1,500.11 కోట్ల వ్యయంతో ఏపిలోని అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో తిరుపతి ఎయిర్‌పోర్ట్ రోడ్డు సమీపంలో చిన్న ఓరంపాడు (జాతీయ రహదారి (ఎన్‌హెచ్)-565) నుంచి రేణిగుంట (ఎన్‌హెచ్-716) వరకు నాలుగు లైన్ల రహదారిగా విస్తరించనున్నామని తెలిపారు. రూ.1,732.66 కోట్ల వ్యయంతో ఏపిలో కడప, అన్నమయ్య జిల్లాల్లో కడప (కడప బైపాస్ రోడ్డుతో జంక్షన్) నుండి చిన్న ఓరంపాడు (ప్యాకేజీ-1) వరకు ఎన్‌హెచ్-716ను నాలుగు లైన్లగా విస్తరణకు ఆమోదించినట్లు వెల్లడించారు. తెలంగాణలోని మహబూబాబాద్ జిల్లాలో జాతీయ రహదారి-930(పి)లో తొర్రూర్ నుండి నెహ్రూ నగర్ సెక్షన్ నుండి రెండు లైన్ల విస్తరణ కోసం పునరావాసం, అప్‌గ్రేడేషన్‌కు రూ.675.45 కోట్లకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర మంత్రి నితీన్ గడ్కరి తెలిపారు.

జియాంగ్ జెమిన్‌కు నివాళి

- సిపిఎం సంతాపం

న్యూఢిల్లీ : చైనా కమ్యూనిస్టు పార్టీ (సిపిసి) మాజీ ప్రధాన కార్యదర్శి, దేశ మాజీ అధ్యక్షుడు జియాంగ్ జెమిన్ మృతి వార్త పట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) తీవ్ర విచారాన్ని వ్యక్తం చేసింది. సిపిసి మూడో తరానికి చెందిన కామ్రేడ్ జెమిన్ ప్రతిభావంతుడైన నేత అని , 'థియరీ ఆఫ్ త్రీ రిప్రజెంట్స్' సిద్ధాంతానికి ఆయన ఎప్పటికీ గుర్తుండిపోతారని సిపిఎం ఒక ప్రకటనలో పేర్కొంది. వివిధ బాధ్యతల్లో పార్టీకి, దేశానికి ఆయన సేవలందించారని పేర్కొంది. 1990వ దశకంలో సుస్థిరమైన ఆర్థిక శక్తిగా చైనా ఎదుగుదలకు గట్టి పునాదులను వేశారని ఆ ప్రకటన పేర్కొంది. ఆయన మృతికి సిపిఎం విచారాన్ని వ్యక్తం చేస్తోందని, పార్టీకి, దేశ ప్రజలకు సానుభూతిని తెలియజేస్తోందని ఆ ప్రకటన పేర్కొంది.

6న సంతాప సభ

ఈ నెల 6వ తేదీన బీజింగ్‌లోని గ్రేట్ హాల్ ఆఫ్ ది పీపుల్‌లో జెమిన్ సంస్మరణ సభ జరగనుంది. ఈ మేరకు చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నేతృత్వాన ఏర్పడిన అంతిమయాత్ర కమిటీ ఒక ప్రకటనలో వెల్లడించింది. కాగా, ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించే తేదీని ఇంకా ప్రకటించాల్సి వుంది. గురువారం మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో షాంఘై నుండి బీజింగ్‌కు జెమిన్ భౌతిక కాయాన్ని తరలించారు. విమానాశ్రయంలో భౌతిక కాయాన్ని స్వీకరించేందుకు జిన్‌పింగ్, ఇతర పార్టీ నేతలు వెళ్లారు.

భారత్ సంతాపం

చైనా నేత జెమిన్ మృతికి భారత్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది. 1950లో భారత్, చైనాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడిన తర్వాత 1996లో భారత్‌లో పర్యటించిన తొలి చైనా అధ్యక్షుడు ఆయనే అని పేర్కొంది. వివాదాస్పదమైన సరిహద్దు పొడవునా ఉద్రిక్తతలను తగ్గించడానికి కీలకమైన ఒప్పందంపై ఈ పర్యటనలో సంతకాలు జరిగాయి. బీజింగ్‌లోని భారత ఎంబసీ కూడా అధికారిక వెబో ఖాతాలో సంతాపాన్ని తెలియజేసింది.

'ఆ' డాక్టర్లకు జీతాలివ్వరా...

హైకోర్టు ఆగ్రహం

ప్రజాశక్తి, అమరావతి

కోవిడ్ వ్యాప్తి సమయంలో వైద్య సేవలు అందించిన కాంట్రాక్ట్ డాక్టర్లకు ఇప్పటి వరకు జీతాలు చెల్లించకపోవడంపై హైకోర్టు ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. కాంట్రాక్ట్ డాక్టర్లు వేసిన రిట్‌ను జస్టిస్ జి.రామకష్ణ ప్రసాద్ గురువారం విచారించారు. ప్రభుత్వం కౌంటర్ వేయాలని ఆదేశించారు. జీతాలు చెల్లించనందుకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఒక నెల జీతాన్ని ఎందుకు జప్తు చేయకూడదో చెప్పాలని కోరారు. విచారణను ఈ నెల 17కి వాయిదా వేశారు. కాంట్రాక్ట్ డాక్టర్ గీత్ సత్యసాయి స్వరూప్ సహా 10 మంది వేసిన రిట్ తరఫున అడ్వొకేట్ తాండవ యోగేష్ వాదిస్తూ, అనేకసార్లు ఆఫీసర్లుకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేదన్నారు. డాక్టర్ల జీతాల బకాయిల రిలీజ్ కోసం ఆర్థిక శాఖకు నేషనల్ హెల్త్ మిషన్ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ చాలాసార్లు కోరారని, అయినా స్పందన లేదని ప్రభుత్వ లాయర్ రమేష్ చెప్పారు. దీంతో ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఒక నెల జీతాన్ని ఎందుకు జప్తు చేయకూడదో చెప్పాలని హైకోర్టు ఆదేశించింది.

హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్‌కు తాత్కాలిక కమిటీ

అమరావతి : ఎపి హైకోర్టు అడ్వకేట్స్ అసోసియేషన్ కార్యవర్గ పదవీ కాలం ముగిసిన నేపథ్యంలో సంఘ విధుల నిర్వహణకు ఏడుగురు అడ్వకేట్స్‌తో తాత్కాలిక కమిటీ వేసినట్లు రాష్ట్ర బార్ కౌన్సిల్ హైకోర్టుకు తెలియజేసింది. సీనియర్ న్యాయవాదులు పి.శ్రీరఘురాం, వి.వేణుగోపాలరావు, అడ్వకేట్స్ పి.రాంభూ పాల్‌రెడ్డి, పి.శ్రీరాములు నాయుడు, టీఎస్ రాయలు, జీవి శివాజీ, జి తుహిన్ కుమార్‌లతో కమిటీ ఏర్పాటు చేసినట్లు నివేదించింది. దీనిపై స్పందించిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.దేవానంద్, తక్షణమే కమిటీ విధులను నిర్వహించాలని ఆదేశించారు. అసోసియేషన్‌కు గడువు తర్వాత కూడా ఎన్నికలు నిర్వహించకపోవడంపై లాయర్ ఎన్.విజయభాస్కర్ హైకోర్టులో దాఖలు చేసిన రిట్‌పై విచారణను ముగించారు.

బెంగాల్ మాజీ మంత్రి మనాబ్ ముఖర్జీ కన్నుమూత

కొల్‌కతా : పశ్చిమ బెంగాల్ విద్యార్థి, యువజనోద్యమ నాయకులు, మాజీ మంత్రి మనాబ్ ముఖర్జీ (67) మంగళవారం కన్నుమూశారు. తీవ్రమైన గుండెపోటు రావడంతో ఆయన నివాసంలోనే తుదిశ్వాస విడించారు. ఆయనకు భార్య ప్రొఫెసర్ ఇషితా ముఖర్జీ, కుమార్తె హియా ముఖర్జీ ఉన్నారు. బుధవారం జరిగిన ఆయన అంతిమయాత్రకు వేలాది మంది తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు. ప్రజాసందర్శనార్థం మంగళవారం రాత్రి నుంచీ ఆయన భౌతికకాయాన్ని సిపిఎం రాష్ట్ర కార్యాలయమైన ముజఫర్ అహ్మద్ భవనంలో ఉంచారు. ఆ తర్వాత సిపిఎం కొల్‌కతా జిల్లా కార్యాలయానికి తరలించారు. అనంతరం ఆయన భౌతికకాయాన్ని కలకత్తా విశ్వ విద్యాలయానికి వైద్య పరిశోధనల కోసం దానం చేశారు. మనాబ్ కళ్లను కూడా దానం చేశారు. మంచి వాక్‌చాతుర్యం కలిగిన మనాబ్ సభలు, సమావేశాల్లో మంచి వక్తగా గుర్తింపు పొందారు. 1955లో జన్మించిన ఆయన చిన్నతనంలో వామపక్షాల ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యారు. 1980, 90లలో విద్యార్థి, యువజన ఉద్యమాల్లో ఆయన కీలక పాత్ర పోషించారు. మనాబ్ మృతి పట్ల సిపిఎం ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ సలీం, లెఫ్ట్ ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఎ బేబీ, ఎఐకెఎస్ ప్రధానకార్యదర్శి హన్నన్ మొల్లా, ఐద్వా నాయకులు మైమునా మొల్లా ప్రభృతులు సంతాపం తెలిపారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమత బెనర్జీ కూడా మనాబ్ మృతికి సతాపం ప్రకటించారు. 1984లో ఎస్ఎఫ్ఐ కొల్‌కతా జిల్లా కమిటీ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత ఎస్ఎఫ్ఐ కేంద్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగానూ, 1986లో డివైఎఫ్ఐలో చేరి 1987లో జిల్లా అధ్యక్షునిగా ఎన్నికై సేవలందించారు. బెంగాల్ యువజనుల పత్రిక 'యువశక్తి' ఎడిటర్‌గానూ ఆయన పనిచేశారు. 1991లో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1986లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులయ్యారు. 1998లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. 2018లో రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. అనారోగ్య సమస్యలతో మధ్యలోనే ఆ బాధ్యతల నుంచి వైదొలిగారు. 1987లో బెలెగట్ట నుంచి అసెంబ్లీకి తొలిసారి ఎన్నికైన మనాబ్ 1996-2011 లెఫ్ట్‌ఫ్రంట్ ప్రభుత్వంలో యువజన వ్యవహారాలు, పర్యాటకం, చిన్న తరహా పరిశ్రమలు, ఉపాధి వంటి కీలక శాఖలకు మంత్రిగానూ సేవలందించారు.

ఇండోనేషియా ప్రభుత్వంపై దావా వేసిన దగ్గు మందు బాధితుల కుటుంబాలు

జకార్తా : ఇండోనేషియాలో కలుషితమైన దగ్గు మందును సేవించి మరణించిన, లేదా తీవ్ర అస్వస్థతకు గురైన బాధితుల కుటుంబాలు ఈ సిరప్‌ను సరఫరా చేసినందుకు సంబంధిత కంపెనీలు, ఇండోనేషియా ప్రభుత్వంపై దావా వేశాయి. దేశంలో ఆగస్టు నుంచి తీవ్ర కిడ్నీ సమస్యలు తలెత్తిన కేసులు పెరిగాయి. ఇప్పటివరకు 199 మంది మరణించారు. వీరిలో ఎక్కువమంది పిల్లలే వున్నారు. మొత్తంగా ఈ వ్యవహారంపై దర్యాప్తుకు ప్రభుత్వం ఆదేశించింది. కొన్ని ద్రవ రూప మందుల విక్రయాలపై నిషేధం విధించింది. యాంటీఫ్రీజ్ వంటి పారిశ్రామిక ఉత్పత్తుల్లో వినియోగించే రెండు కాంపౌండ్‌లను అధికంగా కలిగిన సిరప్‌లను విక్రయించినందుకు బాధ్యులుగా పేర్కొంటూ ఆరోగ్య మంత్రిత్వ శాఖ, ఆహార, ఔషధ విభాగం, ఏడు కంపెనీలపై కేసు నమోదు చేశారు. బాధితుల బంధువుల తరపు ప్రతినిధి అవాన్ పుర్యాది మాట్లాడుతూ, ప్రమాదకరమైన ఈ మందుల విక్రయాలను నివారించడంలో అధికారులు విఫలమయ్యారని, ఫలితంగా మరణాలు, తీవ్ర అస్వస్థతలు చోటు చేసుకున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులకు బాధ్యులుగా ఎవరినీ ప్రకటించకపోవడం తీవ్ర ఆవేదనకు గురి చేసిందని పుర్యాది గురువారం పేర్కొన్నారు. నవంబరు 18న కేసు ఫైల్ చేశారు.

దేశంలో 8 శాతం నిరుద్యోగ రేటు

- గత రెండు నెలల కంటే పెరిగిందన్న సిఎంఐఇ నివేదిక

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిరుద్యోగ రేటు పెరిగింది. నవంబర్‌లో నెలలో నిరుద్యోగ రేటు 8 శాతానికి పెరిగిందని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) పేర్కొంది. సిఎంఐఇ నివేదిక ప్రకారం.. సెప్టెంబర్, అక్టోబర్‌లో కంటే నవంబర్‌లో నిరుద్యోగ రేటు పెరిగింది. అత్యధిక నిరుద్యోగ రేటు పట్టణాల్లో నమోదైంది. సెప్టెంబర్‌లో 6.43 శాతం ఉన్న నిరుద్యోగ రేటు, అక్టోబర్ నాటికి 7.77 శాతానికి పెరిగింది. అది కాస్తా పెరిగి నవంబర్‌లో నిరుద్యోగ రేటు 8 శాతం నమోదైంది. గ్రామీణ ప్రాంతాల్లో కంటే, పట్టణాల్లోనే నిరుద్యోగం ఎక్కువగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో 7.55 శాతం నిరుద్యోగం రేటు ఉంటే, పట్టణాల్లో 8.96 శాతం నమోదైంది. నిరుద్యోగ రేటు పెరుగుదలలో హర్యానా (30.6 శాతం), రాజస్థాన్ (24.5 శాతం), జమ్ముకాశ్మీర్ (23.9 శాతం)తో మొదటి మూడు స్థానాల్లో ఉన్నాయి. ఆ తరువాత స్థానాల్లో బీహార్ (17.3 శాతం), త్రిపుర (14.5 శాతం), జార్ఖండ్ (14.3 శాతం), అస్సాం (14 శాతం), గోవా (13.6 శాతం), ఢిల్లీ (15.7 శాతం) రాష్ట్రాలు రెండంకెల నిరుద్యోగ రేటును నమోదు చేసుకున్నాయి.

నిరుద్యోగ రేటు ఏపిలో పెరుగుదల, తెలంగాణలో తగ్గుదల

నిరుద్యోగ రేటు ఆంధ్రప్రదేశ్‌లో పెరగగా, తెలంగాణాలో తగ్గింది. ఆంధ్రప్రదేశ్‌లో 9.1 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, తెలంగాణలో 6 శాతం నిరుద్యోగ రేటు నమోదైంది. ఏపిలో ఎనిమిది నెలల గరిష్టానికి నిరుద్యోగ రేటు చేరుకుంది. సెప్టెంబర్ (4.8 శాతం), అక్టోబర్ (5.3 శాతం) నిరుద్యోగ రేటు నమోదు కాగా, నవంబర్‌లో నిరుద్యోగ రేటు 9.1 శాతానికి పెరిగింది. తెలంగాణలో మాత్రం నిరుద్యోగ రేటు తగ్గింది. సెప్టెంబర్‌లో 8.3 శాతం, అక్టోబర్‌లో 8.8 శాతం నిరుద్యోగ రేటు నమోదు కాగా, నవంబర్‌లో 6 శాతానికి తగ్గింది.

నకిలీ సిబిఐ అధికారి శ్రీనివాస్‌తో సంబంధాలపై

గంగుల, రవిచంద్ర విచారణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

నకిలీ సిబిఐ అధికారి కొవ్విరెడ్డి శ్రీనివాసరావు కేసులో తెలంగాణ మంత్రి గంగుల కమలాకర్, రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్రలను సిబిఐ అధికారులు గురువారం విచారించారు. ఢిల్లీలోని తమిళనాడు భవన్‌లో సిబిఐ అధికారులు గత శనివారం అరెస్టు చేసిన నకిలీ సిబిఐ అధికారి కేసులో వీరిద్దరూ న్యాయవాదులతో కలిసి ఢిల్లీలోని సిబిఐ ప్రధాన కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. ఉదయం 11.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సుమారు 8.30 గంటల పాటు విచారణ జరిగింది. వారిని వేర్వేరుగా సిబిఐలోని ఎసిబి ఎస్‌పి షయాలీ తురత్, ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు విచారించారు. శ్రీనివాసరావుతో ఉన్న సంబంధాలు, ఆర్థిక లావాదేవీలు సహా జరిపిన సంభాషణలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తాము చెప్పిన అంశాలన్ని రికార్డు చేసుకున్నారని తెలిపారు. ఇది చివరి విచారణ, మళ్లీ విచారణ అవసరం లేదని అన్నారు. తమ సమాధానాలతో సిబిఐ అధికారులు సంతృప్తి చెందారని, తమతో ఎటువంటి లావాదేవీలు జరపలేదని శ్రీనివాసరావు ఒప్పుకున్నాడని చెప్పారు. తమ స్టేట్‌మెంట్‌పై సంతకాలు తీసుకున్నారని తెలిపారు. మున్నూరు కాపు సమావేశంలో రెండు సార్లు మాత్రమే కలిసామని, ఆయనతో ఎటువంటి లావాదేవీలు జరపలేదని అన్నారు.

ఇంతటితో ఈ అంశం పూర్తి : వద్దిరాజు రవిచంద్ర

ఇంతటితో ఈ అంశం పూర్తయిందని రాజ్యసభ ఎంపి వద్దిరాజు రవిచంద్ర అన్నారు. విచారణ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సిబిఐ అధికారులకు అన్ని అంశాలు వివరించామని, అన్ని విధాల సిబిఐ అధికారులకు సహకరించామని చెప్పారు. శ్రీనివాసరావు బంగారం తనే కొనుకున్నారని చెప్పారు. తమపై కొందరు ఆరోపణలు చేయించారని చెప్పారు. శ్రీనివాసరావును కాపు సమ్మేళనంలో కలిశామని అన్నారు.

ఎసిఎ ఫలితాల ప్రకటనపై హైకోర్టు స్టే

ప్రజాశక్తి, అమరావతి

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఎసిఎ) నూతనకార్యవర్గం(ఎపెక్స్ కౌన్సిల్) ఫలితాల ప్రకటనపై హైకోర్టు స్టే ఉత్తర్వులు జారీ చేసింది. ఎసిఎ రోజువారీ కార్యకలాపాల నిర్వహణతో పాటు బిసిసిఐ నుంచి నిధులు తీసుకొనేందుకు ప్రస్తుత కార్యవర్గానికి అనుమతిచ్చింది. ఈ నెల 14వ తేదీన జరిగే తదుపరి విచారణ వరకు ఈ అనుమతి ఇస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ సీహెచ్ మానవేంద్రనాథ్ రాయ్ గురువారం మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏసీఏ అధ్యక్షుడు శరత్‌చంద్రారెడ్డిని ప్రతివాదిగా చేసేందుకు పిటిషనర్‌కు పర్మిషన్ ఇచ్చి ఆయనకు నోటీసులు జారీ చేశారు. సిబిఐ కేసు విచారణ ఎదుర్కొనే శరత్‌చంద్రారెడ్డిని ఎసిఎ అధ్యక్షుడిగా కొనసాగించరాదంటూ చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయకుమార్ రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సుప్రీంకోర్టు, లోథాకమిటీ ఇచ్చిన గైడ్‌లైన్స్‌ను అమలు చేయకుండా ఎన్నికలు నిర్వహించారని, వాటి ఫలితాలను నిలుపుదల చేయాలని కోరారు.

అక్రమ నిధుల కోసం ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని వాడుకున్న ఆప్ నేతలు

- కోర్టుకు తెలిపిన ఇడి

న్యూఢిల్లీ : ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో అవకతవకలకు పాల్పడిన కేసుకు సంబంధించి అరెస్టయిన ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) నేత విజయ్ నాయర్‌కు ముడుపులుగా వంద కోట్ల రూపాయలు ముట్టాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) స్థానిక కోర్టుకు తెలియజేసింది. కొంతమంది వ్యాపారస్తులు, రాజకీయ నేతల నియంత్రణలో వున్న సౌత్ గ్రూపు నుంచి ఈ ముడుపులు అందాయని పేర్కొంది. ప్రభుత్వ ఖజానాను పణంగా పెట్టి అక్రమంగా నిధులను సమకూర్చుకునేందుకు ఆప్ నేతలు ఢిల్లీ ఎక్సైజ్ పాలసీని ఒక సాధనంగా ఉపయోగించుకున్నారని ఇడి బుధవారం కోర్టుకు తెలియచేసింది. ఇప్పటివరకు జరిగిన దర్యాప్తుల ప్రకారం, ఆప్ నేతల తరపున విజయ్ నాయర్‌కు వందకోట్ల రూపాయిల ముడుపులు సౌత్ గ్రూపు నుండి అందాయని, అమిత్ అరోరా ఈ విషయాలను వెల్లడించారని ఇడి తెలిపింది. శరత్‌రెడ్డి, కె.కవిత, మాగుంట శ్రీనివాసులు రెడ్డిల నియంత్రణలో ఈ సౌత్ గ్రూపు వుంది. ఈ ముడుపుల సాక్ష్యాలను దాచిపెట్టడానికి కనీసం 170 ఫోన్లను నాశనం చేశారని, అందులో డిప్యూటీ ముఖ్యమంత్రి మనీష్ శిసోడియా, సిఎం కేజ్రివాల్ పిఎ సహా 36మంది నిందితులు వున్నారని ఇడి పేర్కొంది.

ఎలాంటి విచారణకైనా సిద్ధం : కవిత

ఎలాంటి విచారణనైనా ఎదుర్కొనడానికి తాను, తన పార్టీ బిఆర్ఎస్ సిద్ధంగా వుందని కల్వకుంట్ల కవిత గురువారం తెలిపారు. సంబంధిత సంస్థలు తమ వద్దకు వచ్చి ప్రశ్నిస్తే సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా వున్నామని, అంతేకానీ ఎంపిక చేసిన లీక్‌లను మీడియాకు విడుదల చేయడం ద్వారా నేతల ప్రతిష్టను దెబ్బతీయడానికి చూస్తే ప్రజలు తిరస్కరిస్తారని హైదరాబాద్‌లో వ్యాఖ్యానించారు.

అఫ్తాబ్ పూనావాలాకు నార్కో పరీక్ష పూర్తి

న్యూఢిల్లీ : శ్రద్ధా వాకర్‌ను దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడు అఫ్తాబ్ పూనావాలాకు నార్కో అనాలిసిస్ టెస్ట్ గురువారం ఢిల్లీలో రోహిణిలోని బాబా సాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రిలో నిర్వహించారు. ఢిల్లీ పోలీసుల బందోబస్తు నడుమ ఈ పరీక్షను నిర్వహించారు. ఢిల్లీ కోర్టు విశ్లేషణకు అనుమతి ఇవ్వడంతో అఫ్తాబ్‌ను నార్కో పరీక్ష కోసం ఉదయం 9 గంటలకు తీహార్ జైలు నుంచి ఢిల్లీ పోలీసులు రోహిణిలో గల బాబా సాహెబ్ అంబేద్కర్ ఆసుపత్రికి తీసుకువచ్చారు. నార్కో అనాలిసిస్ పరీక్ష చేసేముందు అఫ్తాబ్‌కు రక్తపోటు, పల్స్ రేటు, శరీర ఉష్ణోగ్రత, హృదయ స్పందనలను తనిఖీ చేసే సాధారణ పరీక్షలను నిర్వహించారు. అనంతరం అతను నార్కో పరీక్షకు అంగీకరిస్తూ సమ్మతి పత్రంపై సంతకం చేశాడు. ఆ తర్వాత అఫ్తాబ్‌కు అనస్తీషియా ఇచ్చారు. అనంతరం నార్కో పరీక్షను చేపట్టారు. ఫోటో నిపుణుడు, ఫోరెన్సిక్ సైకాలజీ నిపుణుడు, ఫోరెన్సిక్ మెడిసిన్ వైద్యుడు, నోడల్ ఆఫీసర్, నార్కో, అంబేద్కర్ హాస్పిటల్‌తో కూడిన ఎఫ్ఎస్ఎల్ అధికారుల బృందం నార్కో పరీక్షను నిర్వహించింది. అఫ్తాబ్ నార్కో పరీక్ష 11.45 గంటలకు ముగిసింది. ఆ తర్వాత వైద్యుల పరిశీలనలో ఉంచడంతోపాటు అతనికి మానసిక చికిత్స అందించారు. అఫ్తాబ్‌కు పూర్తి స్పృహ వచ్చిన తర్వాత ఢిల్లీ పోలీసు బృందం పూర్తి భద్రతతో తీహార్‌కు తీసుకెళ్లింది.

కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే దాడులా?

- సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకిస్తే సిబిఐ, ఇడిలతో దాడులు చేయిస్తారా? అని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ప్రశ్నించారు. గురువారం నాడిక్కడ ఏపి, తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వాన్ని వ్యతిరేకించే రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యక్తులపై ఏకపక్షంగా దాడులు చేస్తున్నారని విమర్శించారు. దాడులప్రణాళిక రూపకల్పనలో మోడీ, అమిత్ షా కవల పిల్లలని దుయ్యబట్టారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.3 లక్షల కోట్ల విలువైన విశాఖ ఉక్కు కర్మాగారం అమ్మేస్తూ, రూ.11 వేల కోట్లు రోడ్లకు ఇస్తే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మురిసిపోతున్నారని ఎద్దేవా చేశారు. వైసిపిని వ్యతిరేకించే పవన్ కల్యాణ్‌ను పిలిచి బిజెపి పెద్దలు ఏదో చెప్పడంతో ఆయన స్వరం మారిపోయిందని ప్రశ్నించారు. వైసిపికి వ్యతిరేకంగా అంతా ఐక్యంగా ఉండాల్సిన సమయంలో పవన్ తప్పుకోవడం సరికాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మోడీ విధానాలను వ్యతిరేకిస్తున్నందున వారిపై దాడులు చేస్తున్నారని ఆయన విమర్శించారు. తాము మోడీని సమర్థిస్తున్నామని కెసిఆర్ అంటే రాత్రికి రాత్రే ఆ పార్టీ నాయకులపై ఉన్న కేసులన్నీ పోతాయని, గంగలో మునిగినట్లు పవిత్రులవుతారని ఎద్దేవా చేశారు. గతంలో వేరే పార్టీలో ఉండి బిజెపిలోకి వచ్చిన అస్సాం ముఖ్యమంత్రి, తృణమూల్ కాంగ్రెస్‌లో ఉండి శారదా, నారదా కుంభకోణంలో ఉన్నవారు బిజెపిలో చేరగానే ఎలా మారిపోయారో, వాళ్లపై కేసులు ఏమయ్యాయో అందరికీ తెలుసని అన్నారు. జి-20 సమావేశాల్లోపు మహిళా రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాలని, అందుకు ప్రస్తుత సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు.

అక్రమాలు బయటపడతాయనే అడ్డగింత

- 'చంద్రబాబు పర్యటన'పై టిడిపి నేత యనమల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ వైఫల్యం, జగన్ అక్రమాలు బయటపడతాయనే చంద్రబాబు నాయుడును అడ్డుకున్నారని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు యనమల రామకృష్ణుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ఏమైనా నిషేధిత ప్రాంతమా? ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు అని, దేశంలో ఎవరైనా సందర్శించే హక్కు ఉందని పేర్కొన్నారు. రివర్స్ పేరుతో కమీషన్లు దండుకోవడం తప్ప పోలవరంలో సాధించిన పురోగతి ఏంటని ప్రశ్నించారు. చంద్రబాబును పోలీసులు అడ్డుకోవడం పిరికిపంద చర్య అని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టిడిపి ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మరో ప్రకటనలో పేర్కొన్నారు. పోలవరం పాకిస్తాన్‌లో ఉందా? ప్రతిపక్ష నేతకు ప్రజల తరపున పోరాడే స్వేచ్ఛ లేదా? అని నిలదీశారు. చంద్రబాబు పోలవరం సందర్శనకు వెళ్తే తాడేపల్లి ప్యాలెస్ ఎందుకు కంపిస్తోందని తెలుగు యువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు విమర్శించారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటు బాధ్యత ప్రభుత్వానిదే : హైకోర్టు

అమరావతి : ప్రతి జిల్లాలో ఒక వృద్ధాశ్రమాన్ని ఏర్పాటు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హైకోర్టు పేర్కొంది. వయోవృద్ధుల సంక్షేమం, నిర్వహణ చట్టంలోని సెక్షన్ 19 ప్రకారం ప్రభుత్వాలు ఈ పనిచేయాల్సిఉందని తెలిపింది. ప్రభుత్వ ఆర్థిక సాయంతో వాటిని ఎన్‌జిఓలు నిర్వహించితే ప్రభుత్వం తన బాధ్యత నెరవేర్చినట్లు కాదని తెలిపింది. ప్రభుత్వం ఎన్‌జిఓలకు అప్పగించితే అప్పగించవచ్చునని, ప్రభుత్వం కూడా జిల్లాలో ఒకటి చొప్పున వద్ధాశ్రమాన్ని నిర్వహించాలని తెలిపింది. తదుపరి విచారణను ఈ నెల 15కి వాయిదా వేసింది.

త్రిపురలో బిజెపి హత్యాకాండ

(మొదటి పేజీ తరువాయి)

తెగబడుతోంది. పార్టీ కార్యాలయాలు, ప్రజాసంఘాల కార్యాలయాలను దౌర్జన్యంగా మూసివేయిస్తోంది. బెదిరింపులు, దౌర్జన్యాలతో బిజెపి రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది. ఈ క్రమంలోనే ఛరిలాంలో కూడా బిజెపి గూండాలు రెచ్చిపోయారు. ఇక్కడి సిపిఎం స్థానిక కమిటీ కార్యాలయాన్ని నాలుగున్నరేళ్ల క్రితం కాషాయ మూకలు బలవంతంగా మూసివేయించారు. బుధవారం నాడు సిపిఎం ఈ కార్యాలయాన్ని తిరిగి ప్రారంభిస్తుండగా బిజెపి అక్కసుతో దాడికి తెగబడింది. స్థానికంగా క్రియాశీలకంగా ఉండే సిపిఎం సభ్యుడు షాహిద్ మియాను హత్య చేశారు. మారణాయుధాలతో దాడులకు పాల్పడటంతో సీనియర్ నాయకులు, మాజీ ఆర్థిక మంత్రి, ఎమ్మెల్యే భానులాల్ సహాతో పాటు అనేక మంది తీవ్రంగా గాయపడ్డారు.

సుప్రీంలో మహిళా ధర్మాసనం

(మొదటి పేజీ తరువాయి)

మహిళా ధర్మాసనం ఏర్పాటు చేయాల్సి వచ్చింది. ఆ తరువాత 2018లో జస్టిస్ ఆర్. భానుమతి, జస్టిస్ ఇందిరా బెనర్జీతో కూడిన మహిళా ధర్మాసనం ఏర్పాటు అయింది. ప్రస్తుతం సుప్రీం కోర్టులో 27 మంది న్యాయమూర్తులు ఉండగా, అందులో ముగ్గురు మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. జస్టిస్ హిమాకోహ్లి, జస్టిస్ బివి నాగరత్న, జస్టిస్ బేలా ఎం. త్రివేది 2021 ఆగస్టు 31న ఒకే రోజు సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా ప్రమాణస్వీకారం చేశారు. వీరిలో జస్టిస్ బివి నాగరత్న సుప్రీం కోర్టు తొలి మహిళ సిజెఐగా బాధ్యతలు చేపట్టే అవకాశం ఉంది. 2027లో ఆమె 36 రోజుల పాటు సిజెఐగా బాధ్యలు నిర్వర్తించనున్నారు. సుప్రీం కోర్టు చరిత్రలో 11 మంది మహిళా న్యాయమూర్తులు ఉన్నారు. 1989లో జస్టిస్ ఫాతిమా బీవి తొలి మహిళా న్యాయమూర్తిగా నియామకం అయ్యారు. ఆ తరువాత జస్టిస్ సుజాత మనోహర్ (1994), జస్టిస్ రుమాపాల్ (2000), జస్టిస్ జ్ఞాన్ సుధామిశ్రా (2010), జస్టిస్ రంజనా ప్రకాష్ దేశాయ్ (2011), జస్టిస్ ఆర్. భానుమతి (2014), జస్టిస్ ఇందు మల్హోత్రా (2018), జస్టిస్ ఇందిరా బెనర్జీ (2018), జస్టిస్ హిమాకోహ్లి (2022), జస్టిస్ బివి నాగరత్న(2022), జస్టిస్ బేలా ఎం.త్రివేది (2022)లు నియామకం అయ్యారు.

మీ కోసం

గ్యాస్ స్టవ్ కొత్తదానిలా మెరవాలంటే నిమ్మకాయ తొక్కలను ఉడికించి ఆ నీటిలో స్పాంజిని ముంచి తుడవాలి.

జీవన సౌరభం

తన ఆలోచనలను ఇతరులతో పంచుకోవడం, ఎదుటివాళ్ల మాటకు విలువివ్వడం అలవరచుకొంటే జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవచ్చు.

ఆంధ్రులు గర్వించదగ్గ శాస్త్రవేత్త

ఎన్నో మహమ్మారి వ్యాధులకు విరుగుడు కనుక్కున్న శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లా ప్రగడ సుబ్బారావు.

ఆయన పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో 1895లో జనవరి 12న జన్మించారు. ఏడుగురు సంతానంలో మూడోవాడు. ఆయన చిన్నతనంలో తండ్రి జగన్నాథం అనారోగ్యంతో చనిపోయారు. ఇంట్లో పరిస్థితి అర్థమయ్యి సుబ్బారావు మనసు చదువు మీద నిలవలేకపోయింది. తర్వాత తల్లి ప్రోత్సాహంతో సుబ్బారావు చదువు మీద దృష్టిపెట్టారు. మద్రాస్ మెడికల్ కాలేజిలో మెడిసిన్ చేశారు. చదువుకునే రోజుల్లోనే శేషగిరితో వివాహం అయ్యింది.

అప్పట్లో గాంధీ స్వదేశీ ఉద్యమం చేత ప్రభావితుడైన సుబ్బారావు బ్రిటిష్ వస్తువులని వాడడం మానేశారు. ఎంబిబిఎస్ చదివి కూడా మద్రాస్ ఆయుర్వేదం కాలేజీలో అనాటమీ లెక్చరరుగా చేరారు. సన్నిహితుల సలహాతో పరిశోధనలు నిమిత్తం

1923లో అమెరికాకు వెళ్లారు. జేబులో 100 డాలర్లతో బాస్టన్ నగరంలో దిగాడు సుబ్బారావు. దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటూ ఆస్పత్రిలో పనిచేస్తూ చదువుకున్నారు. హార్వర్డ్ మెడికల్ స్కూలు నుంచీ ట్రాపికల్ మెడిసిన్‌లో డిప్లొమా సాధించాడు. తర్వాత క్రయస్ ఫిస్క్ అనే శాస్త్రవేత్తకి చెందిన బయోకెమిస్ట్రీ లాబరేటరీలో చేరారు. రక్తంలోను, మూత్రంలోను ఫాస్ఫరస్ శాతాన్ని అంచనా వెయ్యడానికి ఓ కొత్త పద్ధతి కనిపెట్టారు. అదే ఫిస్క్-సుబ్బారావ్ పద్ధతిగా పేరు పొందింది. కండరాల సంకోచమే కాదు సమస్త జీవక్రియలకి శక్తి మూలం ఆడెనొసిన్ ట్రైఫాస్ఫేట్ అనే అణువు అని కనుక్కున్నారు. ఈ పరిశోధనే అతడికి డాక్టరేట్ పట్టాన్ని తెచ్చిపెట్టింది.

ఆ తర్వాత తీవ్ర సమస్యగా మారిన ఎనీమియా వ్యాధి మీద ధ్వజం ఎత్తాడు. పంది కాలేయం నుంచి విటమిన్ బి12 వెలికి తీసి, ఎనీమియాకి విరుగుడుగా పనిచేస్తుందని నిరూపించాడు. మరిన్ని పరిశోధనల కోసం పెద్ద ఫార్మసూటికల్ కంపెనీలో చేరారు. రోజుల తరబడి ల్యాబ్‌లో ఉండి ఫోలిక్ ఆసిడ్‌ని కనుగొని ప్రజలను ఎనీమియా భారీ నుంచి రక్షించారు. అక్కడితో ఆగక సుబ్బారావు, అతడి వైజ్ఞానిక బృందంతో కలిసి ఎన్నో వ్యాధికారకాలకు విరుగుడైన యాంటీబయోటిక్స్ టెట్రాసైక్లిన్ మందు తయారుచేశారు. పోలియో, కాన్సర్ వ్యాధుల మందులకు పరిశోధనలూ చేసి ఫలితాలు సాధించి వైద్యవృత్తిలో కొత్త ఆవిష్కరణలు సృష్టించారు. చివరకు 1948, ఆగస్టు 9న గుండెపోటుతో మరణించారు.

నేను గీసిన బొమ్మ

- యమ్. ప్రకాష్,
8వ తరగతి,
బీరంగూడ, సంగారెడ్డి జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రాచీన కలంకారీ ప్రావీణ్యుడు

భారతదేశ ప్రాచీన కళగా ప్రసిద్ధిచెందిన కలంకారీ కళకు చిత్తూరుజిల్లా శ్రీకాళహస్తి ప్రసిద్ధి. నేడు దేశవిదేశాల్లో విశేష ప్రజాదరణ పొందిన ఈ కళ తొలితరం కళాకారులు ఆ ప్రాంతం వారే. అంతరించిపోతున్న ఎన్నో ప్రాచీన కళల జాబితాలోకి కలంకారీ కళ చేరకుండా ఆ కళాకారులు చేస్తున్న నిర్విరామకృషి వెలకట్టలేనిది. అలా ఏమాత్రమూ ప్రజాదరణ లేని కాలం నుంచి ప్రస్తుత ప్రాభవ్యం కొనసాగుతున్న రోజుల వరకు ఈ కళనే నమ్ముకుని ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన వ్యక్తి వేలాయుధం శ్రీనివాసుల రెడ్డి. కళపై ఉన్న మక్కువ నేడు ఆయనను జాతీయస్థాయి అవార్డుకు ఎంపికచేసింది. కళాకారులు ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించే 'శిల్పగురు' అవార్డు వరించిన సందర్భంగా జీవనతో ఆయన పలు విషయాలు ముచ్చటించారు.

'నేను పుట్టి పెరిగింది శ్రీకాళహస్తి. ఐదేళ్ల వయసప్పుడే నాన్న చనిపోయారు. కుటుంబ భారం మొత్తం అమ్మపై పడింది. ఒంటిచేత్తో ఐదుగురు బిడ్డల ఆలనాపాలనా చూసిన ఆమె పెంపకంలో పెరిగిన నేను బాల్యంలో ఎన్నో కష్టాలు అనుభవించాను' అంటున్న శ్రీనివాసులు తల్లి ఆడపిల్లల పెళ్లి చేసిన తరువాత కొడుకు భవిష్యత్తు తీర్చిదిద్దడం కోసం తపనపడింది. కానీ చదువులో చురుకుగా ఉంటున్న కొడుకును పదోతరగతి మించి చదివించలేని స్థోమత ఆమెది. అయితే విద్యార్థిగా రకరకాల బొమ్మలు వేసే కొడుకు ఆసక్తిని గమనించి అప్పుడప్పుడే శ్రీకాళహస్తిలో సొగసులద్దుకుంటున్న కలంకారీ కళలో తర్ఫీదుకు పంపింది. అలా కృష్ణారెడ్డి దగ్గర కలంకారీ కళలో శ్రీనివాసులు తొలి అడుగు పడింది. ఆ తరువాత ఎల్ కృష్ణయ్య వద్ద కలంకారీలో డిప్లొమా చేశారు శ్రీనివాసులు. ఇదంతా 1980లో జరిగిన సంగతి.

ఆనాటి కలంకారీ..

'ప్రాచీన కళగా దేశవిదేశాల్లో విశేష ప్రాచుర్యం ఉన్న కలంకారీ కళకు ఆనాడు ఇప్పుడున్నంత ఆదరణ లేదు. మీటరు నుంచి 15 మీటర్ల పొడవున్న జాడా వస్త్రంపై(ఒకలాంటి నేత) రామాయణ, మహాభారత ఘట్టాలు చిత్రించేవారు. వాటిని దేవాలయాల్లో గోడచిత్రాలుగా అమర్చేవారు. భారతదేశ చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఈ వస్త్రాలను విదేశీయులు ప్రత్యేకంగా తయారు చేయించుకుని వెళ్లేవారు. అంతకుమించి మరే ఇతర రూపాల్లో కలంకారీ కళ ప్రజలకు చేరువకాలేదు' అంటూ నాటి విషయాలు గుర్తుచేసుకున్నారు.

ప్రాచీన కళ.. 17 దశలు..

'జాడా వస్త్రానికి గంజిపెట్టి ఆరబెడతారు. చిక్కటి బర్రెపాలు, నానబెట్టి రుబ్బిన కరక్కాయ గుజ్జు కలిపిన మిశ్రమాన్ని జాడాకు బాగా పట్టిస్తారు. ఆ తరువాత ఎండబెట్టిన జాడాపై రంగులు అద్దడం ఓ పెద్ద ప్రహసనం. తాటిబెల్లం, మంచిబెల్లం కలిపి పానకంలా చేసి అందులో తుప్పుపట్టిన ఇనుపముక్కలను ఓ కుండలో 15 రోజులు నానబెట్టి ఇంకును తయారుచేస్తారు. దాంతో జాడాపై ముందుగా చింతచెట్టు పుల్లలతో సిద్ధం చేసుకున్న బొమ్మలపై ఒక క్రమపద్ధతిలో రంగులద్దడం మొదలుపెడతారు. జాడాపై ఇంకుతో దిద్దుతున్నప్పుడు ఆ చిత్రం నలుపురంగులో తయారవుతుంది. ఎరుపు రంగు రావడం కోసం పటిక పొడిని బొమ్మ అడుగు భాగంపై జల్లుతారు. ఆ తరువాత అనవసర పటిక పొడి వదిలేలా జాడాను ప్రవహించే నీటిలో పెడతారు. అయితే పటిక పొడి పూర్తిగా వదలదు. దీంతో జాడాకు మొదట చేసిన పద్ధతిలో కరక్కాయ గుజ్జును పట్టించి చేవాలపొడి, సురులపట్ట వేసిన మరుగుతున్న నీటిలో ఉడకబెడతారు. ఇప్పుడు పటిక ఉన్న చోట అంతా ఎరుపు రంగులో పటిక లేని చోట గులాబీ రంగు వస్తుంది. ఇక ఇప్పుడు అనవసరంగా ఉన్న గులాబీ రంగును వదిలించడం కోసం గొర్రె పెంటికలతో పేడనీళ్లు తయారుచేసి అందులో రాత్రంతా నానబెడతారు. ఉదయాన్నే నదీతీరం వెంబడి ఇసుకతిన్నెల్లో సూర్యరశ్మి బాగా తగిలేచోట జాడాను ఎండబెడతారు. అలా మూడురోజులు ఒకవైపు, ఇంకో మూడు రోజులు రెండోవైపు ఎండిన జాడాలో గులాబీ రంగు పూర్తిగా పోతుంది. ఇప్పుడు జాడాకు మళ్లీ గేదెపాలను పట్టిస్తారు. కరక్కాయ పువ్వును మరిగించి పసుపు రంగు తయారుచేసుకుంటారు. నీలి ఆకులతో ఇండికా రంగును సిద్ధం చేసుకుంటారు. సహజసిద్ధంగా లభించే పదార్థాలతోనే రంగులద్దుతారు. ఇలా ఎంతో కఠోర శ్రమ చేసిన తరువాత కలంకారీ కళ సిద్ధమవుతుంద'ని ప్రాచీన కలంకారీ ప్రాశస్త్యం గురించి శ్రీనివాసులు చెబుతున్నప్పుడు ఆయనలో మనకు చేయి తిరిగిన కళాకారుడు కనపడతాడు.

'అసలైన కలంకారీ కళ ఇప్పుడు కనిపించడం లేదు. ఇప్పుడొస్తున్న కలంకారీ చీరలు, దుపట్టాలు, ఇంకా రకరకాల వస్త్రాలపై వస్తున్న కళ రూపం మారింది. మారుతున్న రోజులకు అనుగుణంగా కలంకారీ తన రూపం మార్చుకుంది. బతుకుదెరువు కోసం మనసుకు కష్టంగా ఉన్నా నేనూ అప్పుడప్పుడూ కలంకారీ చీరలు తయారుచేస్తుంటాను' అంటూ చెబుతున్నప్పుడు ఆయన మాటల్లో ఎంతో ఆవేదన ప్రతిధ్వనిస్తుంది.

'శిల్పగురు' పెయింటింగ్..

ఒక పెయింటింగ్‌లో నవగ్రహాలు, శ్రీచక్రంలో అష్టలక్ష్ములు, దశావతరాలు వేసిన మరో పెయింటింగ్, ఇంకో పెయింటింగ్‌లో పద్మవ్యూహం చిత్రించి అవార్డు కోసం పంపించారు. 'కాళహస్తి నుంచి చాలామంది కళాకారులకు జాతీయ స్థాయిలో గుర్తింపువచ్చింది. నేను వారికి భిన్నంగా ఎంచుకుని ఇప్పుడు ఈ అవార్డు అందుకున్నాను' అంటున్నారు శ్రీనివాసులు.

చరిత్ర గురించి చెబుతూ..

శ్రీకృష్ణదేవరాయల ఆస్థానంలో విశేష ప్రజాదరణ పొందిన కలంకారీ కళ ఆ తరువాతి కాలంలో అంతరించే దశకు చేరుకుంది. అలా కలంకారీకి పుట్టినిల్లైన కాళహస్తిలో ముగ్గురు కళాకారులు మాత్రమే మిగిలారు. 1955లో కళా ఉద్యమకారిణి కమలాదేవీ ఛటోపాధ్యాయ కలంకారీ గురించి పుస్తకాల్లో చదివి కళాకారులను వెతుక్కుంటూ ఇక్కడికి వచ్చారు. అయితే ఈ కళ చాలా పవిత్రమైనది. ఇతర కులాలు చేయడానికి వీలు లేదు అంటూ కళను నేర్పించేందుకు ఇద్దరు కళాకారులు తిరస్కరించారు. ముగ్గురిలో జొన్నలగడ్డ లక్ష్మయ్య మాత్రమే కళను ఇతరులకు పంచేందుకు ముందుకు వచ్చారు. అలా అప్పుడు మొదలైన శిక్షణాకేంద్రాల్లో మొదట ఆరుగురు విద్యార్థులే ఉండేవారు. క్రమంగా దేశంలో కలంకారీకి ఆదరణ పెరగడంతో ప్రస్తుతం ఎంతోమంది కళాకారులు దేశ నలుదిశలా విస్తరించారు. కలంకారీ కళను విదేశాలకు ఎగుమతులు చేయడంలో కూడా ఎంతోమంది ప్రోత్సాహం ఉంది. ప్రస్తుతం కాళహస్తి మొత్తం మీద 1500 కుటుంబాలకు చెందిన 5 వేల మంది స్త్రీ, పురుష కళాకారులు దీనిపై ఆధారపడుతున్నారు. మచిలీపట్నం, అనంతపురం, హైద్రాబాద్ తదితర ప్రాంతాలకు కళ విస్తరించింది.

'బతుకుదెరువు కోసం ఎంతోమంది కళాకారులు నూతన ఒరవడిలో కొట్టుకుపోతున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నా... ఆకలి బాధ తీరాలన్న తప్పదు.. కాని నేను ఆ మార్గంలో నడవలేకపోయాను. ఎంతో ప్రాశస్త్యమున్న ప్రాచీన కళ రూపం మారిపోతుందని ఎంతో బాధపడుతుంటాను. ఆ బాధ మాటల్లో చెప్పలేను. గత్యంతరం లేక ఆధునిక పోకడలను అనుసరిస్తున్నా ప్రాచీన కళ జీవం పోకుండా కాపాడడంలో శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నాను. జొన్నలగడ్డ కుటుంబం వారు పలు జాతీయ అవార్డులు అందుకున్నారు. ఆ కుటుంబం తరువాత నాకే 'శిల్పగురు' అవార్డు వచ్చింది. ఈ అవార్డు నాకు కాదు. నా కలంకారీ కళకు' అంటున్నారు ఎంతో ఆనందంగా..

- జ్యోతిర్మయి

అవార్డులు

1994లో తమిళనాడు ప్రభుత్వం నుంచి రాష్ట్ర అవార్డు వచ్చింది. 2010లో ఆంధ్ర ప్రభుత్వం నుంచి లేపాక్షి అవార్డు, 2014లో కేంద్ర ప్రభుత్వం నుంచి 'జాతీయ నైపుణ్య' అవార్డు దక్కింది.

పారిశుధ్య కార్మికులకు పనిభద్రత

- మంత్రి సురేష్‌కు సంఘం వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాజధాని అమరావతి పరిధిలో పనిచేస్తున్న తమకు పని భద్రత కల్పించాలని పారిశుధ్య కార్మికులు పట్టణాభివృద్ధిశాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను కోరారు. ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు ఆధ్వర్యంలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు, సిఐటియు నేతలు మంత్రి సురేష్‌ను గురువారం ఉదయం విజయవాడలోని క్యాంపు కార్యాలయంలో కలిసి వినతిపత్రం సర్పించారు.

మంత్రి సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌సి లక్ష్మణరావు, పారిశుధ్య కార్మిక సంఘం నాయకులు

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ లక్ష్మణరావు, నాయకులు రవి తదితరులు మాట్లాడుతూ 29 గ్రామాల పరిధిలో పారిశుధ్య కార్మికులు, హైకోర్టు, అసెంబ్లీ పరిధిలో పనిచేస్తున్న వారిని ఆప్కాస్‌లోకి తీసుకోవాలని కోరారు. కార్మికుల ఖాతాల్లో పిఎఫ్ సక్రమంగా జమ చేయడం లేదని, కార్మికులకు ఇఎస్ఐ కార్డులు ఇవ్వడం లేదని మంత్రికి వివరించారు. హైకోర్టు కార్మికులకు పదివేలు, గ్రామాల్లో పనిచేస్తున్న వారికి రూ.12 వేలు మాత్రమే ఇస్తున్నారని, జిఓ ప్రకారం జీతాలు ఇప్పించాలని కోరారు. పనినుండి తొలగిస్తే దళిత, గిరిజన,బలహీనవర్గాలకు చెందిన కుటుంబాలకు రోడ్డున పడతాయని తెలిపారు.

రానున్న సంవత్సరానికి బడ్జెట్లో నిధులు కేటాయించాలనీ కోరారు. నాలుగు నెలలుగా జీతాలు లేవని తెలపగా సిఆర్‌డిఎ కమిషనర్‌తో మాట్లాడి వెంటనే జీతాలు ఇప్పించే ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సిఐటియు డివిజన్ నాయకులు భాగ్యరాజు, వేణు, సుఖవేణి, బుజ్జి, భూలక్ష్మి, దివ్య, కనకమ్మ ఉన్నారు.

ఇదేం విజి'లెన్స్'

- కమిషన్ అసంతృప్తి

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో విజిలెన్స్ కేసుల నిర్వహణ, దర్యాప్తు జరుగుతున్న తీరు పట్ల విజిలెన్స్ కమిషన్ అసంతృప్తి వ్యక్తం చేసింది. 2020-21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రభుత్వానికి తాజాగా పంపిన నివేదికలో పలు ఈ మేరకు పలు అంశాలను కమిషన్ ప్రస్తావించింది. రానున్న కాలంలో తీసుకోవాల్సిన చర్యలపై ప్రభుత్వానికి సూచనలు చేసింది. అవినీతిపై విచారణ అన్నది కాకుండా ముందుగానే అవినీతి జరగకుండా చూడాలని సూచించింది. వివిధ శాఖల్లో ఈ తరహా కేసులను పరిశీలించి దర్యాప్తు చేయగల సామర్థ్యం ఉన్న ఉద్యోగులు, అధికారులు లేరని కమిషన్ అభిప్రాయపడింది. దీనికోసం ఆన్‌లైన్ తరగతులు నిర్వహించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. కేంద్రంలో ఇటువంటి కేసులను పరిశీలించేందుకుగాను పదవీ విరమణ చేసిన నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకుంటున్నారని, ఇక్కడ కూడా అదే తరహాలో ఒక్కో కేసుకు ఒక్కో రిటైర్డ్ అధికారిని నియమించుకుంటే బాగుంటుందని సూచించింది. క్రమశిక్షణ చర్యలకు సంబంధించిన కేసుల విచారణ జరిగే ట్రిబ్యునళ్లలో న్యాయాధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొంది. అందువల్ల ఈ కేసులను తిరిగి ఇంక్వయిరీస్ కమిషనరేట్‌కు పంపిస్తున్నారని పేర్కొంది. కేసులకు సంబంధించి నిశితంగా అధ్యయనం చేసేందుకు మానవ వనరుల అభివృద్ధి సంస్థలో ప్రత్యేకంగా ఒక అధ్యయన విభాగాన్ని ఏర్పాటు చేయాలని సూచించింది.

ఒక కేసుకు రెండు సంస్థ విచారణ

ఇదే సమయంలో ఒకే కేసును ఎసిబి, విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థలు సమాంతర విచారణ చేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయని గుర్తించినట్లు కమిషన్ పేర్కొంది. దీనివల్ల భిన్నమైన సిఫార్సులు వస్తున్నాయని, ఇది ఎబ్బెట్టుగా మారుతోందని కమిషన్ పేర్కొంది. అందువల్ల సమన్వయ సమావేశాలు జరగాల్సి ఉందని సూచించింది. అది కూడా సిఎస్ స్థాయిలో జరిగితే మేలని వ్యాఖ్యానించింది. అన్ని శాఖల్లో చీఫ్ విజిలెన్స్, విజిలెన్స్ అధికారులను నియమించాలని కూడా స్పష్టం చేసింది.

కేసుల ఉపసంహరణపైనా

అనేక శాఖలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల విజ్ఞప్తుల మేరకు కేసులను ఉపసంహరిస్తున్నట్లు ప్రకటిస్తున్నాయని ఆక్షేపించింది. ముందుగా కేసులపై ఎసిబి అభిప్రాయాలను తెలుసుకుని, వాటిని కూడా ఉపసంహరణ ఆదేశాల్లో పొందుపరచాలని , విజిలెన్స్ కమిషన్ అనుమతి కూడా తీసుకోవాలని సూచించింది.

పోలీస్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలి

- డివైఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితి పెంచాలని డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు వై రాము, జి రామన్న గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టుల సంఖ్యను, పరీక్ష గడువునూ పెంచాలని డిమాండ్ చేశారు. ఎపి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా విడుదల చేసిన నోటిఫికేషన్‌లో ఫైర్, జైలు వార్డెన్ పోస్టుల ప్రస్తావనే లేదని పేర్కొన్నారు. ప్రతి ఏటా పోలీస్ శాఖలో 6,700 ఎస్ఐ, కానిస్టేబుల్ ఖాళీ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల ముందు సిఎం హామీ ఇచ్చారని గుర్తు చేశారు. దీని ప్రకారం 20,100 పోస్టులు విడుదల చేయాల్సి ఉందన్నారు. మూడేళ్ల తర్వాత ఖాళీలతో, నిరుద్యోగుల సంఖ్యతో సంబంధం లేకుండా నోటిఫికేషన్ ఇవ్వడం అన్యాయమని పేర్కొన్నారు. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన శాఖలో ఖాళీలు ఉండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖలో సంస్కరణలు అమలు చేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటూ వీక్లి ఆఫ్ ప్రకటించిందని, అమలు చేయడం లేదని విమర్శించారు. దీనిని అమలు చేస్తే సుమారు 10 వేల మంది పోలీసులు అదనంగా అవసరమవుతారని తెలిపారు. నాలుగేళ్ల నుంచి పోలీస్ శాఖలో ఎటువంటి నోటిఫికేషన్ లేదని తెలిపారు. వయోపరిమితి సడలింపు ఇవ్వాలని కోరారు. ఎస్ఐ, పోలీస్ కానిస్టేబుళ్లకు పరిమితి 35 ఏళ్లకు పెంచాలని, ప్రాథమిక పరీక్ష గడువునూ పెంచాలని డిమాండ్ చేశారు. మాటతప్పను, మడమ తిప్పనని చెప్పిన సిఎం నిరుద్యోగులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని కోరారు. లేదంటే నిరుద్యోగులతో కలిసి డివైఎఫ్ఐ ఆధ్వర్యాన పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

ఎన్‌డిటివికి రవీశ్‌కుమార్ రాజీనామా

న్యూఢిల్లీ : ఎన్‌డిటివిలోని సుదీర్ఘకాలం పని చేసిన సీనియర్ జర్నలిస్టు రవీష్ కుమార్ ఆ సంస్థకు రాజీనామా చేశారు. రామన్ మెగసెసె అవార్డు గ్రహీత అయినా రవీశ్ కుమార్ రాజీనామా చేసిన విషయాన్ని ఎన్‌డిటివి గ్రూప్ ప్రెసిడెంట్ సుపర్ణ సింగ్ ఉద్యోగులకు ఇ-మెయిల్ ద్వారా తెలిపారు.

తాను ఇకపై సొంత యూ ట్యూబ్ ఛానల్‌లో వార్తలను అందించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఎన్‌డిటివి ప్రమోటర్ సంస్థ అయిన ఆర్ఆర్‌పిఆర్ హోల్డింగ్ లిమిటెడ్ వ్యవస్థాపకులు రాధికా రాయ్, ప్రణయ్ రాయ్ డైరెక్టర్ల హోదా నుంచి వైదొలిగిన విషయం తెలిసిందే.

బెల్జియం ఔట్..

- ప్రి క్వార్టర్స్‌కు క్రొయేషియా, మొరాకో
- నేటితో ముగియనున్న గ్రూప్ లీగ్ పోటీలు

దోహా: 2018 సీజన్ ఫిఫా ప్రపంచకప్ సెమీఫైనలిస్ట్ బెల్జియం జట్టు ఈసారి గ్రూప్ దశలోనే నిష్క్రమించింది. గురువారం ఉత్కంఠభరితంగా సాగిన గ్రూప్-ఎఫ్ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో బెల్జియం జట్టు 2018 ఫైనలిస్ట్ క్రొయేషియాతో మ్యాచ్‌ను 0-0తో డ్రా చేసుకుంది. రెండు అర్ధభాగాల సమయం ముగిసే సరికి ఇరుజట్లు గోల్స్ చేయడంలో విఫలమయ్యాయి. దీంతో క్రొయేషియా జట్టు 5పాయింట్లతో రెండోస్థానంలో నిలువగా.. బెల్జియం జట్టు 4పాయింట్లతో మూడోస్థానానికే పరిమితమైంది. ఇక ఇదే గ్రూప్‌లో జరిగిన మరో పోటీలో మొరాకో జట్టు 2-1గోల్స్ తేడాతో కెనడాను ఓడించి 7పాయింట్లతో అగ్రస్థానానికి ఎగబాకి నాకౌట్‌కు అర్హత సాధించింది. మొరాకో తరఫున హకీం 4వ ని.లో, యూసెఫ్ 23వ ని.లో ఒక్కో గోల్ కొట్టగా.. కెనడా తరఫున ఏకైక గోల్‌ను నయెూఫ్ కొట్టాడు. 2018లో మొరాకో జట్టు లీగ్ దశలోనే నిష్క్రమించగా.. ఈసారి నాకౌట్‌కు అర్హత సాధించడం విశేషం. 2018 సీజన్‌లో క్రొయేషియా ఫైనల్‌కు చేరి ఫ్రాన్స్ చేతిలో ఓడి రన్నరప్‌తో సరిపుచ్చుకుంది. 3వ స్థానంలో జరిగిన పోటీలో బెల్జియం ఇంగ్లండ్‌ను 2-0 తో ఓడించింది. నేటి అర్ధరాత్రి జరిగే గ్రూప్-జి లీగ్ పోటీలతో ఫిఫా ప్రపంచకప్ లీగ్ దశ పోటీలు ముగియనున్నాయి.

ప్రి క్వార్టర్స్‌కు అర్జెంటీనా, పోలండ్

గ్రూప్-సినుంచి ప్రి క్వార్టర్స్‌కు అర్జెంటీనా, పోలెండ్ జట్లు చేరాయి. బుధవారం అర్ధరాత్రి జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో అర్జెంటీనా జట్టు 2-0గోల్స్ తేడాతో పోలండ్‌ను ఓడించగా.. మరో మ్యాచ్‌లో మెక్సికో 2-1గోల్స్ తేడాతో సౌదీ అరేబియాను చిత్తుచేసింది. మెక్సికో-సౌదీ అరేబియా జట్ల మ్యాచ్‌లో సౌదీ జట్టు గెలిస్తే నేరుగా ప్రి క్వార్టర్స్‌కు చేరేది. కానీ ఆ జట్టు పరాజయం నాకౌట్ ఆశలను దెబ్బతీశాయి. ఇక మెక్సికో జట్టు గెలిచినా.. ఆ జట్టు సౌదీకి ఒక గోల్ సమర్పించుకోవడంతో ఫలితం తారుమారైంది. దీంతో ఈ గ్రూప్ నుంచి పోలండ్ జట్టు ఓడినా.. 4పాయింట్లతో మెక్సికోతో సమంగా నిలిచి ఒక గోల్ అంతరంతో రెండోస్థానంలో నిలిచింది.

గ్రూప్-బి, డి పాయింట్ల పట్టిక

దేశం	ఆ	గె	డ్రా	ఓ	చే.గో.	ఇ.గో.	గో.వ్య.	పా
గ్రూప్-సి								
అర్జెంటీనా	3	2	0	1	5	2	3	6
పోలండ్	3	1	1	1	2	2	0	4
మెక్సికో	3	1	1	1	2	3	-1	3
సౌదీ అరేబియా	3	1	0	2	3	5	-2	3
గ్రూప్-ఎఫ్								
మొరాకో	3	2	1	0	4	1	3	7
క్రొయేషియా	3	1	2	0	4	1	3	5
బెల్జియం	3	1	1	1	1	2	-1	3
కెనడా	3	0	0	3	2	7	-5	0

ఫిఫా ప్రపంచకప్‌లో నేడు...

గ్రూప్-హెచ్: ద.కొరియా X పోర్చుగల్(రా.8.30గంIIలకు)
ఘనా X ఉరుగ్వే(రా.8.30గంIIలకు)
గ్రూప్-జి: సెర్బియా X స్విట్జర్లాండ్(రా.12.30గంIIలకు)
కామరూన్ X బ్రెజిల్(రా.12.30గంIIలకు)

టీమిండియా ఢాకాకు పయనం

బంగ్లాదేశ్‌తో వన్డే, టెస్ట్ సిరీస్‌లు.. అందుబాటులో రోహిత్, కోహ్లి

ముంబయి: న్యూజిలాండ్ పర్యటన ముగియడంతో టీమిండియాజట్టు బంగ్లాదేశ్ పర్యటనకు సిద్ధమైంది. ఈ పర్యటనలో భాగంగా బంగ్లాదేశ్‌తో మూడు వన్డేల సిరీస్‌తోపాటు మరో రెండు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లోనూ తలపడనుంది. న్యూజిలాండ్ పర్యటనకు దూరంగా ఉన్న కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు విరాట్ కోహ్లి జట్టుకు అందుబాటులోకి వచ్చారు. టీమిండియా ఆటగాళ్లు గురువారం సాయంత్రం ఢాకాకు బయల్దేరిన ఫొటోలను బిసిసిఐ ట్విటర్‌లో పోస్ట్‌చేసింది. బంగ్లాదేశ్ వన్డే కెప్టెన్‌గా తమీమ్ ఇక్బాల్ వ్యవహరించనున్నాడు. మెగా టోర్నీ ముగిశాక న్యూజిలాండ్ పర్యటనకు విశ్రాంతి తీసుకొన్న సీనియర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, మహమ్మద్ షమీ వచ్చేస్తున్నారు. అయితే పంత్‌తో పాటు వికెట్ కీపర్ల జాబితాలోకి ఇషాన్ కిషన్‌కు అవకాశం దక్కింది. సంజూ శాంసన్‌కు చోటు కల్పించలేదు. రవీంద్ర జడేజా ఉన్నప్పటికీ.. ఫిట్‌నెస్ సాధించాల్సి ఉంది. గాయం నుంచి పూర్తిగా కోలుకోకపోవడంతో బుమ్రాను బిసిసిఐ ఎంపిక చేయలేదు.

వన్డే సిరీస్‌కు జట్టు: రోహిత్ శర్మ(కెప్టెన్), కేఎల్ రాహుల్(వైస్ కెప్టెన్), ధావన్, కోహ్లి, పటీధార్, శ్రేయస్, త్రిపాఠి, రిషభ్ పంత్, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్లు), జడేజా, అక్షర్, సుందర్, శార్దూల్, షమీ, సిరాజ్, చాహర్, యశ్ దయాళ్.

వన్డే సిరీస్ షెడ్యూల్....

డిసెంబర్ 4 : తొలి వన్డే(ఢాకా)
డిసెంబర్ 7 : రెండో వన్డే(ఢాకా)
డిసెంబర్ 10 : మూడో వన్డే(చిట్టగాంగ్)

టెస్టు సిరీస్..

తొలి టెస్ట్ : డిసెంబర్ 14-18(చిట్టగాంగ్)
రెండో టెస్ట్ : డిసెంబర్ 22-26(ఢాకా)

ఇంగ్లండ్ ప్రపంచ రికార్డు

నలుగురు సెంచరీలు 75ఓవర్లలో 506పరుగులు

రావల్పిండి: 17 ఏళ్ల తర్వాత.. పాక్ గడ్డపై అడుగుపెట్టి టెస్టు క్రికెట్ ఆడుతున్న ఇంగ్లండ్ ప్రపంచ రికార్డును బద్దలు కొట్టింది. టెస్టు క్రికెట్‌లో తొలి రోజు ఆటలో అత్యధిక పరుగులు చేసి.. ఆస్ట్రేలియా ప్రపంచ రికార్డును బ్రేక్ చేసింది. 1910లో ఆస్ట్రేలియా జట్టు దక్షిణాఫ్రికాపై సిడ్నీలో టెస్టు ఆడుతూ.. తొలి రోజు 6 వికెట్లు కోల్పోయి 494 పరుగులు చేసింది. తాజాగా ఇంగ్లండ్ 112 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది. పైగా తొలి రోజు ఒక జట్టు నలుగురు ఆటగాళ్లు సెంచరీలు చేయడం కూడా రికార్డే. పాక్ బౌలర్లును చీల్చి చెండాడుతూ... ఇంగ్లండ్ జట్టు తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఓవర్లలో ఏకంగా కేవలం 4 వికెట్లు కోల్పోయి 506 పరుగుల భారీ స్కోర్ చేసింది. ఇందులో నలుగురు ఆటగాళ్లు సెంచరీల మోతమోగించారు.



కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో

సాదియాకు నాలుగు స్వర్ణాలు

ప్రజాశక్తి - మంగళగిరి(గుంటూరు జిల్లా)

కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన సాదియా అల్మస్ మరోసారి తన సత్తాచాటింది. గత నెల 27 నుండి గురువారం వరకు న్యూజిలాండ్‌లో నిర్వహించిన కామన్‌వెల్త్ పవర్ లిఫ్టింగ్ 57కిలోల జూనియర్ విభాగంలో సాదియా ఏకంగా నాలుగు స్వర్ణాలు సాధించి విదేశీగడ్డపై ప్రతిభను చూపింది. మొత్తం 417.5కిలోల బరువును ఎత్తి కామన్‌వెల్త్ జూనియర్స్ స్ట్రాంగ్ ఉమన్ టైటిల్‌తోపాటు మూడు కామన్‌వెల్త్ రికార్డులను నెలకొల్పినట్లు కోచ్ షేక్ సందాని తెలిపారు. కెఎల్ యూనివర్సిటీలో బిఎ(ఐఎఎస్) మూడో సంవత్సరం చదువుతోంది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68